14 వైద్యాధికారుల పోస్టులు భర్తీ


ఇంటర్వ్యూ చేస్తున్న కలెక్టర్ మురళి, డీఎంహెచ్‌వో అప్పయ్య

ఇంటర్వ్యూలు నిర్వహించిన కలెక్టర్

భూపాలపల్లి టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఖాళీగా ఉన్న 14 వైద్యఆరోగ్య అధికారుల పోస్టులను భర్తీ చేస్తూ కలెక్టర్ ఆకునూరి మురళి ఉత్తర్వులు జారీచేశారు. 9 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, రెండు సామాజిక ఆసుపత్రులలో నియమించారు. 15 పోస్టులలో కాంట్రాక్ట్ వైద్యుల నియామకం కోసం **మిగతా 2లో...**

ఈనాడు
జయశంకర్ భూపాలపల్లి
సోమవారం 28 ఆగస్టు 2017 | 16 పేజీలు

ప్రజాప్రతినిధులున్న వేళ..!

ఎమ్మెల్యే స్వగ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు అంతంతే!

చొరవ చూపితేనే వందశాతం సాధ్యం

ఇప్పటికైనా దృష్టి సారించాలి

స్వగ్రామం
నివాసాలు
మరుగుదొడ్లు లేనివి


తాటికొండ రాజయ్య, స్టేషన్‌ఘన్‌పూర్


అరూరి రమేశ్, వర్ధన్నపేట


బానోత్ శంకర్‌నాయక్, మహబూబాబాద్


ఎర్రబెల్లి దయాకర్‌రావు, పాలకుర్తి


కడియం శ్రీహరి, ఉప ముఖ్యమంత్రి


దొంతి మాధవరెడ్డి, నర్సంపేట


ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, జనగామ


మధుసూదనాచారి, భూపాలపల్లి


అజ్మీరా చందూలాల్, ములుగు


చల్లా ధర్మారెడ్డి, పరకాల


కొండా సురేఖ, వరంగల్‌తూర్పు


డీఎస్.రెడ్యానాయక్, డోర్నకల్

స్వగ్రామం	నివాసాలు	మరుగుదొడ్లు లేనివి
స్టేషన్‌ఘన్‌పూర్	2610	759
ఉప్పుగల్లు	1134	369
బాలాజీతండా	34	26
పర్వతగిరి	1214	356
అమీనాబాద్	680	357
పున్నేలు	1058	166
నర్సక్కపల్లి	970	220
జగ్గన్నపేట	780	160
ప్రగతిసింగారం	720	210
వంచనగిరి	748	91
ఉగ్గంపల్లి	617	313

వ్యాధులు దరిచేరకూడదంటే..
మనం ఆరోగ్యంగా ఉండాలంటే..
వాతావరణం కలుషితం కాకూడదంటే..
జలవనరులు స్వచ్ఛంగా ఉండాలంటే..
మహిళల గౌరవానికి భంగం కలగకూడదంటే..
ప్రతి కుటుంబం తప్పనిసరిగా వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలి.

గ్రామాలన్నీ స్వచ్ఛతగా ఉండాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.. స్వచ్ఛ తెలంగాణ కోసం సీఎం కేసీఆర్ ముందడుగు వేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎమ్మెల్యేల స్వగ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు ఎలా ఉన్నాయనే విషయమై 'న్యూస్‌టుడే' బృందం పరిశీలన చేసింది. నిర్మాణాలు అంతంత మాత్రంగా ఉన్నాయి. కేవలం ముప్పై, నలభై శాతం ఇళ్లలో మాత్రమే అవి కనిపించాయి. నిధులున్నా.. నిర్మించుకునే విధంగా చైతన్యపరిచేవారు లేరు. ప్రజాప్రతి'నిధులు'న్నా ఏం లాభం అంటున్నారు గ్రామస్థులు .

వివరాలు 2లో...

న్యూస్‌టుడే, భూపాలపల్లి టౌన్

ఇంకా స్పందించలే!

ఆలోచనలోనే స్వచ్ఛ ఆటోడ్రైవర్ ఓనర్ పథకం

భూపాలపల్లి, న్యూస్‌టుడే: పురపాలికల ద్వారా పట్టణాల్లో ప్రజలకు నిత్యం అందే సేవల్లో పారిశుద్ధ్యం కీలక సేవగా పరిగణిస్తారు. నిత్యం చెత్త తొలగింపు, కాలువల శుభ్రం, ఇంటింటి నుంచి చెత్త సేకరణ ఆశించిన రీతిలో జరగకపోతే ప్రజల నుంచి పెదవి విరుపులు, విమర్శలు తప్పవు. పురపాలక సంఘాలకు వచ్చే ఆదాయంలో సింహభాగం పారిశుద్ధ్య నిర్వహణకు వెచ్చించాల్సి వస్తోంది. ఈ క్రమంలోనే పురపాలక శాఖ చెత్తసేకరణకు ఇటీవల 'స్వచ్ఛ ఆటోటిప్పర్స్ డ్రైవర్‌కమ్ ఓనర్' పథకం ప్రవేశపెట్టింది. దీని ముసాయిదా, నిబంధనలు తదితర వివరాలను పురపాలికలకు పంపించింది. ఈ నెల 4న వెలువడిన ఉత్తర్వులను పరిశీలించి మూడు రోజుల్లో సూచనలు, సలహాలు **మిగతా 2లో...**



కేయూకు దక్కేనా ఏ-ప్లస్ గ్రేడు!

నేటి నుంచి న్యాక్ బృందం పర్యటన

కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలో సంప్రదాయ విశ్వవిద్యాలయాల్లో రెండో పెద్దది కాకతీయ యూనివర్సిటీ. ఇప్పటికే రెండుసార్లు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) గుర్తింపు పొందింది. 2003లో జాతీయ స్థాయిలో బీ-ప్లస్, 2009లో ఏ-గ్రేడును సాధించింది. ముచ్చటగా మూడోసారి ప్రస్తుతం ఉన్న గ్రేడును మెరుగుపరుచుకొని.. ఏ-ప్లస్ సాధించడానికి సిద్ధమైంది. దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యాసంస్థలకు గ్రేడును కేటాయించేందుకు యూజీసీ ప్రత్యేకంగా న్యాక్‌ను ఏర్పాటు చేసింది. ఈసంస్థ నియమించే పీర్ కమిటీ బృందం విశ్వవిద్యాలయాలను సందర్శించి నివేదికలు రూపొందిస్తుంది. న్యాక్ పీర్ కమిటీ బృందం సోమవారం నుంచి మూడు రోజుల పాటు కేయూలో పర్యటిస్తుంది. ఇందుకోసం ఉపకులపతి ఆచార్య ఆర్. సాయన్న, రిజిస్ట్రార్ ఆచార్య కె.పురుషోత్తం, కేయూ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ డైరెక్టర్, ఉన్నతాధికారులు, వివిధ విభాగాల శాఖాధిపతులు సకల ఏర్పాట్లు చేశారు. న్యాక్ ఏయే అంశాలకు ప్రాధాన్యం ఇస్తుందో.. వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా విభాగాల వారీగా ప్రగతి నివేదికలు రూపొందించారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిచ్చి రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. బోధన, పరిశోధన, అభివృద్ధి, అకడమిక్ రంగాల్లో రాణిస్తున్న తీరు, క్రీడా, ఎన్ఎస్ఎస్, విద్యార్థి సంక్షేమం, గ్రంథాలయం తదితర అంశాలపైన నివేదికలను సిద్ధం చేశారు. వీటిని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్(పీపీటీ) ద్వారా న్యాక్ బృందానికి వివరిస్తారు.

ఈ బృందం ఏం చేస్తుంది: ఏడుగురితో న్యాక్ నియమించిన **మిగతా 2లో...**

రైలు బండి ఎప్పుడూ ఆలస్యమేనండి..!

3లో..



సాధించి చూపాలనుకుంటే.. ఏదైనా సాధ్యమే!

మధ్యపేజీల్లో...



పంటల బీమాపై ధీమా ఏది..?

వివరాలు 11లో...

ప్రజాప్రతి'నిధులు'న్న వేళ..!

న్యూస్‌టుడే, భూపాలపల్లి టౌన్

ప్రజలను చైతన్య పర్చడంలో ప్రజాప్రతినిధులది కీలక పాత్ర. ఎమ్మెల్యేలు, ఎంపీలు దృష్టి పెడితే వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేయడం పెద్ద సమస్యేమీకాదు. ఎమ్మెల్యేలు తల్చుకుంటే కానిదంటూ ఏమీ ఉండదు. ఎందుకంటే ప్రభుత్వమే కాదు మరుగుదొడ్ల నిర్మాణం కోసం చాలా స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయి. ఈ సంస్థలతో మాట్లాడి సమస్య పరిష్కరించే వెసులుబాటు ఎమ్మెల్యేలకు ఉంది. ఇప్పటికైనా శాసనసభ్యులు నియోజకవర్గం అభివృద్ధిపై ఎంత శ్రద్ధ చూపిస్తారో.. అదేవిధంగా తమ సొంత గ్రామాల అభివృద్ధిపై కూడా కాస్త చొరవ చూపించాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు కోరుతున్నారు.

స్పీకర్ మధుసూదనాచారి: శాసనసభాపతి, భూపాలపల్లి ఎమ్మెల్యే సిరికొండ మధుసూదనాచారి స్వగ్రామం వరంగల్ రూరల్ జిల్లా పరకాల మండలం నర్సక్కపల్లి. గ్రామంలో 970 గృహాలుండగా 60 శాతం ఇళ్లలో మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. చాలా మంది ప్రభుత్వ నిధులతో నిర్మించుకోవడానికి ఎదురుచూస్తున్నారు. స్పీకర్ కాస్త దృష్టిపెడితే ఈ గ్రామం వందశాతం మరుగుదొడ్లు నిర్మించుకున్న గ్రామంగా అవతరించడం ఖాయమని గ్రామస్థులు అంటున్నారు.

ధర్మారెడ్డి: వరంగల్ రూరల్ జిల్లా శాయంపేట మండలం ప్రగతిసింగారం. చాలామందికి ప్రభుత్వం తరఫున మరుగుదొడ్లు మంజూరైనప్పటికీ.. పనులు చేసుకోవడానికి జాప్యం చేస్తున్నారు. అధికారులే ప్రత్యేక దృష్టిపెట్టి సామూహిక మరుగుదొడ్ల నిర్మాణ కార్యక్రమం చేపడితే కేవలం నెల రోజుల్లో వంద శాతం పూర్తిచేయవచ్చని గ్రామస్థులు చెబుతున్నారు. ఎమ్మెల్యే ధర్మారెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తే స్వగ్రామంలో మరుగుదొడ్ల సమస్య తీర్చినవారవుతారు.

మంత్రి చందూలాల్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు మండలం జగ్గన్నపేట. ఈగ్రామానికి సారంగపల్లి, అన్నంపల్లి, పులిగుండం, చిన్నగుంటూరుపల్లి శివారు పల్లెలు ఉన్నాయి. సారంగపల్లిలో 35 డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం జరుగుతుంది. ఇవి పూర్తయితే ఆ ఇళ్లకు పక్కా మరుగుదొడ్లు ఉన్నట్లే. జగ్గన్నపేటలో 780 ఇళ్లు ఉండగా.. 520 ఇళ్లలో మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. మిగతా ఇళ్లలో లేవు. మంత్రి చందూలాల్ కలెక్టర్‌తో మాట్లాడితే ఈ గ్రామాన్ని బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దడం చాలా సులభం. కేవలం రెండు నెలల్లో ప్రక్రియ ముగిసిపోతుంది.

కొండా సురేఖ: వరంగల్ రూరల్ జిల్లా గీసుకొండ మండలం వంచనగిరి గ్రామం వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ స్వగ్రామం. 80 శాతానికి పైగా గృహాలలో వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నవి. కేవలం 91 ఇళ్లలో నిర్మించాల్సి ఉంది. ఎమ్మెల్యే సురేఖ ప్రత్యేకంగా దృష్టిసారిస్తే వంద శాతం మరుగుదొడ్లు గల గ్రామంగా నిలుస్తుంది.

తాటికొండ రాజయ్య: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యది తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతమే స్వంత గ్రామం. 2610 ఇళ్లు ఉన్నాయి. 1851 ఇళ్లలో మాత్రమే వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. ఇంకా 759 నివాసాల్లో నిర్మించాల్సి ఉంది. ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. 430 నిర్మాణ పనులు చేపట్టగా అవి పురోగతి దశలోనే ఉన్నాయి. ఇంకా 329 ఇళ్లలో పనులు ప్రారంభం కాలేదు.

శంకర్‌నాయక్: మహబూబాబాద్ ఎమ్మెల్యే భానోతు శంకర్ నాయక్‌ది వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తి మండలం బాలాజీతండా. తండాలో 34 నివాస గృహాలున్నాయి. ఇందులో 18 మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. ఇంకా 26 మరుగుదొడ్లను నిర్మించాలి. ఉపాధి హామీ పథకంలో త్వరలోనే నిర్మాణం చేపట్టనున్నట్లు తండావాసులు చెబుతున్నారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తండాపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది.

అరూరి రమేష్: వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్లు గ్రామంలో జన్మించారు. గ్రామంలో 1134 కుటుంబాలకు 765 వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయి. ఇంకా 369 నిర్మించాల్సి ఉంది. ఉపాధి హామీ పథకంలో 245 వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరయ్యాయి. ఇందులో 25 మాత్రమే పూర్తయ్యాయి. వాటి ఉపయోగంపై ప్రజలకు అవగాహన కల్పించకపోవడం...నిర్మించుకున్న వారికి సకాలంలో బిల్లులు అందకపోవడం వల్లనే ఇంకా నిర్మాణం జరగాల్సినవి జరగడం లేదని తెలుస్తుంది. గ్రామాన్ని బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపించాలి.

కడియం శ్రీహరి, ఎర్రబెల్లి దయాకర్: ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావులది వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి. ఈ గ్రామంలో 1214 నివాసాలు ఉండగా.. 858 ఇళ్లలో మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. స్వచ్ఛభారత్ మిషన్ కింద గ్రామాన్ని బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం 256 మరుగుదొడ్లను మంజూరు చేసింది. ఇందులో 38 మాత్రమే పూర్తికాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఇంకా 100 మరుగుదొడ్లను కూడా మంజూరు చేయాల్సి ఉంది. ఇప్పటికైనా దయాకర్‌రావు, శ్రీహరి గ్రామంపై ప్రత్యేక చొరవ చూపితే వందశాతం నిర్మాణాలు పూర్తవుతాయి.

మాధవరెడ్డి: నర్సంపేట శాసనసభ్యుడు దొంతు మాధవరెడ్డిది వరంగల్ రూరల్ జిల్లా చెన్నరావుపేట మండలం అమీనాబాద్. గ్రామంలో 680 ఇళ్లు ఉండగా.. వ్యక్తిగత మరుగుదొడ్లు 323 మాత్రమే ఉన్నాయి. 357 మరుగుదొడ్లను నిర్మిస్తే వందశాతం ఉన్నట్లు అవుతుంది. ఉపాధిహామీ పథకంలో 357 మంజూరు కాగా 40 మరుగుదొడ్లకు మాత్రమే నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. ఇంకా 315 ప్రారంభం కావాల్సి ఉంది.

ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి: జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిది వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు గ్రామం. గ్రామంలో 1058 ఇళ్ల గాను 892 వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయి. ఇంకా 166 నిర్మించాలి. పంచాయతీ అధికారులు మరుగుదొడ్డి లేని ఇళ్లకు వెళ్లి నిర్మించుకోవాలని వివరిస్తున్నారు. అయితే వందశాతం పూర్తికావడానికి యాదగిరిరెడ్డి కూడా గ్రామంపై ప్రత్యేక చొరవ చూపించాలి.

రెడ్యానాయక్: డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్. రెడ్యానాయక్‌ది మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి. గ్రామంలో 617 కుటుంబాలుండగా వ్యక్తిగత మరుగుదొడ్లు 304 ఉన్నాయి. ఇంకా 313 నిర్మించాలి. ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరు అయ్యాయి. కానీ ప్రజలు వాటి వినియోగంపై సరైన అవగాహన లేదు. దీంతో వారు ముందుకు రావడం లేదు. ఎమ్మెల్యే రెడ్యానాయక్ గ్రామాన్ని బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి ముందడుగు వేయాల్సిన అవసరం ఉంది.

ఇంకా స్పందించలే!

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వాలని కోరింది. పక్షం రోజులు గడుస్తున్నా.. ఉమ్మడి జిల్లాలోని ఏ పురపాలక సంఘం ఈ విషయంలో ముందడుగు వేయకపోవడం గమనార్హం.

ఎవరికోసం: తక్కువ ఆదాయం కలిగిన పురపాలికలకు పట్టణాల్లో పారిశుద్ధ్య పరిరక్షణ తలకు మించిన భారంగా మారింది. కార్మికులకు వేతనాలు, వాహనాల నిర్వహణ, డీజిల్ ఖర్చులు, రిక్షాలు, తోపుడు బళ్లు, పారిశుద్ధ్య సామగ్రి కొనుగోలుకు ఏటా కోట్లలో వెచ్చించాల్సి వస్తోంది. ఇంటింటి నుంచి నేరుగా చెత్త సేకరించి, డంపుయార్డులకు తరలించడం, మనవ్యర్థపదార్థాల నిర్వహణ ('సాలిడ్‌వేస్ట్‌మేనేజ్‌మెంట్') పథకాన్ని అనుసరించి చెత్తను నిర్వహించడంలో పురపాలికలు లక్ష్యాలను చేరలేకపోతున్నాయి. రూ. లక్షలు, కోట్లు వెచ్చిస్తున్నా 'చెత్త' నిర్వహణ చెత్తగానే ఉంటోందనే విమర్శలు వస్తున్నాయి. ఈ దశలో ఇంటింటి నుంచి చెత్త సేకరణకు మానవశక్తి చోదకంగా నడిపే రిక్షాల స్థానంలో చిన్న ఆటో ట్రిప్పర్లను ప్రవేశపెట్టారు. 'స్వచ్ఛ ఆటో టిప్పర్స్-డ్రైవర్ కమ్ ఓనర్ అనే పథకాన్ని తొలుత జీహెచ్ఎంసీ పరిధిలో హైదరాబాద్‌లో ప్రవేశపెట్టారు. వేలాది మంది యువతకు ఉపాధి మార్గంగా, ఇంటింటి నుంచి నేరుగా చెత్త సేకరించి, నిర్దేశిత ప్రదేశానికి తరలించడంలో ఈ పథకం ఆశించిన ఫలితాలను ఇచ్చినట్లు పురపాలక శాఖ భావిస్తోంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 72 పురపాలక సంఘాలు, సంస్థల్లో ఈ పథకాన్ని అమలు చేసేందుకు అడుగు వేసింది. పథకం ఆశయం, లక్ష్యం, అమలు, పట్టణ స్థానిక సంస్థల బాధ్యుల పాత్ర, పథకంతో ఎవరికి ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో.. ముసాయిదా రూపొందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఛైర్మన్లు, ఛైర్‌పర్సన్లకు, కమిషనర్లకు ఈ ముసాయిదాను పంపించినట్లు సమాచారం. దసరాలోపు ఈ పథకాన్ని అమలు చేసేందుకు ఆసక్తి కలిగిన పురపాలక సంఘాలకు స్వచ్ఛఆటో పథకాన్ని వర్తింపజేయనున్నట్లు సమాచారం. అయితే ఇప్పటి వరకు జనగామ, మహబూబాబాద్ మున్సిపాలిటీలు, భూపాలపల్లి, పరకాల, నర్సంపేట నగర పంచాయతీలు స్పందించలేదు. కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి చర్చించలేదు. దీనిపై కౌన్సిలర్ల అభిప్రాయాలు తీసుకోలేదు.

పురపాలికలకు 'ఆదా'యం: పథకం అమలులో ప్రజలను భాగస్వాములను చేయడం వల్ల పురపాలికలకు ఖర్చు తగ్గుతుంది. నూటికి నూరు శాతం ఇంటింటి చెత్తసేకరణ, చెత్తను రీసైక్లింగ్ చేయడానికి, తడిపొడి చెత్తను వేరు చేసి ఇంధనంగా మార్చడం, ఆదాయవనరుగా వినియోగించడానికి అవకాశం. ఆటోడ్రైవర్‌కమ్ ఓనర్ పథకం ద్వారా ఒక ఆటో ద్వారా ఏడు వందల ఇళ్ల నుంచి రోజు చెత్తను సేకరించాల్సి ఉంటుంది. ఇంటికి రూ. 40 చొప్పున సేవారుసుము(యూజర్ చార్జి) వసూలు చేసుకుని, స్వచ్ఛ ఆటోట్రిప్పర్స్ యజమానులైన కార్మికులు నెలకు రూ. 25 నుంచి రూ. 30 వేలకు వరకు సంపాదించేందుకు ఈ పథకంలో అవకాశం ఉంది. స్వచ్ఛ ఆటో పథకం అమలు సాధ్యాసాధ్యాలపై చర్చ నిర్వహించి ఓ నిర్ణయం తీసుకోవాలి.

కేయూకు దక్కేనా ఏ-ప్లస్ గ్రేడు!

(మొదటిపేజీ తరువాయి)

పీర్ కమిటీ సభ్యులు మూడురోజుల పాటు కేయూ క్యాంపస్‌లో పర్యటిస్తారు. బృందాలుగా విడిపోయి ఎంపిక చేసిన 22 విభాగాలకు వెళ్తారు. పనితీరు, అభివృద్ధి తదితర అంశాలను పరిశీలిస్తారు. కేయూలో జరుగుతున్న పరిశోధనలు, అభివృద్ధి విషయమై బోధనా, బోధనేతర, విద్యార్థి, పరిశోధక సంఘాల నేతలు, పూర్వ విద్యార్థులతో సమావేశమవుతారు. క్యాంపస్‌లోని పురప్రముఖులను కలుస్తారు. మౌలిక వసతులు, ఫలితాల శాతం, పరిశోధనలు, పరిశోధనా ప్రాజెక్టుల సాధన, క్రీడల్లో ప్రగతి, సామాజిక కార్యక్రమాల్లో విశ్వవిద్యాలయం పాత్ర, తరగతుల నిర్వహణ, ప్రవేశాలు, పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, విద్యార్థులు సాధిస్తున్న ప్రగతి, కోర్సుల వివరాలు, అధ్యాపకులు, ఉద్యోగుల స్థితిగతులు, అకడమిక్ అంశాలతో పాటుగా అభివృద్ధి రంగాల్లో సాధిస్తున్న ప్రగతి, ఉద్యోగ అవకాశాలు ఎలా ఉన్నాయి.? తదితర అంశాలను తెలుసుకుంటారు. తర్వాత న్యాక్‌కు నివేదికను సమర్పిస్తారు. నివేదిక ఆధారంగా నెలరోజుల్లో కేయూకు గ్రేడును కేటాయిస్తారు.

ఇదీ షెడ్యూల్: మధ్యప్రదేశ్‌లోని చిత్రకూట్ గ్రామోదయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎన్‌సీ. గౌతమ్ ఛైర్మన్‌గా ఏడుగురు సభ్యుల పీర్ కమిటీ మూడు రోజుల పాటు పర్యటిస్తుంది. ఇందులో డాక్టర్ కన్నయ్యఅహూజా(మధ్యప్రదేశ్), డాక్టర్ ఏపీ. సింగ్‌మద్నావత్ (రాజస్థాన్), ఆచార్య హెచ్‌పీ. పాండే(ఉత్తరప్రదేశ్), ఆచార్య సంజీవ్‌పూరి(పంజాబ్), ఆచార్య వైకే. గుప్తా(దిల్లీ) , ఆచార్య గౌతమ్‌సన్యాల్ (పశ్చిమబంగా) సభ్యులుగా ఉన్నారు. ఆదివారం సాయంత్రం వరంగల్‌కు చేరుకున్నారు.

సోమవారం ఉదయం 9 నుంచి 9.45 గంటల వరకు కేయూ ఉపకులపతి ఆచార్య ఆర్. సాయన్నతో సమావేశమవుతారు. కేయూ సాధిస్తున్న అభివృద్ధిని వీసీ వివరిస్తారు.

ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పలు విభాగాలను సందర్శించి.. ఆ విభాగాలు సాధించిన ప్రగతిని తెలుసుకుంటుంది.

సాయంత్రం 5.45 నుంచి 6.30 గంటల వరకు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వవిద్యార్థులతో సమావేశమవుతారు. అనంతరం కేయూ ఆడిటోరియంలో విద్యార్థులతో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తారు.

మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు పలు విభాగాలను సందర్శిస్తారు. 11 గంటల నుంచి 11.45 గంటల వరకు ఐక్యూఏసీ అధికారులతో, బోధనేతర సిబ్బందితో సమావేశమవుతారు.

మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు ప్రిన్సిపల్, ప్రవేశాల డైరెక్టరేట్, హాస్టళ్లు, ఆరోగ్యకేంద్రాన్ని సందర్శిస్తారు.

మధ్యాహ్నం 2 గంటల నుంచి మూడు గంటల వరకు క్యాంపస్‌లోని ఎస్టీఎస్టీ సెల్, క్రీడామండలి, ప్లేస్‌మెంట్, బీసీ సెల్ కార్యాలయాలను సందర్శిస్తారు.

బుధవారం కేవలం నివేదిక తయారుపై కసరత్తు చేస్తారు. ఉపకులపతితో సమావేశమవుతారు. అనంతరం తుదినివేదికను రూపొందిస్తారు. సాయంత్రం సెనెట్ హాల్లో వీసీతో సమావేశం, అనంతరం బృందం ఛైర్మన్ నివేదిక ప్రగతిని వీసీకి అందజేస్తారు.

14 వైద్యాధికారుల పోస్టులు భర్తీ

(మొదటిపేజీ తరువాయి)

ఇదివరకే అధికారులు నోటిఫికేషన్ జారీచేశారు. 34 మందిని ఇంటర్వ్యూకు హాజరుకావాలని సమాచారం పంపించారు. ఆదివారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో కలెక్టర్ మురళి, డీఎంహెచ్‌వో అప్పయ్య నిర్వహించిన ఇంటర్వ్యూలకు 23 మంది మాత్రమే హాజరయ్యారు. ప్రతి అభ్యర్థి ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించడంతో పాటు వారితో మాట్లాడారు. 14 మందిని ఎంపిక చేశారు. ఏజెన్సీ ఏరియాలో వైద్యాధికారులు ఎలా పనిచేయాలో వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేసే వైద్యులు కె. శ్రీలత(పస్రా), అభిషేక్(మంగపేట), కమల్‌చంద్‌నాయక్(తాడ్వాయి), అజ్మీరా సుకుమార్(కొడిశల) నంద కిషోర్(వాజేడు), సోమా వైశాలి(రొయ్యూరు), కె. ప్రమోద్‌కుమార్(మహాముత్తారం), వంశీకృష్ణ(మహదేవ్‌పూర్), ఎ. జ్యోతి(అంబట్‌పల్లి)లు కాగా, వీరిలో నల్గురు వైద్యులను 24 గంటల ఆసుపత్రులలో పనిచేయాల్సిందిగా డిప్యుటేషన్ ఇచ్చారు. వైశాలి గోవిందరావుపేటలో, ప్రమోద్‌కుమార్ కాటారంలో, వంశీకృష్ణ పలిమెలలో, ఎ. జ్యోతి భూపాలపల్లిలో పనిచేయాల్సి ఉంటుంది. వీరితో పాటు ములుగు సామాజిక ఆసుపత్రి వైద్యులుగా కీర్తి, జ్యోతిర్మయి, విజయ్‌కుమార్, చిట్యాల సామాజిక ఆసుపత్రి వైద్యులుగా విక్రం, నిషాన్‌లను నియమించినట్లుగా జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి అప్పయ్య ప్రకటించారు. వీరంతా వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు.

తక్కువ ధరతో సుఖంగా వెళ్లాలనుకునే వారికి రైలు ప్రయాణం అనుకూలంగా ఉంటుంది. కానీ రైళ్లు అనేక సందర్భాల్లో ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తమ విలువైన సమయాన్ని కోల్పోతున్నారు. కొన్ని ముఖ్య సంఘటనలకు కూడా హాజరు కాలేకపోతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాజీపేట రైల్వే జంక్షన్ పేరుగాంచింది. ఇక్కడి నుంచి అనేక రైళ్లు నడుస్తుంటాయి. కాజీపేట మీదుగా వెళ్లే రెగ్యులర్ రైళ్లలో చాలా వరకు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు అసహనానికి గురవుతుంటారు. కాజీపేట నుంచి వెళ్లే వాటిలో ఏయే రైళ్లు ఆలస్యమవుతున్నాయి. ఎందుకలా జరుగుతుంది. ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో 'న్యూస్‌టుడే' కథనం.

– న్యూస్‌టుడే, కాజీపేట



రైలు బండి ఎప్పుడూ ఆలస్యమేనండి..!

ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

'లింకు'లతో తంట

భాగ్యనగర్, గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లకు లింకులు ఉండటంతో ఈ రెండు రైళ్లు సికింద్రాబాద్‌కు ఎప్పుడూ సరైన సమయానికి చేరుకోలేదు. ఆనంద్ అనే ప్రయాణికుడు సికింద్రాబాద్‌కు 11.00 గంటలకు వెళ్లాలి. అందుకని సికింద్రాబాద్‌కు 10.45 గంటలకు (సరైనా సమయం) చేరుకునే భాగ్యనగర్(బల్లార్షా నుంచి సికింద్రాబాద్ వెళ్లే 17234)ను ఆశ్రయించారు. కానీ అది అక్కడికి 11.30 గంటలకు చేరుకుంది. 45 నిమిషాలు ఆలస్యమైంది. వీటిని ఆశ్రయించాల్సిన అనేకమంది విలువైన సమయాన్ని వృథా చేసుకోవాల్సి వస్తోంది. సికింద్రాబాద్ చేరుకున్నాక భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ 13.00 గంటలకు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌గా మారి గుంటూరుకు వెళ్తుంది. ఈ రైలు బోగీలను ప్లాట్‌ఫారంపైనే శుభ్రం చేస్తారు. దీనికిగాను 2.15 గంటల సమయాన్ని కేటాయించారు.

కాజీపేటకు వచ్చేవే కదా అని..

● బల్లార్షా వైపు నుంచి కాజీపేట వరకు వచ్చు అజ్నీ ప్యాసింజరు(57135) కాజీపేటకు 9.50 గంటలకు చేరుకోవాలి. రోజూ గంట నుంచి గంటన్నర ఆలస్యమవుతుంది. ఈ సమయంలో రాజధాని, తెలంగాణ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు దిల్లీ వైపు వెళ్లడంతో వీటిని ముందుగా పంపడానికి దీనిని నిలిపి వేస్తారు.

● బల్లార్షా వైపు నుంచి కాజీపేటకు 20.05 గంటలకు వచ్చే రామగిరి ప్యాసింజరు ఎప్పుడూ సమయానికి రాదు. కొన్ని సార్లు అర్ధరాత్రి దాటాక వచ్చిన సందర్భాలున్నాయి.

● బల్లార్షా నుంచి భద్రాచలం రోడ్ వెళ్లు సింగరేణి ప్యాసింజరు రైలు (57124) కాజీపేట టౌన్ స్టేషన్‌కు రావాల్సిన సమయం 16.25 గంటలు. కానీ ఏ రోజు కూడా సమయానికి రాలేదు. భద్రాచలం రోడ్ నుంచి బల్లార్షా వెళ్లు 57123 సింగరేణి కూడా కాజీపేట టౌన్ స్టేషన్‌కు 9.20గంటలకు రావాల్సి ఉంటుంది. కానీ ఇది ఏనాడా సమయానికి రాలేదు.

● సికింద్రాబాద్ నుంచి బల్లార్షా వెళ్లు భాగ్యనగర్ 17233 పరిస్థితి కూడా ఇంతే. సికింద్రాబాద్‌లో ఈ రైలు 15.25 గంటలకు బయలుదేరాలి. కానీ ఇక్కడే దీనిని సమయం తప్పించి విడుదల చేస్తారు. కొన్ని సార్లు సమయం ప్రకారం వచ్చినా మధ్యలో నిలిపివేస్తారు. దీనికంటే వెనకాల 16.15 గంటలకు బయలుదేరే శాతవాహన ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు భాగ్యనగర్ కంటే ముందు చేరుకుంటుంది. భాగ్యనగర్ ఏనాడూ కాజీపేటకు సరైన సమయంలో చేరుకోలేదు. గత నెల రోజులు పట్టికను పరిశీలిస్తే ప్రతి రోజు 15-30 నిమిషాలు ఆలస్యమవుతున్నట్లు తేలింది.

గోల్కొండదీ ఇదే పరిస్థితి..

గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లు గోల్కొండ ఎక్స్‌ప్రెస్ 17201 పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. ఈ రైలు సికింద్రాబాదుకు 13.45గంటలకు చేరుకోవాలి. ఆ తర్వాత ఈ రైలు భాగ్యనగర్‌గా మారి 15.25 బల్లార్షాకు బయలుదేరుతుంది. దీనికి కూడా సికింద్రాబాద్‌లో 1.25 గంటల విరామ సమయం ఉంటుంది. ఈ రైలు కాజీపేటకు 10.35కి రావాల్సి ఉండగా రోజూ అర గంటకుపైగా ఆలస్యమవుతుంది. కొన్ని సార్లు ఎక్కువ సమయం కూడా పడుతుంది. ఈ ప్రభావం బల్లార్షా వెళ్లు భాగ్యనగర్ మీద పడుతుంది.

హైదరాబాద్ వెళ్లు ఇంటర్‌సిటీ ఎప్పుడూ అంతే..

హైదరాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే కాగజ్‌నగర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (17012/17011) ఎప్పుడూ ఆలస్యంగానే నడుస్తుంది. బల్లార్షా నుంచి హైదరాబాద్ వెళ్లు 17012 ఇంటర్‌సిటీ రోజూ గంటకుపైగా ఆలస్యంగా నడుస్తుంది. సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఈ రైలు 12 గంటలకు బయలుదేరి కాజీపేటకు 15.05 గంటలకు వచ్చి హైదరాబాద్ 17.45కు చేరుకోవాలి. 17011 హైదరాబాద్‌లో 4.50 గంటలకు బయలుదేరి కాజీపేటకు 7.37కు వచ్చి సిర్పూర్‌కాగజ్‌నగర్‌కు 11.00 గం.లకు చేరుకోవాలి. ఇదే రైలు మరల 12.00 గంటలకు కాగజ్‌నగర్‌లో తిరుగు ప్రయాణం కడుతుంది. కాబట్టి ఈ రైలు కాస్త ఆలస్యమైతే 17012 రైలు ఆలస్యమవుతుంది. పైగా బల్లార్షా నుంచి వరంగల్‌కు వచ్చే మార్గంలో ఇది అనేక గూడ్స్ రైళ్లను దాటుకుంటూ రావాల్సి ఉంటుంది. దీంతో17012 నంబరు గల రైలు ప్రతి రోజు గంటన్నరకుపైగా ఆలస్యంగా నడుస్తుంది.

ఫిర్యాదులు అందినా పట్టించుకోరు..

బల్లార్షా మార్గంలో తక్కువ దూరంలో ప్రయాణించే ప్రతి రైలు పరిస్థితి ఇలాగే ఉంటుంది. వీటి మీద అనేక ఫిర్యాదులు వస్తున్నా ఎలాంటి పట్టింపు లేదు. దిల్లీ-బల్లార్షా-వరంగల్ మార్గంలో ఎక్కువ దూరం ప్రయాణించే రైళ్లు ఎక్కువగా ఉంటాయి. ముందుగా వీటికి ప్రాధాన్యమివ్వాల్సి ఉంటుందని తర్వాత తక్కువ దూరంలో ప్రయాణించే వాటికి అవకాశం ఇవ్వడంతో కొంత ఆలస్యమవుతుందని అధికారులు వివరిస్తున్నారు. ఈ మార్గంలో మూడో లైన్ నిర్మాణం పూర్తయితే సమస్య పరిష్కారమవుతుందని అంటున్నారు.



కాజీపేటలో రైలు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

సదస్సుకు హాజరు కాలేకపోయాను

–కె.శ్రీకాంత్



రైళ్లు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేను ఒక రోజు జనగామలో సదస్సుకు హాజరయ్యేందుకు భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాను. ఆ రోజు గంటన్నరకుపైగా ఆలస్యంగా నడిచింది. దీంతో నేను సరైన సమయానికి చేరుకోలేకపోయాను. నేను విలువైన సమాచారాన్ని అందుకోలేకపోయాను.

బస్సులను ఆశ్రయిస్తున్నా..

– సుకన్య, భాగ్యనగర్ ప్రయాణికురాలు



నేను రోజూ భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌లో కాజీపేట నుంచి జనగామకు వెళ్తుంటాను. ఇది ఎప్పుడూ సమయానికి రావడంలేదు. ఈ రైలును ఆశ్రయించడంతో చాలాసార్లు ఇబ్బంది పడాల్సి వచ్చింది. రైలు ప్రయాణానికి స్వస్తి పలికి బస్సులను ఆశ్రయిస్తున్నా.

వివాహానికి ఆలస్యంగా వెళ్లా..

– సరోజన, ఇంటర్ సిటీ ప్రయాణికురాలు



నేను రెగ్యులర్‌గా జమ్మికుంట నుంచి వరంగల్‌కు వస్తుంటాను. మా బంధువులంతా ఇక్కడే ఉన్నారు. ఈ మార్గంలో నడిచే అన్ని రైళ్లు ఆలస్యంగా నడవడంతో అనేక సార్లు ఇబ్బందిపడ్డాను. ఉదయం 10 గంటలకు కాజీపేట చేరుకునే ప్యాసింజరులో ఒక రోజు పెళ్లికి వచ్చాను. కానీ అది 12.00 గంటలకు చేరుకుంది. పెళ్లి 10.30 గంటలకే అయిపోయింది. మా బంధువుల ముందు ఇబ్బంది పడాల్సి వచ్చింది.

30న కేయూ పీజీ సెట్ ధ్రువపత్రాల పరిశీలన

కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: కాకతీయ, శాతవాహన విశ్వవిద్యాలయాల్లోని పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ఈ విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం రెండో దఫా ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఈనెల 30 న ఉంటుందని కేయూ ప్రవేశాల సంచాలకులు ఆచార్య వడ్డె రవీందర్, సంయుక్త సంచాలకులు డాక్టర్ వై. వెంకయ్య, డాక్టర టి.రాజకొమురయ్య ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 3వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చునని వివరించారు. మొదటి దఫా ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరైన వారు రెండోసారి హాజరు కావల్సిన అవసరంలేదని స్పష్టం చేశారు. మొదటిసారి ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కానివారు మాత్రమే తమ అసలు ధ్రువీకరణ పత్రాలను సమర్పించి వచ్చే నెల 3వ తేదీలోగా కళాశాలల, కోర్సుల ఎంపిక కోసం ఆప్షన్లు ఇచ్చుకోవాలని పేర్కొన్నారు. ప్రథమ దఫా ప్రవేశాలు పొందిన వారు కళాశాలల మార్పుల కోసం స్లైడింగ్‌కు ఈనెల 30వ తేదీలోగా ఆప్షన్లు ఇచ్చుకోవాలని తెలిపారు. స్లైడింగ్ కోసం రూ.200 చెల్లించాలని వివరించారు. వచ్చే నెల 3వ తేదీ తరువాత రెండో దఫా సీట్లు లభించిన వారి వివరాలను ఎస్‌ఎంఎస్ ద్వారా విద్యార్థులకు పంపిస్తామని అధికారులు పేర్కొన్నారు.

'కార్మిక సమస్యలు పరిష్కరించడంలో విఫలం'

ముగిసిన సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు



మాట్లాడుతున్న సాయిబాబు

ఎక్సైజ్ కాలనీ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు అన్నారు. రెండు రోజులుగా హన్మకొండ కల్యాణి ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ముగింపు సమావేశంలో సాయిబాబు మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎన్నికల ముందు ప్రజలు, కార్మికులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తెరాస ప్రభుత్వం ఇప్పటికి ఒక్కటీ అమలు చేయలేదన్నారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికుల బోర్డు ఉంది. నిధులున్నా కానీ కార్మికులకు చెందడంలేదన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని న్యాయస్థానాలు తీర్పు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలేదన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు చేస్తున్నా సిబ్బంది సర్వీస్‌ను క్రమబద్ధీకరించకుండా వారి నుంచి శ్రమ దోపిడీ చేస్తుందన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం శ్రామిక రంగంలో పని చేస్తున్న మహిళలకు సంబంధించిన పలు సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. పలుసార్లు ప్రభుత్వం, అధికారులకు వినతిపత్రం ఇచ్చినా స్పందన లేదన్నారు. సీఐటీయూ నగర కార్యదర్శి రాగుల రమేశ్ మాట్లాడుతూ.. వరంగల్ నగర పాలక సంస్థలో ఆరుగురు ఉద్యోగులను సరెండర్ చేస్తూ కౌన్సిల్ తీర్మానం చేయడం సరికాదన్నారు. సీఐటీయూ ఉద్యోగులకు బాసటగా ఉంటుందన్నారు. ముగింపు సమావేశాలకు రాష్ట్ర అధ్యక్షుడు రాములు, నాయకులు యాదనాయక్, చుక్కయ్య, వాసుదేవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా టీఎన్జీవోస్

ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు రాజేష్‌కుమార్ గౌడ్



మాట్లాడుతున్న రాజేష్‌కుమార్

హన్మకొండ చౌరస్తా, న్యూస్‌టుడే: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవోస్ అండగా ఉంటుందని వరంగల్ ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్షుడు కోలా రాజేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం హన్మకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐదో జోన్ ఇంటర్మీడియెట్ విద్య బోధనేతర సిబ్బందికి టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఆదివారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఇంటర్మీడియెట్ విద్య బోధనేతర సిబ్బంది రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణస్వామి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వరంగల్ ఉమ్మడి జిల్లాల టీఎన్జీవోస్ అధ్యక్షుడు కోలా రాజేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు సంబంధించిన ఎలాంటి సమస్యల సాధనకైనా టీఎన్జీవోస్ వెంట ఉంటుందన్నారు. అదేవిధంగా నూతన పింఛను విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 30న వరంగల్ ఎంజీఎం నుంచి కలెక్టరేట్ వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. 1వ తేదీన అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి టీఎన్జీవోస్ నాయకులందరూ హాజరుకావాలని ఆయన కోరారు. అనంతరం నయీమొద్దీన్, నర్సింగరావు సిబ్బందికి విధులు, కార్యనిర్వహణ, బాధ్యతలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫ్రాన్సిస్, కోశాధికారి రాంబాబు, జిల్లా అధ్యక్షుడు పెంటయ్య, జిల్లా సంయుక్త కార్యదర్శి చీకటి శ్రీనివాస్, రాములునాయక్, ఫహీమొద్దిన్, నవీన్‌కుమార్, విజయ్‌కుమార్, చంద్రమౌళి, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

ఏటూరునాగారం: శ్రీ వెంకటేశ్వర టాకీస్ నేనే రాజు నేనే మంత్రి
పస్రా: శ్రీమెహర్‌రంగ మహల్ ఫిదా
ములుగు: తిరుమల కళామందిర్ నేనే రాజు నేనే మంత్రి

ములుగు

వాహన తనిఖీలు

ములుగు రూరల్: మల్లంపల్లి గ్రామంలో ఆదివారం ఎస్సై ఓదెల వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేశారు. ములుగు - హన్మకొండ జాతీయ రహదారిపై ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయటంతో పాటు వాహనపత్రాలను పరిశీలించారు. పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించి వదిలేశారు.

నియామకం

కమలాపురం (మంగపేట): మంగపేట మండలం కమలాపురానికి చెందిన పరికి శ్రీనివాస్‌ను ఏజెన్సీ దళితుల సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడిగా నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రమణయ్య, ప్రధాన కార్యదర్శి తిప్పనపల్లి సుదర్శన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా స్థానిక విలేకరులతో శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

హైకోర్టు తీర్పును అమలుపరచాలి

మల్లూరు (మంగపేట), న్యూస్‌టుడే: హైకోర్టు తీర్పును అమలు పరచాలని పంచాయతీరాజ్ చట్టం పీసా మల్లూరు గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు నల్లబోయిన లక్ష్మణ్‌రావు అన్నారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన పీసా గ్రామ కమిటీ అత్యవసర సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 24న శ్రీహేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయ పాలక మండలిని రద్దు చేసి స్థానిక ఆదివాసీ గిరిజనులతో పాలక మండలి ఏర్పాటు చేయాలని హైకోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారన్నారు. హైకోర్టు ఉత్తర్వులను పెడచెవిన పెట్టి హుటాహుటిన పాలక మండలిని గిరిజనేతరుల వ్యక్తులతో నియమించడంలో అధికారుల పాత్ర ఏమిటో అర్థం కావటం లేదన్నారు. ఈ విషయంపై ఆలయ ఇన్‌ఛార్జి ఈవో, ఇన్‌స్పెక్టర్ బేలేసింగ్‌ను వివరణ కోరగా ఆలయ పాలక మండలి రద్దు చేసినట్లు హైకోర్టునుంచి ఎలాంటి ఉత్తర్వులు తమకు అందలేదన్నారు. ఈ సమావేశంలో పూనెం శ్రావణ్‌కుమార్, సోడె భూపతి, సభ్యులు అనిల్ కుమార్, మల్లయ్య, రాములు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జవహర్‌నగర్, భూరుగుపేట (వెంకటాపూర్): తెరాస ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెరాస జిల్లా నాయకుడు ముద్దు తిరుపతి అన్నారు. ఆదివారం మండలంలోని భూరుగుపేట, జవహర్‌నగర్ గ్రామాల్లో వేరు వేరుగా జరిగిన గ్రామకమిటీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలలో నిజమైన లబ్ధిదారునికి న్యాయం జరిగే వరకు కార్యకర్తలు పోరాడి న్యాయం చేయాలన్నారు. పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ సర్పంచి గుగులోతు విజయ, జాటోత్ జగ్గాం, బ్రహ్మాచారి, మహేందర్, పాల్గొన్నారు.

కాంట్రిబ్యూటరీ పింఛన్‌తో ఉద్యోగులకు అన్యాయం

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానంతో ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పింఛన్ పథకం ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు మంచర్ల వీరభద్రం ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇందుకు నిరసనగా సెప్టెంబరు 1 న చీకటి రోజుగా పాటించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఆర్థిక భద్రత కరవై ఉద్యోగుల కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయన్నారు. వెంటనే సీపీఎస్ పద్ధతిని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.సతీష్‌కుమార్, సర్వర్ అహ్మద్, కమాలొద్దీన్, నయీమొద్దీన్, విజయ్‌కుమార్, శ్యాంసుందర్, ప్రసాద్, సారంగపాణి, హేమలత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్నికకు తరలి వెళ్లిన నాయకులు

మంగపేట,న్యూస్‌టుడే: భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ ఎన్నికకు మంగపేట మండల పీఆర్టీయూ బాధ్యులు, సీనియర్ నాయకులు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో ఆ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతా లక్ష్మీనారాయణ, చందా భద్రయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పెట్రం సుధాకర్, మహిళా ఉపాధ్యక్షురాలు పొదెం మేనక, కార్యదర్శి గద్దల నర్సింహులు, గుడివాడ అశోక్, పిల్లలమర్రి సాంబశివరావు, రాజేందర్ తదితరులున్నారు.


జలకళతో లక్నవరం

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: మండలంలోని లక్నవరం జలాశయం వరద నీటితో కలకళలాడుతోంది. ముందెన్నడూ లేనంతగా తూములు కనిపించనంతగా వరద నీరు ప్రవహిస్తోంది.

ఇలా అయితే ఎలా..?

➠ రామప్ప ప్రాంగణంలో నిలుస్తున్న నీరు
➠ కూరుకుపోయిన ఆనాటి మురుగు కాల్వలు
➠ నిర్లక్ష్యంతో పురావస్తు శాఖ

వెంకటాపూర్, న్యూస్‌టుడే: 800ఏళ్ల ఘన చరిత్ర కలిగిన పురాతన రామప్ప కట్టడంపై పురావస్తుశాఖ నిర్లక్ష్యవైఖరి రోజురోజుకూ పెరిగిపోతోంది. ఫలితంగా రాతికట్టడమైన ఆనాటి శిల్పకళా సంపద దెబ్బతింటోంది. ప్రపంచ వ్యాప్తంగా సుప్రసిద్ధ కట్టడంగా పేరుగాంచిన పురాతన దేవాలయమైన రామప్పపై నిత్యం అధికారుల పర్యవేక్షణ ఉండాలి. ఎక్కడో ఉండి కేవలం సిబ్బంది మీద ఆధారపడి ఉన్నతాధికారులు పనిచేస్తున్నారు. బదిలీపై వస్తున్న సిబ్బందికి పూర్తి స్థాయిలో రామప్పపై అవగాహన లేకపోవడంతో రామప్పలోని చిన్న చిన్న సమస్యలు పెద్దగా కనిపించకపోవడంతో ఏడాదికో సమస్య పునరావృతమవుతుంది. 2012లో రామప్ప తూర్పు ముఖద్వారం (ప్రాకారం) కూలిపోవడం, 2013 నుంచి 2016 వరకు రామప్ప ఆలయం వర్షానికి ఉరవడం, ఇటీవల ప్రహరీ కూలడం, శివుని (యాకూబ్ సాబ్) గుడి కూలిపోవడం జరిగింది. ఈ సమస్యలన్నీ వర్షాకాలంలో కురిసే భారీ వర్షాల సమయంలోనే జరుగుతున్నాయి. వర్షాకాలంలో పురావస్తు శాఖ సిబ్బంది, అధికారులు రామప్పలో ఉన్న చిన్న చిన్న సమస్యలపై ముందస్తుగానే దృష్టి పెడితే సమస్య పెద్దది కాకముందే పరిష్కారం అయ్యే ఆస్కారం ఉంది. శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో పాటు ఆదివారం కురిసిన వర్షానికి ఆలయ ప్రాంగణంలో నీళ్లు నిలిచాయి. ఫలితంగా ప్రాంగణమంతా బురదమయంగా తయారైంది. ఆలయం చుట్టూ తిరిగే పర్యటకులకు ఇబ్బందిగా మారింది. నీరు నిలవడం వల్ల మళ్లీ ఏదైన సమస్య పుట్టుకు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. పురావస్తుశాఖ అధికారులు స్పందించి పరిస్థితిని చక్కదిద్దాలని పర్యాటకులు కోరుతున్నారు.


గోడల నుంచి మట్టిని బయటకు తోడుతున్న చీమలు

పూడికతో నిండిపోయిన మురుగు కాల్వలు...

ఆలయానికి నలుమూలలా నాలుగు ద్వారాలు ఉన్నాయి. నలుదిక్కుల ఉన్న ప్రహరీకి రెండు అడుగుల దూరంలో నాడు కాకతీయులు మురుగు కాల్వను ఏర్పాటు చేశారు. భారీ వర్షాలు కురిస్తే ఆలయ ప్రాంగణంలో పడిన ప్రతి నీటి బొట్టు బయటకు పోవడానికి వీలుగా నాలుగు వైపుల్లో ప్రహరీ కింద నుంచి సైడ్‌కాల్వలు ఏర్పాటు చేశారు. కామేశ్వరాలయం పునరుద్ధరణ సందర్భంగా ఆలయ భాగాలను విప్పే సమయంలో కామేశ్వరాలయ విడిభాగాలను మిషన్ల సహాయంతో తీసుకెళ్లే క్రమంలో ఆలయ ప్రాంగణం కాస్త దెబ్బతిన్నది. దాంతో అప్పటి ప్రభుత్వం దెబ్బతిన్న ఆలయ ప్రాంగణంలో మొరం పోయించి చదును చేశారు. ఆ మొరంను నీటితో క్యూరింగ్ చేసి రోలింగ్ చేయక పోవడం వల్ల కురుస్తున్న వర్షాలకు కాకతీయులు ఏర్పాటు చేసిన మురుగు కాల్వలు పూర్తిగా మట్టితో కూరుకుపోయాయి. దీంతో వర్షం నీరు బయటకు వెళ్లడం లేదు. పడమర భాగంలోని మురుగు కాల్వ మాత్రం పాక్షికంగా దెబ్బతిన్నా నీరు బయటకు వెళ్లేందుకు వీలుగానే ఉంది. మిగతా భాగాల్లోని సైడ్‌కాల్వలు పూర్తిగా పూడుకుపోయి తేమ శాతం ఎక్కువ కావడంతో ప్రహరీల్లోని చీమలు మట్టిని బయటకు తోడుతున్నాయి. మరో పెద్ద సమస్య పునరావృతం కాకముందే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


పడమర వైపు పాక్షికంగా దెబ్బతిన్న సైడ్‌కాల్వలో నిలిచిన నీరు

1న ఏరియా ఆసుపత్రి ముందు దీక్ష

ములుగు, న్యూస్‌టుడే: ములుగు ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా సెప్టెంబరు 1న వెయ్యి మందితో స్థానిక ఏరియా ఆసుపత్రి ముందు ఒక రోజు దీక్ష చేపట్టనున్నట్లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వేములపెల్లి భిక్షపతి తెలిపారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీపీసీసీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆధ్వర్యంలో దీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. డాక్టర్ల కొరత, మందుల కొరతతోపాటు ముక్కిపోయిన బియ్యంతో వండిన భోజనం పెడుతున్నారని ఆరోపించారు. ఫలితంగా రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. డాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తూ రోగులను ఎంజీఎం ఆసుపత్రికి సిఫారసు చేస్తున్నారని ఆరోపించారు. ఎంజీఎం ఆసుపత్రికి బయలుదేరిన రోగులు మధ్యలోనే మృత్యువాతపడే ప్రమాదం ఉందన్నారు. ఈ సమావేశంలో చిక్కుల రాములు, నాగపురి హరినాద్, మహ్మద్ యూనస్, తిరుపతి, లియాకత్ అలి, చిట్టిబాబు, రాజయ్య, జంజిరాల దేవయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భిక్షపతి

జోనల్ స్థాయి క్రీడోత్సవాలకు ఎంపిక

కర్లపల్లి (గోవిందరావుపేట), న్యూస్‌టుడే: మండలంలోని కర్లపల్లి గ్రామంలో ఇటీవల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి ఎంపిక క్రీడోత్సవాల్లో కర్లపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. 37 మంది విద్యార్థులు జోనల్‌స్థాయి క్రీడోత్సవాలకు ఎంపికయ్యారని పాఠశాల వ్యాయామ సంచాలకుడు యాలం ఆదినారాయణ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆదివారం సర్పంచి లావుడియా సమ్మక్క, ప్రధానోపాధ్యాయుడు ఈసం నర్సయ్య, ఉపాధ్యాయులు జి.దయాసాగర్, ఇ.అశోక్, ఎ.గోపీచంద్, వై.సమ్మయ్య, ఎం.సత్యనారాయణ, ఎం.లక్ష్మయ్య, వై.రాములు, పి.వెంకటేశ్వర్లు తదితరులు అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం


వైభవంగా అభిషేక మహోత్సవం

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: గ్రామంలో ఇటీవల బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన ఉత్సవం, పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం జరిగింది. బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవం జరిగి 16 రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు మాచినేని బాబురావు, అధ్యక్షుడు ఆలూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 16 రోజుల పండుగను వైభవంగా నిర్వహించారు. వేదపండితులు గోవర్ధన సంతోషాచార్యులు, టి.ఉదయభాస్కరస్వామి, సుదర్శనాచారి, వీరభద్రయ్యచారి ఆధ్వర్యంలో బొడ్రాయికి, పోచమ్మతల్లికి పంచామృతాభిషేక మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. భక్తజనులు అధిక సంఖ్యలో హాజరై పోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచి పి.వెంకటకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు ఇ.చంద్రశేఖర్‌రెడ్డి, పి.హేమాద్రి, టి.యుగేంధ్రాచారి, వి.నాగాచారి, పోషాలు, ఎం.సుబ్బారావు, రాజారావు, సీహెచ్ సదానందం తదితరులు పాల్గొన్నారు.


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

తాగు నీటి లీకేజీకి నియంత్రణేది?

ములుగు, న్యూస్‌టుడే: పట్టణంలో తాగునీటి సరఫరాకు సంబంధించి పైపులైన్ల లీకేజీ పరిపాటైపోయింది. సంబంధిత గ్రామ పంచాయతీ రూపంలో ఎన్ని నీళ్లు వృథాగా పోయినా పట్టించుకోవడం లేదు. ఇందుకు నిదర్శనం స్థానిక తరుణి ఆసుపత్రి సమీప వాడలోని తాగునీటి పైపులైన్ లీకేజీ. సుమారు వారం రోజులుగా నిరంతరంగా పైపులైన్ లీకేజీ అయి నీళ్లు వృథాగా పోతున్నప్పటికీ గ్రామ పంచాయతీ వారికి చీమకుట్టినట్లు కూడా లేదు. కాలనీవాసులు పలు మార్లు సమస్యను పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందన లేదు. నీటి కొరత పేరుతో కొన్ని ప్రాంతాలకు వారానికి మూడు రోజులే నీటి సరఫరా చేస్తున్నారు. వారం రోజులుగా తాగు నీరు లీకేజీ అవుతూ వృథాగా పోతున్నప్పటికీ నియంత్రించడం లేదు.


లీకేజీ అవుతూ కాల్వలో కలుస్తున్న తాగునీరు

ములుగు

హేమాచలుడి మాస కల్యాణం

మల్లూరు(మంగపేట),న్యూస్‌టుడే: మండలంలోని మల్లూరు గుట్టపై శ్రీహేమాచల లక్ష్మీనరసింహస్వామి అమ్మవార్ల మాస (శాంతి)కల్యాణం నిర్వహించారు. స్వాతినక్షత్రం స్వామివారి జన్మనక్షత్రం ఐనందున లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ఆదివారం పండితులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు.

గల్లంతైన 'గంభూషియా'...?

- చేపల పెంపకంపై నిర్లక్ష్యపు నీడలు
- రూ.5 లక్షల ప్రజాధనం వృథా
- ఐటీడీఏ అధికారుల నిర్వాకం



తొట్టెలలో చనిపోయిన గంభూషియా చేపలు

ఏటూరునాగారం రూరల్,న్యూస్‌టుడే: దోమల నియంత్రణ కోసం పెంచే గంభూషియా చేపల పెంపకాన్ని పట్టించుకునే వారు లేక పథకం నీరుగారిపోతోంది. ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపట్టిన చేపల పెంపకం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆరంభ శూరత్వంగానే మిగిలింది. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఐటీడీఏ పీవో రూ.5లక్షల ఖర్చుతో గంభూషియా రకం చేప పిల్లలను తెప్పించారు. వీటిని మండలంలోని ఎక్కెల గ్రామంలోని ఐటీడీఏకు సంబంధించిన చేపల తొట్లలో వేశారు. ఈ నెల ప్రారంభంలో ఏటూరు నాగారం మండల కేంద్రంలోని రెండు చెరువుల్లో సుమారు వంద చేపలను వేశారు. అనంతరం వీటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. వీటిని తెప్పించిన అధికారి వరంగల్‌లో విధులు నిర్వహిస్తుంటాడు. ఫలితంగా వీటి పెంపకాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. చేపలను వుంచిన తొట్టెలలో చాలా వరకు తెచ్చిన రోజే చనిపోయాయి. చేపలు ఎన్ని తెచ్చారో కాగితాల్లో తప్ప ప్రత్యక్షంగా కన్పించడం లేదు. మురుగు నీటిలో పెంచాల్సిన వీటిని పాకురు పట్టిన నీళ్ళలో పెంచడంపైనే అధికారుల నిర్లక్ష్యం బయటపడుతోంది. సంబంధిత శాఖాధికారులే కనీస రక్షణ చర్యలను చేపట్టకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. చేపల తొట్ల పక్కన కొందరు మందుబాబులు మద్యపానం చేస్తూ పరిసరాలను పాడు చేస్తున్నారు. చేపల పెంపకంపై అధికారుల పర్యవేక్షణ, రక్షణ లేకపోవడంతో లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతోందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత శాఖ కార్యాలయం కూడా లేదు. గతంలో వున్న కార్యాలయం మొండి గోడలతో, పిచ్చి చెట్లతో వెలవెలబోతోంది. ఈ పథకానికి సంబంధించి మొత్తం బాధ్యత వరంగల్ అర్బన్ జిల్లాకు చెందిన మలేరియా అధికారికి అప్పగించారు. వాస్తవానికి జయశంకర్ జిల్లాకు మలేరియా అధికారి వున్నప్పటికీ అర్బన్ జిల్లాకు చెందిన అధికారికి బాధ్యతలు అప్పగించడంలో అంతర్యమేమిటో ఐటీడీఏ పాలనాధికారికే తెలియాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. గతంలో ఐటీడీఏలోని మత్స్యశాఖ విభాగంలో అవినీతి జరగడంతో కార్యాకలాపాలు నిలిచిపోయాయి. చేప పిల్లలను పెంచుకుని ఆర్థికంగా ఎదుగుతామని పలువురు గిరిజనులు ప్రజావాణిలో అనేకమార్లు వినతులను అందజేసినా అధికారులు పట్టించుకోలేదని గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ విషయమై సంబంధిత డీఎంవో పైడిరాజును వివరణ కోరగా రెండు మూడు రోజుల్లో ఏజెన్సీలోని ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం మండలాలకు సరఫరా చేయడానికి ఆరు లక్షల చేప పిల్లలు సిద్ధంగా వున్నాయని వాచ్‌మెన్ విధులు నిర్వర్తిస్తున్నాడని, ఐటీడీఏ పీవో ప్రత్యేక శ్రద్ధతోనే తనకు ఈ బాధ్యతలను అప్పగించారని తెలిపారు.

ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

ములుగు రూరల్, న్యూస్‌టుడే: మల్లంపల్లి గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తయారు చేసుకోవాలని సర్పంచి గోల్కొండ రవి అన్నారు. ఆదివారం ఆయన గ్రామంలో పర్యటించి వివిధ దుకాణాల యాజమానులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువులను వినియోగించటం వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించారు. గ్రామ పంచాయతీ తీర్మానాన్ని ధిక్కరించిన వారు జరిమానా కట్టక తప్పదని హెచ్చరించారు. ఆయన వెంట ఉప సర్పంచి, వార్డు సభ్యులు ఉన్నారు.

విద్యార్థి పోరుబాటను జయప్రదం చేయండి

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: గొల్ల కురుమల రిజర్వేషన్‌లను పునరుద్ధరించాలని గొల్ల కురుమ నవనిర్మాణ సమితి నాయకులు దాసరి నాగేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గొల్ల కురుమలు 1971 వరకు అర్థ సంచార తెగల్లో ఉండేవారని ఆ రిజర్వేషన్‌తో కొందరు లబ్ధిపొందడంతో అప్పటి ప్రభుత్వాలు గొల్లకురుమలను బీసీ వర్గంలో కలిపాయన్నారు. ఇప్పటికీ ఎంతో మంది అడవుల్లోనే మగ్గుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గొల్ల కురుమలు అభివృద్ధి చెందితే పాలకులకు మనుగడ ఉండదనే ఉద్దేశంతోనే అప్పటి పాలకులు అర్థ సంచార తెగల నుంచి విడదీశారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత రిజర్వేషన్లను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు గాలి సుధాకర్‌యాదవ్, చేపురి ఓదేలుయాదవ్, అంతటి నాగరాజుయాదవ్, అల్లంల చంటియాదవ్, గుండెల శ్రీనివాస్‌యాదవ్, నూకల రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

మల్లూరు(మంగపేట),న్యూస్‌టుడే: భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 6న నిర్వహించే రైతు పంచాయతీ సమావేశాన్ని విజయవంతం చేయాలని భాజపా ములుగు నియోజకవర్గ కన్వీనర్ జాడి వెంకట్ అన్నారు. మండలంలోని మల్లూరులో ఆదివారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని రైతాంగ సమస్యలపై, మౌలిక వసతుల కల్పన, నీటివనరులపై చర్చించి పరిష్కారం దిశగా కృషిచేసేందుకు సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గాజుల కృష్ణ, ఎర్రంగారి వీరన్‌కుమార్, రాసాని సాంబయ్య, మద్దిపాటి త్రిమూర్తులు, మద్దిని కృష్ణ, నవీన్, వీరయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండలంలో దిగంబర స్వామి

మంగపేట,న్యూస్‌టుడే: ఉత్తరాఖాండ్‌కు చెందిన దిగంబర (అగోర)స్వామి ఆదివారం మండలంలో పర్యటించారు. ఉత్తరాఖాండ్ నుంచి పూరి వెళ్తున్న స్వామి ఇతర స్వాములతో కలిసి ప్రత్యేక వాహనంలో మంగపేట పుష్కరఘాట్‌ను సందర్శించారు. అనంతరం మండల కేంద్రంలోని వడ్లకొండ గాయత్రి, శ్రీనివాస్ ఇంటిలోకి నేరుగా వెళ్లి కూర్చున్నారు. టీ కావాలని అడగడంతో ఇంటి యజమానులు స్వామికి టీ పోశారు. గ్రామస్థులు స్వామిని ఆశ్చర్యంగా చూశారు. కొంత మంది భక్తులు స్వామి ఆశీర్వచనం తీసుకొని కానుకలు ఇచ్చారు. మండలకేంద్రంలోని బీర్‌మోటా సంపత్‌లాల్‌ను స్వామి చక్కెర కావాలని అడగడంతో 50 కిలోల చక్కెర బస్తాను స్వామికి కానుకగా సమర్పించారు. అనంతరం బోరునర్సాపురంలో స్వామి భక్తులతో మాట్లాడి వారిని ఆశీర్వదించి వెళ్లిపోయారు.



భక్తులను ఆశీర్వదిస్తున్న స్వామి

ఏఎస్సై కుటుంబానికి పరామర్శ

ములుగు రూరల్,న్యూస్‌టుడే: మంగపేట పోలీసు స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మరణించిన దోబ సారయ్య కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతక్క ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో పల్లె జయపాల్‌రెడ్డి, దేవరనేని స్వామిరావు, మంకిడి పూర్ణచందర్, బొమ్మకంటి రమేష్ తదితరులు ఉన్నారు.

అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న భాస్కర్

ములుగు, న్యూస్‌టుడే: గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సుభాష్‌నగర్ కాలనీలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్తు డివిజనల్ ఇంజినీర్ చల్లూరి భాస్కర్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అన్నదాత వంగూరి పాపారావు, ఉత్సవ కమిటీ సభ్యులు భూక్యా రాజు, ఆడెపు రాజు, గుత్తికొండ రాజు, తుమ్మ అమర్, రమేష్, దువ్వ నర్సయ్య, పల్నాటి సమ్మయ్య, ఆడెపు సాంబయ్య, సన్ని, రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి సర్వీసు నిబంధనలు వర్తింపజేయాలి


ఏటూరునాగారం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీసు నిబంధనలు వర్తింపజేయాలని ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ మండలాధ్యక్షుడు వట్టం రాంబాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆ సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఏకీకృత సర్వీసు రూల్స్ అమల్లో ఐటీడీఏ ఉపాధ్యాయులకు మొదటి ప్రాధాన్యతనివ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏటీఎఫ్ ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిర్వహించ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొర్నిబెల్లి రాఘవరావు, కొమరం వెంకటేశ్వర్‌రావు, చాట్ల నారాయణ, పూసం లక్ష్మీనారాయణ, దబ్బగట్ల సుధాకర్, కోడి రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి కల్పనలో విఫలం'

ములుగు, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా, ఉపాధి కల్పనలో పూర్తిగా విఫలం చెందాయని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం ములుగులో ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రెండు ప్రభుత్వాలు మాయమాటలు చెప్పి విద్యార్థులను, యువకులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వానికి అవగాహన లేక నోటిఫికేషన్లు విడుదల చేస్తూ, రద్దు చేస్తూ నిరుద్యోగులతో ఆటలాడుకుంటుందని ఆరోపించారు. ప్రవీణ్, సంజీవ, రవి, నాగరాజు, సాగర్, జితేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించాలి

మంగపేట,న్యూస్‌టుడే: దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రేగ పాపయ్య, కాపుల కిష్టయ్య అన్నారు. ఆదివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులకు అంత్యోదయ కార్డులివ్వాలని, అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని, రూ.1500 నుంచి రూ. 3000లకు పింఛన్ పెంచాలని, రుణ సదుపాయం కల్పించాలని కోరారు. అనంతరం సంఘం మండల కమిటీ ఉపాధ్యక్షులుగా గాందెర్ల నర్సింగరావు, సహాయ కార్యదర్శిగా గోపాల శారద, కోశాధికారిగా కాంద్రా రాధాకృష్ణ, మహిళా ఉపాధ్యక్షులుగా కాపుల కృష్ణవేణి, ప్రచార కార్యదర్శిగా జానపట్ల జయరాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న రేగ పాపయ్య

గట్టమ్మ వద్ద భక్తుల సందడి

ములుగు రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని జాకారం గ్రామ పంచాయతీ పరిధిలోని గట్టమ్మ దేవాలయం వద్ద ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు కుటుంబ సమేతంగా గట్టమ్మ తల్లిని దర్శించుకొని అమ్మవారికి పసుపు, కుంకుమ, బెల్లం(బంగారం), చీరెసారెలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాడిపంటలు, పిల్లాపాపలు సల్లంగా ఉండేలా దీవించు తల్లి అంటూ వేడుకున్నారు. అనంతరం ఆలయ పరిసరాల్లో కుటుంబ సమేతంగా విందు భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఎస్సై ఓదేల వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆదివాసీ నాయకపోడు కమిటీల రద్దు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఆదివాసీ నాయకపోడు తెలంగాణ రాష్ట్ర కమిటీలు రద్దు చేస్తున్నట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దబ్బ సుధాకర్ తెలిపారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన ఆదివాసీ నాయకపోడు హక్కుల పోరాట సమితి పొలిట్‌బ్యూరో సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ దాని అనుబంధ సంఘాలైన నాయకపోడు సంస్కృతీ సమాఖ్య, విద్యార్థి సమాఖ్య, యువజన సమాఖ్య, ఉద్యోగ సమాఖ్య, మహిళా సమాఖ్య తదితర సంఘాల రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల కమిటీలను రద్దు చేసినట్లు ప్రకటించారు. గ్రామాల్లో, గూడేల్లో, నూతన కమిటీలను ఏర్పాటు చేసి లక్ష్య సాధనకు శాంతియుతంగా హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ నాయకపోడుల సంస్కృతీ, సంప్రదాయలతో అన్ని ఐటీడీఏల ఎదుట ప్రదర్శనలు చేయాలని పిలుపునిచ్చారు. తమ ఆరాధ్య దైవమైన లక్ష్మీదేవర నిళయాలకు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆదివాసీల హక్కులైన జల్, జమీన్, జంగిల్ సాధనకోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 40 సంవత్సరాలుగా ఐటీడీఏల నుంచి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నా ఆదివాసీ నాయకపోడులు మాత్రం కొండలకు పరిమితమవుతున్నారని తెలిపారు. కోడి గోపాల్‌నాయకపోడు, వెంకటేశ్వర్లు, రాజన్న, రవీందర్, సారయ్య, రాజునాయకపోడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

తాడ్వాయి,న్యూస్‌టుడే: మండలంలోని మేడారం అభివృద్ధి, భూపరిరక్షణ కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. సమ్మక్క,సారలమ్మ దేవతల గద్దెల ప్రాంగణంలో జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా చిడం బాబురావు, ఉపాధ్యక్షుడిగా సిద్దబోయిన సురేందర్, మరో 21మంది సభ్యులను ఎన్నుకున్నారు. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ ఆలం రామ్మూర్తి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో రవి, మునీందర్, లక్ష్మణ్‌రావు, కృష్ణయ్య, సమ్మయ్య, స్వామి, వసంతరావు పాల్గొన్నారు.

YOGA & MEDIDATION, BEAUTY PARLOUR, DIABETIES, PAINTS, HOMEO

CLASSIFIEDS

GIFTS, COURIERS, CELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS

AUTOMOTIVE

VEHICLES FOR SALE

Green Honda Offering Exchange Cars for Sale @ Reasonable Price, Tata Nano-2009, Hyundai Verna 2007, Maruthi Alto-2007, and Honda Demo Cars Also Available for Sales ✆ 7799914027

BUSINESS SERVICES

BUSINESS OFFER

థర్మాకోల్ & పేపర్‌ప్లేట్స్, టీ కప్స్, అగరబత్తి తయారుచేయు మెషిన్లు & రా మెటీరియల్ కలవు. నె॥ 20 వేలు పైగా ఆ॥, బై బ్యాక్ అగ్రిమెంట్. స్కై ఇంజినీరింగ్ కం॥, ఉప్పల్, HYD. ✆ 81063 70234.

ప్లాస్టిక్ పరిశ్రమ - మెషిన్లు అమ్మకం. ఇంటివద్దనే సరుకు తయారీ, ముడిసరుకు ఇచ్చి తయారైనది కొంటాం. నెలకు 20 వేలు పైగా ఆదాయం. 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. RJ ఎం॥ప్రై॥, ✆ 82978 57528.

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొత్త కాన్సెప్ట్‌తో సొంత ఇల్లు, కారు మరియు జీవితంలో ఆర్థికంగా స్థిరపడాలనుకునే వారికి స్వాగతం ✆ 9063446007/ 9121647479

పార్ట్ / పుల్ టైం (ఇంట్లో ఉంటూ) MLM కంపెనీకి వర్క్ చేస్తూ వారం వారం అధిక ఆదాయం (నిరుద్యోగులు, గృహిణిలు, విద్యార్థులు). Cont: 8142203674, 7799406283

FOR SALE

స్కూల్ బిల్డింగ్, స్థలం అమ్మబడును. 1 1/2 ఎకరం స్థలం, 1600 sft బిల్డింగ్ అమ్మబడును. పత్తిపాక రోడ్, మహ-బాద్ సెల్: 9989214726, 9550575809.

BUILDING & CONSTRUCTION

SEPTIC TANK CLEANING

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్.రావు Cont: 9849145043, 9866584455.

EDUCATION

కేవలము 2 1/2 నెలల్లోనే ఇంటర్/ డిగ్రీ, బిటెక్, ఎంటెక్, MBA, M.Phil, P.hD. పూర్తి. Eligible for Govt. & Private Jobs. C/o. DSR కాలేజీ, HNK. Cell: 9346634381.

★ **Inter/SSC One** Sitting & Inter/ Dip Fail ఐనా! Degree. చివరి తేది 31st ★ Inter సప్లి/ Reg & NEET & EAMCET Classes. సాయి MEDHA. 9700327445.

HEALTH CARE

Dr. Pilli Sambashiva Rao, Former Director of Health, Senior ENT & Head & Neck Surgeon. Aravinda Hospitals, Near Laxmi talkies, JPN Road, Warangal. 0870- 2426564.

PROFESSIONAL SERVICES

VAASTU

వాస్తుజగతంలో అద్భుతాలను సృష్టించిన వాస్తు ఎనర్జి- స్కానర్ & లేఖర్ యాంటినా ద్వారా వైజ్ఞానికంగా సరళ వాస్తు సలహాలను ఉచితంగా చెప్పబడును. 8500967548.

REAL ESTATE

HOUSE FOR SALE

ఘట్‌కేసర్, ఔషపూర్, వరంగల్‌హైవే ఫేసింగ్ HMDA అప్రూవుడ్ 29 లక్షలకే 150గ॥ ఇల్లు లక్ష రూ॥ బుకింగ్ 80% బ్యాంక్ లోన్ ఈ ఆఫర్ 10 మందికి మాత్రమే ✆ 9989943488

వరంగల్ కాకతీయ టాకీస్ ఎదురుగా 209 చ.గ.లలో గల పాత గూన ఇల్లు అమ్మబడును. కావాల్సినవారు వెంటనే సంప్రదించగలరు. సెల్: 83285 67348.

PLOT FOR SALE

సమత వెంచర్స్ భీమారంలో 200 ఫీట్ల NH2 రింగ్ రోడ్‌లో 1000 గజముల ప్లాటు రోడ్ ఫేసింగ్ గలది అమ్మబడును. పక్కా రిజిస్ట్రేషన్ కలదు. సం॥ 9399913107, 8686904586.

SITUATIONS VACANT

Wanted Teachers to teach English, Physics & Cook, Wardens (M/F), Workers (M/F) in Blue Bells H.School, Oglapur, Wgl. (R). Cont: 7075005005, 9515588995.

మీ జిల్లాలోని మా కంపెనీలో జాబ్ చేయుటకు సూ॥వైజర్స్, కం॥ ఆపరేటర్స్, టీం లీడర్స్, ఇంచార్జెస్, రిసెప్షనిస్ట్ కావలెను. జీ: 13,000+OT రూం+మీల్స్ ఫ్రీ. ✆ 7097678969

HYD 5 Star Hotels లో ఫిలింస్టార్స్ ఫుడ్ సర్వీస్‌కై క్యాటరింగ్ బాయ్స్ & హెల్పర్స్ కావలెను. వ॥ 18-30, రూం + మీల్స్ ఫ్రీ. జీ:12000 - 14500 ✆ 8885200700

రావుబ్రదర్స్ చిట్‌ఫండ్స్ ప్రై॥లి॥ హనుమకొండ బ్రాంచ్‌నందు పనిచేయుటకు Branch Managers, Asst. Business Manager, Agents(Business) కావలెను. ఆసక్తి గలవారు ఇంటర్వ్యూకు 28/8/17న హాజరు కాగలరు. ✆ 9394335568/ 9394335659.

జీతం: 8000-15000 వరకు ఉచితవసతి భోజనం చదువున్న లేకున్న ఉచిత నర్సింగ్ ట్రైనింగ్ ఇచ్చి స్త్రీ/పులకు నర్సింగ్‌కేర్ జాబ్ చూపించబడును. 9966310431/ 9010137634.

హైదరాబాద్‌లోని ఇళ్లల్లో 24గం॥లు వృద్ధులకు సేవ చేయడానికి, వంట చేయడానికి, పిల్లలను చూసుకోవడానికి 100 మంది ఆడవారు/ మగవారు కావలెను. జీతం: 9 వేలు భో+ వసతి ఫ్రీ. ✆ 7032025222.

Wanted Business Development Managers for MNC Company to work in Wgl, Age 26 above. Qualification: Min. Degree. Salary: PA 2 Lac & Incentives. 8096147410.

ప్రముఖ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌లో పనిచేయుటకు లేడి రిసిప్షనిస్ట్ & ఆఫీస్ బాయ్ కావలెను. Qly: Any డిగ్రీ. సంప్ర॥ 9866974972, 9440011067.

రిసెప్షనిస్ట్, PRO కావలెను. S.R.Diagnostics, గంద్ర కాంప్లెక్స్, కాకాజీకాలనీ, HNK. # 9100021882, 9000560896.

MARKETING / SALES

J.S.R. గ్రూప్ సన్‌సిటీ యాదగిరిగుట్ట వరంగల్ హైవేలో రియల్ ఎస్టేట్ మార్కెటింగ్‌కు టీమ్‌లీడర్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం+ కమీషన్+ ఇన్సెంటీవ్స్ ఇవ్వబడును. 7799893899

DRIVERS

లైఫ్ స్టయిల్ ఫర్నీచర్, కరీంనగర్ గాంధీ రోడ్‌లో పని చేయుటకు Tata Ace, Ashok Layland, Ape ట్రాలీ నడుపుటకు లైసన్స్ బ్యాడ్జీ కల్గిన వర్కర్ కం డ్రైవర్స్ కావలెను. జీతం: 7000/-, ఉచిత వసతి. సెల్: 99498 63130.

TOURS & TRAVELS

కాశీయాత్ర- కాశీ, ప్రయాగ, నైమిషారణ్యం, గయ 9రో॥వ॥భో॥ 6000/- Oct-2 రామేశ్వరం, కన్యాకుమారి, మధురై, కంచి 8రో॥ 6200/-వ॥భో॥ 7-9&20-9. సత్యసాయి సేవాసమాజ్ 9618933189

Singapore & Malaysia @ 49,999/- Dubai & Abudhabi @ 49,999/- Bangkok, Pattaya & Phuket @ 39,999/- Kakani Holidays P.Ltd. ✆ 97016 95555.

శ్రీలంక రామాయణ యాత్ర & శాంకరీదేవితో @ 33,999/- శోభన, ద్వారక, ఉజ్జయిని & ఓంకాళేశ్వరితో @ 14,999/- కాకాని హాలిడేస్ ప్రై॥ లిమిటెడ్. ✆ 91779 42424.

కావేరి పుష్కరాలు శ్రీరంగం, రామేశ్వరం, తంజావూరు, చిదంబరం, త్రివేంద్రం, కన్యాకుమారి+ 30 క్షేత్రాలు, Sep 15 న A.C. యాత్ర, దసరాకి Sep 26 న పూరి 5 రో॥ యాత్ర, లక్ష్మీటూర్స్ ✆ 98662 46466.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

చక్కని చేతి రాతతో మంచి మార్కులు


ముగిసిన 'ఈనాడు-హాయ్‌బుజ్జీ' శిక్షణ



చేతి రాత శిక్షణ తరగతి గదిలో విద్యార్థులతోపాటు శిక్షకుడు

ఎక్సైజ్‌కాలనీ, న్యూస్‌టుడే: విద్యార్థులలో ప్రతిభ ఉన్నప్పటికీ పరీక్షలలో అందమైన చేతిరాతతో చక్కనైన మార్కులను సాధించవచ్చని చేతిరాత నిపుణుడు సదానందం అన్నారు. గత పది వారాలుగా వరంగల్ అర్బన్ జిల్లా కేంద్రం సర్క్యూట్ అతిథిగృహం రోడ్డులోని ఆర్యభట్ట కాన్సెప్ట్ పాఠశాలలో 'ఈనాడు-హాయ్‌బుజ్జీ' సంయుక్తంగా నిర్వహించిన చేతిరాత శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. శిక్షణ తీసుకున్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ.. చేతిరాత మెరుగపడటంతో విద్యార్థులలో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. పరీక్షలలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇక్కడ నేర్చుకున్న విషయాలను ఇంటి వద్ద సాధన చేయాలని చెప్పారు. దీంతో చేతిరాత మరింత మెరుగుపడుతుందన్నారు. చాలామంది విద్యార్థులలో ప్రతిభ ఉంటుంది. కానీ చేతిరాత బాగా లేకపోవడంతో పరీక్షలలో మార్కులు తక్కువగా వచ్చిన సందర్భాలున్నాయన్నారు. ఈ శిక్షణ తీసుకోవడంతో దీనిని మెరుగుపర్చుకోవచ్చని తెలిపారు.

మార్కులు ఎక్కువగా వచ్చాయి



శ్రేష్ఠ, 9వ తరగతి, రాంనగర్

గత కొన్ని వారాల నుంచి చేతిరాతలో శిక్షణ తీసుకోవడంతో పరీక్షలలో ఎక్కువ మార్కులు వచ్చాయి. రాయడం కూడా సులభమైంది. గతంలో చేతిరాత సరిగ్గా లేకపోవడంతో ఎంత రాసినా మార్కులు తక్కువగా వచ్చేవి. కానీ శిక్షణలో ఇచ్చిన అంశాలను తీసుకొని ఇంటి వద్ద నిరంతరం సాధన చేయడంతో మంచి మార్కులు వచ్చాయి. తోటి విద్యార్థులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

చేతిరాత మెరుగైంది



రుషికేష్, 5వ తరగతి, హన్మకొండ

గతంలో కంటే శిక్షణ తీసుకున్న తర్వాత నా చేతి రాత మెరుగైంది. బాగా రాయాలని అనిపిస్తుంది. శిక్షణ సమయంలో అధ్యాపకులు చాలా విషయాలను తెలిపారు. చేతిరాత మెరుగుపడటంతో పరీక్షలు కూడా బాగా రాస్తున్నాను. నా రాత పుస్తకాలలో అక్షరాలు బాగా రాయగలుతున్నాను. శిక్షణతో అనేక నూతన విషయాలను తెలుసుకున్నాను.

రేపు అనాథలకు ప్రతిభా పాటవ పోటీలు

బాలసముద్రం, న్యూస్‌టుడే : జ్యోతిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాథలు, దివ్యాంగులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులకు మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు దూదిపాల జ్యోతిరెడ్డి పేర్కొన్నారు. 'సాంస్కృతిక ఉత్సవ సంబురాలు-2017' పేరుతో వరంగల్ రంగశాయిపేటలోని గణపతి ఇంజనీరింగ్ కళాశాల వేదికగా పోటీలు నిర్వహిచనున్నట్లు వివరించారు. ఈ పోటీల్లో వ్యక్తిగతంగా, స్వచ్ఛంద సంస్థల నుంచి పాల్గొనే అవకాశముందన్నారు. నృత్యాలు, గీతాలాపన, వ్యాసరచన, ఫ్యాషన్‌షో తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి అదే రోజు సాయంత్రం ముగింపు వేడుకల్లో బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. ఐదు జిల్లాల పరిధిలో ఆసక్తిగల వారు మంగళవారం ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సొసైటీ కార్యదర్శి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, ఎవరెస్ట్ అధిరోహించిన విద్యార్థులు పూర్ణిమ, ఆనంద్ పాల్గొంటున్నారని తెలిపారు. అనాథ పిల్లలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఎనిమిదేళ్లుగా ఏటా ఆగస్టు 29వ తేదీ ఈ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీలకు హాజరయ్యే వారు పూర్తి వివరాలకు 99481 30367 గల సెల్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

'వెనుబడిన కులాలను ఆదుకుంటాం'

ఎన్జీవోస్ కాలనీ, న్యూస్‌టుడే : సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడిన జాతులను ప్రభుత్వం అన్ని రంగాలలో ప్రోత్సహించడంతో పాటు ఆ కులాలకు బాసటగా నిలుస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ పేర్కొన్నారు. హన్మకొండ ఎన్జీవోస్ కాలనీలో పూసల సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక సందర్భంగా ఉమ్మడి జిల్లాల మాజీ అధ్యక్షుడు మన్నూరు ఉమా అధ్యక్షతన ఉత్తర తెలంగాణ ప్రతినిధుల సభ అదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, నగర మేయర్ నరేందర్ హాజరయ్యారు. వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన హామీలో భాగంగా పూసల కులస్థులకు కమ్యూనిటీ హాల్‌కు నగరంలో మూడు వందల గజాల స్థలం, సీడీఎఫ్ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో సామాజిక కులాల స్థితిగతులపై అధ్యయనం జరుగుతుందని చెప్పారు. మేయర్ నరేందర్ మాట్లాడుతూ.. నగరంలో పూసల కులస్థుల కోసం కార్పొరేషన్ ద్వారా తగిన సహాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పూసల సంఘం రాష్ట్ర నేతలు గుంటుపల్లి వెంకట్, పన్నీరు సత్యం, ముదురుకోళ సారయ్య, సంపత్, జిల్లా నాయకులు రామనాథం, యాకయ్య, కోటిలింగం, కృష్ణ, బాలనారాయణ, రాజు, ఉప్పుల స్వామి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్



మాట్లాడుతున్న భాస్కర్

రాంనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలలో పని చేస్తున్న కార్మికుల వేతనాలు పెంచుతూ వెంటనే ప్రభుత్వం జీవోను విడుదల చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం రాంనగర్ సుందరయ్య భవన్‌లో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వేతనాలు పెంచాలని 2015లో హైదరాబాద్‌లో మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సమ్మె విరమింపజేసి వేతనాలు పెంచి కేవలం హైదరాబాద్ మున్సిపాలిటీకే పరిమితం చేశారన్నారు. మిగిలిన 30 జిల్లాల్లో కార్మికులను ప్రభుత్వం మోసం చేస్తూ వస్తుందన్నారు. ండేళ్ల నుంచి కార్మికులు వేతనాలు పెరుగుతాయని వేచి చూస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ఈనెల 29, 30 తేదీల్లో కార్మికులు సమ్మెకు దిగుతారని ముందుస్తు నోటీసులు ఇస్తే 21, 23 తేదీలలో రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలిచింది. కానీ ఫలితం లేదన్నారు. 28 న మరో సారి చర్చలు ఉన్నాయని తెలిపారు. పెంచిన వేతనాలను ఇవ్వాలని ఎలాంటి షరతులను విధించకుండా జీవో నెంబర్ 14ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్‌ను కల్పించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ నాయకులు కమర్ అలీ, జన్ను ప్రకాశ్, రాజమల్లు, లలిత తదితరులు పాల్గొన్నారు.

రేపు న్యాయవాదుల నిరసన

వరంగల్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం పేరుతో న్యాయవాదులపై పెంచుతున్న ఒత్తిడిని నిరసిస్తూ ఈనెల 29న న్యాయవాదులు నిరసన ప్రదర్శనకు సిద్ధమవుతున్నారని బార్ కౌన్సిల్ అడ్‌హక్ కమిటీ సభ్యుడు ముద్దసాని సహోదర్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ సిటీ సివిల్ బార్ అసోసియేషన్ హాల్లో శనివారం అన్ని జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు, బార్ అసోసియేషన్ల సమాఖ్య, తెలంగాణ ప్రాంత బార్ కౌన్సిల్ అడ్‌హక్ కమిటీ సభ్యుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. 2012 సంవత్సరం వరకు పెండింగ్‌లో ఉన్న క్రిమినల్, సివిల్ కేసులను సత్వరమే పరిష్కరించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలతో న్యాయమూర్తులు, న్యాయవాదులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని వెల్లడించారు. సత్వర పరిష్కారం పేరుతో కేసుల్లో నష్టం వాటిల్లే ప్రమాదం కూడా ఉండడంతో ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఈనెల 29న న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారని, వచ్చే నెల ఒకటో తేదీన రాష్ట్రంలోని అన్ని కోర్టుల్లో బంద్ పాటించి విధులకు దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు తెలిపారు.

పొత్తులు.. ఎత్తులు

☛ కూటమిగా విప్లవ కార్మిక సంఘాలు.. జాతీయ పక్షాల జోడీ

☛ సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కొత్త ఒరవడి

న్యూస్‌టుడే, కోల్‌బెల్ట్: త్వరలో జరగనున్న సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు అన్ని సంఘాలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఇప్పటికే ఉనికి కోల్పోయే పరిస్థితిని ఎదుర్కొంటున్న పలు సంఘాలు ఈ ఎన్నికల ద్వారా ఎంతో కొంత గుర్తింపు దక్కించుకోవాలని చూస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే భావ సారూప్యత ఉన్న సంఘాలు కూటమి కడుతున్నాయి. పలు జాతీయ సంఘాలు కూడా పొత్తుతో పోటీ చేసేందుకు అగ్ర నాయకత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

సింగరేణిలో ఒక దశలో 70 సంఘాలకు పైగా కార్యకలాపాలు నిర్వహించేవి. గుర్తింపు సంఘం ఎన్నికల అనంతరం వాటి సంఖ్య 16కు చేరుకుంది. వచ్చే అక్టోబరు 5న జరిగే ఎన్నికలకు కేవలం 16 సంఘాలు మాత్రమే అర్హత సాధించాయి. సభ్యత్వ నమోదుతో పాటు వార్షిక నివేదికలను సమర్పించిన ఆ సంఘాలు గుర్తింపు సంఘం ఎన్నికల్లో పోటీ చేసేందుకు కార్మిక శాఖ గుర్తించింది. ఇప్పటికే విప్లవ కార్మిక సంఘాలు ఒక కూటమిగా ఏర్పడి ఐక్యంగా పోటీ చేయాలని నిర్ణయించాయి. జాతీయ కార్మిక సంఘాల్లో కూడా కొన్ని ఒకే బ్యానర్‌పై పోటీ చేసి గెలిచిన తర్వాత ఆయా ప్రాంతాల్లో ప్రాతినిధ్యం కల్పించే అంశాలపై అంతర్గతంగా చర్చలు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రాంతీయ కార్మిక సంఘాల విషయంలో స్పష్టత లేకపోయినా ఎవరికి వారు ఒంటరిగా పోటీ చేస్తారా, లేక ఉమ్మడిగా బరిలో దిగుతారా! అన్న విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుత ఎన్నికల్లో అయిదు జాతీయ కార్మిక సంఘాలతో పాటు రెండు ప్రాంతీయ కార్మిక సంఘాలు, మరో ఆరు వాటికి భావసారూప్యత కలిగిన సంఘాలున్నాయి. వీటితో పాటు మరికొన్ని సంఘాలు కూడా పోటీలో ఉండే అవకాశం ఉంది. సెప్టెంబరు 14 నుంచి నామినేషన్ల స్వీకరణ ఉండటంతో అప్పటివరకు పోటీ చేసే సంఘాల జాబితా వెలువడే అవకాశం ఉంది. అయితే దానికి ముందుగానే కొన్ని సంఘాలు ఇప్పటి నుంచే పొత్తుల అంశంపై చర్చించుకుంటున్నాయి.

ఈసారి తప్పితే ఉనికి గల్లంతు

ఆరో విడత జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఉనికి చాటుకోకుంటే భవిష్యత్తులో పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. ఇదే అంశం అన్ని కార్మిక సంఘాలను ఆందోళనకు గురి చేస్తోంది. ప్రతిసారీ గుర్తింపు ఎన్నికల్లో కొన్ని సంఘాలు మాత్రమే గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలుగా గెలుస్తూ వస్తున్నాయి. కొన్ని సంఘాలు ఇప్పటివరకు అసలు ఖాతాలు తెరవలేదు. 1998లో తొలిసారి జరిగిన ఎన్నికల నుంచి ఇప్పటివరకు అసలుకే గెలవని సంఘాల ఉనికి ఇప్పటికే దాదాపు కనుమరుగయ్యే పరిస్థితికి చేరుకుంది. కార్మికుల్లో పట్టు లేక పోవడంతో యాజమాన్యం వద్ద ప్రాతినిధ్యం వహించే అవకాశం లేకుండా పోతుంది. దీంతో ఆయా సంఘాలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. దీని కోసం అవసరమైతే ఐక్యంగా పోటీ చేయడానికి మొగ్గు చూపుతున్నాయి. బలహీనంగా ఉన్న సంఘాలన్నీ ఒక్కటిగా పోటీ చేయడం వల్ల కార్మికుల్లో పట్టు సాధించే అవకాశం ఉంటుందని భావిస్తున్నాయి. అనుకూలంగా ఉన్న సంఘాలతో సంప్రదింపులు జరుపుతున్నాయి. ముఖ్యంగా విప్లవ కార్మిక సంఘాలకు చెందిన ఒక సంఘానికి మాత్రం ఒకే ఒకసారి ప్రాతినిధ్యం దక్కింది. ఆ తర్వాత పూర్తిగా ఆదరణ కోల్పోయింది. సంఘాల మధ్య భిన్నాభిప్రాయాలను పక్కన పెట్టి ఎన్నికల వరకు మాత్రం ఐక్యంగా పోటీ చేయాలని విప్లవ కార్మిక సంఘాలు నిర్ణయించాయి. దీని ద్వారా తమ ఉనికి చాటుకోవడానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నాయి. అయితే జాతీయ కార్మిక సంఘాల్లోని రెండు సంఘాలకు ఇప్పటివరకు ఎక్కడా ప్రాతినిధ్యం దక్కలేదు. ఐదు ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలనే ఎదుర్కొన్న సంఘాలు ఈసారి కొంత పట్టు సాధించాలన్న ఆలోచనతో పావులు కదుపుతున్నాయి. అయితే దీనికి మిగతా సంఘాలను కలుపుకుని పోటీ చేస్తే తమకు కొంత లాభం చేకూరుతుందని ఆలోచిస్తున్నాయి.

ఆచితూచి అడుగులు

పొత్తుల విషయంలో కార్మికుల్లో పట్టున్న సంఘాలు ఆచితూచి అడుగులు వేసే అవకాశం ఉంది. పొత్తు పెట్టుకోవడం ద్వారా లాభమా! నష్టమా! అన్న అంశాలను బేరీజు వేసుకుని ముందుకు అడుగులు వేసే అవకాశం ఉంది. ఇదివరకు జరిగిన ఎన్నికల్లో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలుగా అవకాశం దక్కించుకున్న సంఘాలు పొత్తు వల్ల మేలు జరిగితే అడుగు ముందుకు వేసే అవకాశం ఉంది. ఒకవేళ నష్టం జరిగే పక్షంలో పొత్తులకు దూరంగా ఉండాలన్న ఆలోచన చేస్తున్నాయి. ఇదివరకు గుర్తింపు సంఘంగా గెలిచిన సంఘాలు పొత్తు విషయంలో స్పష్టతకు రాలేదు. అయితే జాతీయ స్థాయిలో ప్రధాన కార్మిక సంఘాల మధ్య కొంతవరకు అంగీకారం కుదుర్చుకున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో గుర్తింపు సంఘం ఎన్నికల్లో కలిసి పోటీ చేసే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా పోటీ ఇచ్చే సంఘాలు ఆచితూచి అడుగులు వేసే అవకాశాలున్నాయి.



స్వచ్ఛ పఖ్వాడపై అవగాహన

కోల్‌బెల్ట్, న్యూస్‌టుడే: స్వచ్ఛ పఖ్వాడపై సింగరేణి సేవా సమితి, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఇంటిఇంటికీ కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పీఎం రాజేంద్రకుమార్ మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత అనేది ఎంతో ముఖ్యమన్నారు. కాలనీలో కూడా అదేవిధంగా శుభ్రత అవసరమన్నారు. ఇంటి వద్ద ఏవిధంగా పరిశుభ్రతను చాటుతున్నామో కాలనీ, ప్రాంతం, దేశంలో కూడా స్వచ్ఛతగా ఉంచుదామన్నారు. కార్యక్రమంలో పీవోలు తిరుపతి, మదార్, స్కౌట్స్ లీడర్ సంజీవరావు, కోఆర్డినేటర్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

పరిష్కారం ఎక్కడ..?

కోల్‌బెల్ట్, న్యూస్‌టుడే: గత ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన 72 డిమాండ్ల హామీ ఎక్కడ పరిష్కారం జరిగిందో టీబీజీకేఎస్ నాయకులు చెప్పాలని ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు రాజేందర్ అన్నారు. ఆదివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమైన డిమాండ్లు వారసత్వ ఉద్యోగాలు, ఆదాయపు పన్ను రద్దు, లాభాల వాటా 30శాతం సాధించడంలో ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. మళ్లీ ఏవిధంగా కార్మికుల వద్దకు వస్తున్నారో తెలుపాలన్నారు. కార్మికులను నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు శర్మ, సమ్మిరెడ్డి, నర్సింగరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మీసేవ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

కోల్‌బెల్ట్, న్యూస్‌టుడే: తెలంగాణ మీసేవ అసోసియేషన్ నూతన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు దేవేందర్ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడిగా పోలు తిరుపతి, ఉపాధ్యక్షులుగా రఘువీర్, సదానందం, ప్రధాన కార్యదర్శిగా పల్నాటి సతీష్, సంయుక్త కార్యదర్శిగా వేణు, కోశాధికారిగా అనీల్ కుమార్ ఎన్నికైనట్లు తెలిపారు.

హెచ్‌ఎంఎస్‌లో భద్రత సిబ్బంది చేరిక

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి భద్రత విభాగంలో పనిచేస్తున్న కొంత మంది సిబ్బంది ఆదివారం సాయంత్రం హెచ్‌ఎంఎస్‌లో చేరారు. ఈమేరకు గోదావరిఖనిలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారికి కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. హెచ్ఎంఎస్ నాయకులు రియాజ్‌అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, భద్రత సిబ్బందికి కేడర్‌స్కీమ్ పదోన్నతులను తప్పకుండా అమలు చేయిస్తామని వెల్లడించారు. సింగరేణి ఆస్తుల రక్షణకు నిరంతరం నిఘా విభాగంగా పని చేస్తున్న భద్రత సిబ్బందిని యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. తమకు అవకాశం కల్పిస్తే తప్పకుండా కేడర్‌స్కీమ్ పదోన్నతులను అమలు చేయిస్తామని చెప్పారు. వెల్లడించారు. సమావేశంలో నాయకులు సత్తయ్య, ప్రతాపరావు, షబ్బీర్‌అహ్మద్, ప్రభాకర్, సత్యనారాయణ, శ్రీనివాస్, వీరస్వామి, నరేష్, రమేష్, శంకర్‌రెడ్డి, శంకరయ్య, గౌహర్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

‘సమాన పనికి సమాన వేతనం చెల్లించాల్సిందే’

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సంస్థలో పని చేస్తున్న ఒప్పంద కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాల్సిందేనని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీతారామయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కాలనీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలోని అన్ని బొగ్గు రంగ సంస్థలో హైపవర్ కమిటీ వేతనాలు అమలవుతుండగా సంస్థలో మాత్రం భిన్న వైఖరిని అవలంబించడం సరికాదన్నారు. ఇటీవల యాజమాన్యం ఒప్పంద కార్మికుల పొట్ట కొట్టేలా వేతన ఉత్తర్వులు జారీ చేశారని, దీనివల్ల ఒప్పంద కార్మికులకు ఏమాత్రం లాభం లేదన్నారు. బొగ్గుగనుల్లో, దాని అనుబంధ రంగాల్లో పని చేస్తున్న ప్రతి ఒక్కరికీ జేబీసీసీ సూచనల ప్రకారం ఎన్‌సీడబ్ల్యుఏ కేటగిరి-1 వేతనం ఇవ్వాల్సిందేనన్నారు. పదో వేతన ఒప్పందంలో అగ్రిమెంట్ విషయంలో ఒప్పంద కకార్మికులకు ఒకటవ కేటగిరి వేతనం ఇచ్చేలా జాతీయ సంఘాలు కృషి చేయాలన్నారు. సంస్థలో పని చేస్తున్న ఒప్పంద కార్మికులకు న్యాయం జరగాలన్న ప్రధాన డిమాండ్‌తో దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గుగనుల కార్మిక సంఘాలతో జాయింట్ ప్లాట్‌ఫాం ఆఫ్ కోల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్‌గా ఏర్పడి ఆందోళనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ఆందోళనలను ఒప్పంద కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వెంకన్న, నరేష్, బి.అశోక్, టి.రమేష్, దుర్గయ్య, రాజనర్సు, శంకర్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ద్విచక్ర వాహన ర్యాలీ


ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మంజూర్‌నగర్, న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థలో జరగనున్న గుర్తింపు ఎన్నికల నేపథ్యంలో ఐఎన్‌టీయూసీ అనుబంధ 327 యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ స్థానిక హనుమాన్ దేవాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా మీదుగా వర్క్‌షాపు వరకు కొనసాగింది. ఈసందర్భంగా ఆసంఘం నాయకులు బాబు, పరమేశ్ మాట్లాడారు. విద్యుత్తు సంస్థలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా చేయించిన ఘనత ఐఎన్‌టీయూసీదేనన్నారు. కార్యక్రమంలో నాయకులు సదయ్య, మల్లేష్, రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష మొక్కలు, లక్ష చీరల పంపిణీ లక్ష్యం

తెరాస రాష్ట్ర నాయకుడు కుంచాల సదావిజయ్‌కుమార్


చీరలు, మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గోపాలపురం (చిట్యాల) న్యూస్‌టుడే: జయశంకర్ భూపాలపల్లి నియోజక వర్గ వ్యాప్తంగా లక్ష చీరలు, లక్ష మొక్కలు పంపిణీ చేయాలనే లక్ష్యంగా పెట్టుకుని చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెరాస రాష్ట్ర నాయకుడు కుంచాల సదావిజయ్‌కుమార్ పేర్కొన్నారు. చిట్యాల మండలం గోపాలపురానికి చెందిన కుంచాల లక్ష్మయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఆదివారం గోపాలపురంలోని సుమారు వేయి మంది మహిళలకు ఒక్కొక్కరికి ఒక చెట్టు, చీర అందించారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని ప్రతి గ్రామంలోని మహిళలందరికీ ఒక లక్ష చీరలు, ఒక లక్ష మొక్కలు పంపిణీ చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు, ఆశీస్సులతో ఈ బృహత్తర కార్యానికి శ్రీకారం చుట్టినట్లు సదావిజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన చీరలు, మొక్కల పంపిణీ కార్యక్రమానికి స్థానిక సీఐ గంద్రతి మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినూత్న రీతిలో చేపట్టిన చీరలు, మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టాలనే ఆలోచన చేసిన కుంచాల సదావిజయ్‌కుమార్‌ను ఆయన అభినందించారు. ఇప్పటి వరకు 27 వేల చీరలు, పండ్ల మొక్కలు పంపిణీ చేసినట్లు సదావిజయ్‌కుమార్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని మహిళలకు చీరతోపాటు మొక్క అందించడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. నేడు తాను పంచిన మొక్కలను పెంచిన వారికి మరోసారి సందర్శించి చీరను అందిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచి తీర్థాల విజయ, ఎంపీటీసీ సభ్యురాలు ఏరుకొండ యమున, రేగొండ మండలంలోని నిజాంపల్లి మాజీ సర్పంచి శ్రీనివాస్, నాయకులు విజయ్, కాట్రేవుల కుమార్, సుధాకర్, గణపతి, కుంచాల హన్మంతు, శంకర్, అజ్మీర రఘు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యపురస్కారానికి పట్టుదలతో సాధన చేయాలి

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి సంస్థ స్కౌట్ ఉద్యమానికి ఎంతో తోడ్పాటునందిస్తుందని జీఎం విజయ్‌పాల్‌రెడ్డి వెల్లడించారు. గోదావరిఖని బడేన్‌పావెల్ పార్కులో భారత స్కౌట్, గైడ్స్ సింగరేణి డిస్ట్రిక్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తృతీయ సోపాన్ పరీక్ష శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా స్కౌట్ ఉద్యమానికి సింగరేణి సహకారం అందిస్తుందన్నారు. సింగరేణి ప్రోత్సాహం ద్వారానే రాష్ట్రపతి అవార్డులు అందుకుంటున్నారని, ఈసారి రాజ్య పురస్కారానికి ఎంపికయ్యేందుకు పట్టుదలతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్కౌట్ మాస్టర్లు విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి వారిలో నైపుణ్యం పెంచాలని, దాని ద్వారా రాష్ట్రపతి అవార్డులతో పాటు రాజ్యపురస్కారానికి ఎంపిక కావడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. స్కౌట్ ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలని, గోదావరిఖనిలోని అన్ని పాఠశాలల్లో స్కౌట్ యూనిట్లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్కౌట్ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ పెరుగుతుందని, ఐదు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాల్లో మరింత ఉత్సాహంగా తయారు కావాలన్నారు. ఈ శిబిరంలో ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు, గోలేటి, శ్రీరాంపూర్ ప్రాంతాలకు చెందిన 52 మంది స్కౌట్, 10 మంది మాస్టర్లు హాజరయ్యారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ మంచాల శ్రీనివాస్, సీనియర్ పీవో సిహెచ్.గంగాధర్, సింగరేణి డిస్ట్రిక్టు స్కౌట్ ఆర్గనైజింగ్ కమిషనర్ కె.వి.రమణ, క్యాంపు నాయకులు కె.భాస్కర్, రోవర్ స్కౌట్ నాయకునిగా కె.రాంచెందర్‌రావు, స్కౌట్ మాస్టర్ పి.సాయి, నిరంజన్, సుధాకర్, రవికిరణ్‌చారీ, వేణు, శక్తికుమార్, సాజిత్, ప్రకాశరావు, కుమారస్వామి, సుగుణరాజు, రాజేశం, మల్లయ్య, చంద్రమౌళి, వెంకటస్వామి, పాల్గొన్నారు.



సాధించి చూపాలనుకుంటే.. ఏదైనా సాధ్యమే!

ప్రభుత్వ ఉద్యోగి పరంగా చూస్తే దేశంలోనే అత్యుత్తమ స్థానం ఐఏఎస్. ఎంతో మంది యువతీ యువకుల కలల స్వప్నం ఆ స్థానం. ఐఏఎస్ సాధనలో ఎంతో కష్టపడాల్సి వస్తుంది. తనను తాను నమ్మి.. సాధించగలననే నమ్మకంతో ముందుకు సాగితేనే అది సొంతమవుతుంది. 'నేను సాధించగలను' అనే నమ్మకం ఉంటేనే విజయాన్ని సాధించగలమని ములుగు సబ్ కలెక్టర్ వీపీ గౌతమ్ అంటున్నారు. లక్ష్య సాధన కోసం పట్టువిడుపు లేకుండా ముందుకు సాగాలంటున్న ఆయన తన విజయ ప్రస్థానాన్ని 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు. ఆయన మాటల్లోనే..

న్యూస్‌టుడే, ములుగు

- కష్టపడి చదవాలి.. ఉన్నతంగా ఎదగాలి
- 'న్యూస్‌టుడే'తో ములుగు సబ్ కలెక్టర్ గౌతమ్

మాది తమిళనాడులోని దిండి జిల్లా వట్టజత్రం గ్రామం. నాన్న పేరు వి.ఫళని చామి, అమ్మ ఆర్. కస్తూరి. గ్రామంలోని క్రిస్టియన్ మెట్రిక్యులేషన్ పాఠశాలలో ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు చదివా. ఇంటర్‌లో ఎంబైపీసీలో చేరా. అనంతరం చెన్నైలోని దిండి ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ బ్రాంచిలో 2012లో డిగ్రీ పూర్తి చేశా. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో చేరినప్పుడే సివిల్స్ వైపు వెళ్లాలని నిర్ణయించుకున్నా. క్యాంపస్‌లో ఉద్యోగాల కోసం పలుసార్లు ఇంటర్వ్యూలు జరిగినప్పటికీ హాజరు కాలేదు. ఐఏఎస్ అనే హోదాతో ప్రజలకు న్యాయం చేయగలమని సివిల్స్‌పై దృష్టి కేంద్రీకరించాను.

మొదటి సారే సాధించా..: ఐఏఎస్ లక్ష్యంగా పెట్టుకొని 2012లో ఇంజినీరింగ్ పూర్తయిన తర్వాత ఉద్యోగం గురించి ఆలోచించకుండా ఒక సంవత్సరం పాటు చెన్నైలోని శంకర్ ఐఏఎస్ అకాడమీలో చేరాను. వాస్తవంగా శిక్షణ కోసం దిల్లీ వెళ్లాలనుకున్నా. కానీ అన్ని వసతులు ఉండడంతో చెన్నైలోనే చేరిపోయా. ఏడాది పాటు శిక్షణ అనంతరం 2013లో మొదటి సారి సివిల్స్ రాశా. రోజుకు 14 గంటల చదివాను. మొదటి సారే జాతీయ స్థాయిలో 138 ర్యాంకు ద్వారా ఐఏఎస్‌కు ఎంపికయ్యా. మా జిల్లాలో ఐఏఎస్ సాధించిన మొదటి వ్యక్తిని నేనే.

సగటు విద్యార్థి సైతం..: ఇంటర్మీడియెట్‌లో సగటు విద్యార్థిగా ఉండి, అనంతరం చదువుల్లో రాణించి ఐఏఎస్ సాధించిన వారు అనేక మంది ఉన్నారు. ఎప్పుడైనా సివిల్స్ సాధించాలనుకునే వారికి ప్రత్యేకంగా కావాల్సింది.. పట్టుదల, సాధించగలననే నమ్మకం. ఒకసారి విజయం సాధించకుంటే నిరుత్సాహపడొద్దు. సాధించే వరకు ఒకే ఉత్సాహంతో ముందుకు సాగాలి. ప్రస్తుతం అన్ని పట్టణాల్లో ఇందుకుతగ్గ మెటీరియల్, శిక్షణ లభిస్తుంది. కాబట్టి ఎవరైనా సులువుగా సాధించవచ్చు.

క్రీడలంటే ఇష్టం: నాకు క్రీడలంటే ఇష్టమే. ప్రధానంగా చెస్, బ్యాడ్మింటన్ అంటే బాగా ఆసక్తి. రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో పాల్గొన్నా. క్రికెట్, టెన్నిస్ సైతం ఆడుతాను.

సలహాలు ఇస్తున్నా..: సివిల్స్ పట్ల ఆసక్తి ఉన్న పలువురు నా వద్దకు వస్తున్నారు. ఎలా ముందుకు వెళ్లాలి? ఎలా చదవాలి? ఏం చేయాలి? శిక్షణ ఎలా? అనే అంశాలపై సందేహాలను నివృత్తి చేసుకునేందుకు పలువురు వస్తున్నారు. ఆసక్తి ఉన్నవారిని బాగా ప్రోత్సహిస్తున్నా. పోటీ పరీక్షలకు వెళ్లాలనుకునే వారికి 'ఈనాడు' దినపత్రికలో వస్తున్న సమాచారం బాగా ఉపయోగకరంగా ఉంటుంది.

సామాన్య వ్యక్తిగా ఏం చేయలేం: నేను ఒక సామాన్య వ్యక్తిగా ఎన్నో సమస్యలు చూశా. అదే ఒక అధికారిగా అయితే దానికి పరిష్కారం చూపగలం. అదే నా లక్ష్యం. అందులో భాగంగానే ఐఏఎస్ అధికారిగా ఎంపికయ్యా. ఇప్పుడు నా పరిధిలో ప్రజా సమస్యలకు పరిష్కారం చూపుగల్గుతున్నా. నాకున్న అధికారాలతో ఏళ్లు గడుస్తున్నా పట్టాలు దక్కని వారికి భూమి పట్టాలు ఇప్పించా. ఐలాపూర్, బుట్టాయిగూడెం లాంటి గ్రామాల్లో సుమారు ఐదారు వందల ఎకరాలకు సంబంధించి భూమి పట్టాలు అందజేశాం. ములుగు సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ఈ-కార్యాలయంగా తీర్చిదిద్దా. కార్యాలయాన్ని ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకొచ్చా.

మార్పులు రావాలి: ప్రస్తుత వ్యవస్థలో ఇంకా కొన్ని మార్పులు రావాలి. నా దృష్టిలో విద్యాపరంగా మార్పులు అవసరం. ప్రభుత్వ పాఠశాలలు ఇంకా బలపడాలి. 5 నుంచి 7 తరగతులు చదివేవారు సైతం రాయలేక, చదవలేక పోతున్నారు. విద్యా వ్యవస్థలో లోపాలు ఎక్కడ ఉన్నాయో కనుగొని వాటిని సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలి. ప్రతి విద్యార్థికి నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా చూడాలి. విద్యావ్యవస్థలో మంచి మార్పులు వస్తే.. ఆ ఫలితాలు అన్ని రంగాల్లో కనిపిస్తాయి. వ్యవస్థను చక్కదిద్దాలంటే ఐఏఎస్‌గానే అది సాధ్యం.

యువత స్పందించాలి

సామాజిక సమస్యల పట్ల యువత పాత్ర చాలా కీలకం. అమెరికాలో ఏం జరుగుతుందనేది సెల్‌ఫోన్ ద్వారా తెలుసుకుంటున్నారు. కాని వారి స్వగ్రామంపై దృష్టి సారించడం లేదు. సొంత గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి యువత కృషి చేయాలి. సామాజిక సమస్యలపై పోరాడాలి.



ప్లాస్టిక్ సీసాలతో మొక్కలకు నీరందిస్తున్న దృశ్యం

నీటి పొదుపు.. మొక్కల సంరక్షణ

దేవరుప్పుల, న్యూస్‌టుడే

ఇటీవల హరితహారంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉత్సాహంగా మొక్కలు నాటారు. విద్యార్థులు వాటికి రోజూ నీళ్లు పోస్తూ సంరక్షిస్తున్నారు. ఇంతవరకూ బాగానే ఉంది. కానీ పాఠశాలలకు మూడు, నాలుగు రోజుల పాటు వరుసగా సెలవులు వచ్చిన సందర్భాల్లో ఆ మొక్కలకు నీళ్లు పోసే వాళ్లు లేక ఎండిపోతున్నాయి. దీనికి చక్కని పరిష్కారాన్ని ఆలోచించారు దేవరుప్పుల మండలం నీర్మాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు. ఈ పాఠశాలలో ఇటీవల 34 మొక్కలు నాటారు. సెలవు దినాల్లో వాటికి నీరందించేందుకు కొత్త విధానాన్ని అనుసరిస్తున్నారు. ఈ విధానంలో నీటి పొదుపుతో పాటు మొక్కలకు కావాల్సినంత మేరకే నీరందుతోంది.

ఈ నెల 12న రెండో శనివారం, 13న ఆదివారం, 14న శ్రీకృష్ణాష్టమి, 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాలలకు వరుసగా సెలవులు వచ్చాయి. నాలుగు రోజుల పాటు నీళ్లు పోయకపోతే మొక్కలు ఎండిపోయే అవకాశం ఉంది. దీనిపై విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆలోచించి ఒక పరిష్కారాన్ని కనుగొన్నారు. రెండు లీటర్ల శీతల పానీయాల ఖాళీ బాటిళ్లలో నీళ్లు నింపి ప్రతి మొక్క వద్ద తలకిందులుగా కట్టారు. ఆ బాటిళ్ల నుంచి బొట్టు బొట్టుగా నీళ్లు కారేలా మూతలకు చిన్న రంధ్రాలు చేశారు. ఈ నీటి బొట్లు నేరుగా మొక్క మొదలు వద్ద పడడంతో నీరు వృథా అయ్యే అవకాశం ఉండదు. ఈ పాఠశాలలో నిరుడు 234 మొక్కలు నాటారు. 117 మంది విద్యార్థులు, ఎనిమిది మంది ఉపాధ్యాయులున్నారు. ప్రధానోపాధ్యాయుడు గంగరాజు శ్రీనివాసరావు చొరవతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తలా ఒక మొక్కను దత్తత తీసుకొని సంరక్షిస్తున్నారు. ఇలా బాటిళ్లతో నీరందించే విధానంలో రెండు రోజుల పాటు మొక్కలకు నీరందుతుంది. ప్రతి రోజూ పిల్లలు ఇంటికి వెళ్లే ముందు బాటిళ్లలో నీరు నింపి వెళ్తారు. బాటిళ్లు ఖాళీ కాగానే మళ్లీ నీటితో నింపుతారు. ఈ ప్రయోగం సత్ఫలితాలిస్తోంది. అంతేకాక విద్యార్థులు ప్రతి రోజూ భోజనం చేసే ముందు కాళ్లు, చేతులను, భోజనం చేసిన తర్వాత పళ్లేలను మొక్కల వద్దే కడుక్కుంటున్నారు. దీంతో మొక్కలకు పుష్కలంగా నీరందుతోంది. ఈ విధానంలో జలాన్ని పొదుపు చేయడమే కాక మొక్కలను సంరక్షించే అవకాశం ఉంది. దీంతో విద్యార్థులకు నీటి విలువ తెలుస్తుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

కళ.. దినదినాభివృద్ధిలో భళా!

- నూతన ఒరవడితో రాణిస్తున్న పల్లె కళలు
- జాతీయ స్థాయిలోనూ ఆకట్టుకుంటున్న వైనం

పల్లెలు కళలకు కాణాచులు. ఎదగాలన్నా.. ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండాలని నేర్వాలన్నా.. ఎదిగిన వారిని ఒడిన చేర్చుకోవాలన్నా.. పల్లెలు అమ్మ ఒడులు. మార్పులకు.. ఒరవడులకు నూతనాధ్యయన కేంద్రాలు. నాటి కళలకు ఆధునిక వన్నెలద్ది మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా తీర్చిదిద్ది నేటి తరాన్ని కట్టి కూర్చుండబెట్టడంలో ఆ పల్లె కళలు సఫలీకృతమవుతున్నాయి. ప్రాచీన కళల్లో నూతన ఒరవడులను చొప్పించి వీక్షకులను మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. సంప్రదాయ పల్లె కళల్లో వస్తున్న మార్పులపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం... –న్యూస్‌టుడే, లింగాలఘనపురం



తలపై బోనాలతో కోలాటం కళాకారుల ప్రదర్శన

ఒగ్గు డోలు అందరికీ తెలిసిందే. పురాతన కాలం నుంచి మల్లన్న, బీరప్ప పండుగలతో పాటు బోనాలు, గ్రామ దేవతల ఉత్సవాల్లో మోగుతూనే ఉంది. డోలుపై దెబ్బ పడితే శుభకార్యానికి సూచిక. నాడు ఒక్కటో రెండో దెబ్బల సవ్వడి, అడుగులతో నడిచిన కళకు ప్రముఖ ఒగ్గుకథా కళాకారుడు డాక్టర్ చుక్క సత్తయ్య నూతన ఒరవడి నేర్పాడు. దానికి చౌదరపల్లి రవికుమార్ వంత పలికారు. చిరుతపులి చారల వంటి వస్త్రాలు, శివుడి ఆకారంలో కూడిన వేషధారణ తప్పనిసరి చేశారు. కృష్ణావతారం, శివముద్ర, నరసింహావతారం, విష్ణురూపం, శ్రీశైల పర్వతం, యాదాద్రి, సూర్మాన్‌గుండు, తొట్టి, రాట్నం, దొమ్మరగడ్డ, చిక్కుదొమ్మర గడ్డ, దశవతారాలు, పోతరాజులు, శివ శక్తుల విన్యాసం వంటి 29 అడుగులు.. సవ్వడులు.. విన్యాసాల బాణీలద్ది సృజనాత్మకత కళారూపాలతో డోళ్ల విన్యాసానికి కొత్త రూపాన్ని సంతరించిపెట్టారు. ఒళ్లు గగుర్పాటు.. రోమాలు నిక్కపొడిచేలా సవ్వడులతో ఆధునిక తరాన్ని.. అంతర్జాల యువతరాన్ని సైతం అంతర్లీనం చేసే స్థాయికి చేర్చారు. ఇప్పుడా కళ పల్లెటూరి నుంచి దిల్లీలోని ఎర్రకోట వరకు ఎగబాకింది. స్వాతంత్ర్య దిన వేడుకల్లో అంతర్జాతీయ కళల్లో ఒకటిగా ప్రసిద్ధికెక్కింది. ఇప్పుడు.. పల్లెల్లో ప్రముఖుల సందర్శన, ప్రభుత్వ కార్యాక్రమాల్లో ఉత్సవాలు, దుర్గామాత, మల్లన్న, బీరప్ప పండుగలూ.. ఇలా ఏ శుభకార్యం జరిగినా డోళ్ల విన్యాసం ఉండాల్సిందే.



డోళ్ల విన్యాసంలో శిఖరం ప్రదర్శన చేస్తున్న ఒగ్గు కళాకారులు

మహిళల కోలాటం

కోలాటం పురుషులే ఆడతారనేది ఒకప్పటి విషయం. భక్తి ఉత్సవాలకో.. భజనలకో.. కొన్ని ప్రాంతాలకే పరిమితమైన ఈ కళకు ప్రస్తుతం అన్ని గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు దాసోహం అయ్యారు. గాజుల గలగలలతో పాటు అతివల చేతుల్లో కోలలు గణగణమంటున్నాయి. పాటకు పాదం కదుపుతూ.. పదం పలుకుతూ కదం తొక్కుతూ చూపరులను కట్టిపడేసే స్థాయిలో ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. ఆధునిక యుగంలో ఆధునాతన ఒరవడితో కోలాటం దినదిన ప్రవర్ధమానం చెందుతోంది. పురాణాలు.. జానపదాలు.. భక్తి గీతాలు.. చరిత్ర, సామాజిక చైతన్య గీతాలను పుక్కిట పట్టిన మహిళలు కోలాటం దరువులకు అనుగుణంగా ఆడి పాడుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పాటలుగా కూర్చి ప్రదర్శనల్లో ఆలపిస్తూ హుషారెత్తిస్తున్నారు. నెల్లుట్లలో బండి రాములమ్మ నేతృత్వంలో ఏడేళ్ల క్రితం సమ్మక్క, సారక్క మహిళా బోనాల కోలాటం పేరుతో ప్రారంభమైన బృందం ప్రదర్శనలు ఊరూరా పాకాయి. ప్రతి గ్రామంలో రెండు మూడు బృందాలు సిద్ధమయ్యాయి. జడకొప్పు, తిరుగుడు కోలాటం, దాండియా, వెనక్కు ముందుకు కదులుతూ రెండు మూడు సార్లు తాకించే అడుగులతో పాటు తలపై బోనం ఎత్తుకుని కోలాటం ఆడుతూ ప్రశంసలు అందుకుంటున్నారు. కార్యమేదైనా కోలాటం భాగమయ్యే స్థాయికి కళను చేర్చారు.

డప్పుల దరువు

'ఒక్కొక్క డప్పంట ఒక్క శివ సత్తంటా.. కాలు కదిలియ్యమ్మో.. మావురాల ఎల్లమ్మా..' అంటూ డప్పుపై దెబ్బేస్తే కాలు కదలాడాల్సిందే. అలాంటి డప్పుల దరువునే వినసొంపైన బాణీలుగా మలిస్తే.. ఇక చిందేయాల్సిందే. డప్పు దెబ్బలోనూ విన్యాసాలను కూర్చి నేటి యువతరాన్ని ఆకట్టుకునేలా ఓ నూతన ఒరవడికి తెరలేపారు. డప్పుల విన్యాసాలతో శుభకార్యాల్లో హుషారెత్తిస్తుండగా, అంతిమ యాత్రలోనూ తోడవుతూ కడవరకూ సాగనంపుతున్నాయి. డప్పు నరేశ్, రవి తదితరులు పాత దరువులకు కొత్త హంగులు అద్ది శిఖరం, పెద్దపులి అడుగులు, వెనక్కు ముందుకు, ఒంటి కాలు విన్యాసాలతో.. పెండ్లి డప్పు, చావు డప్పు, తీన్‌మార్, దోమార్, యాదవ్, చాట ఆల్వ దరువు, అసైదులా వంటి విన్యాసాలతో చూపరుల మనసు దోచేస్తున్నారు. పండగలు, పబ్బాలు, రాజకీయ నాయకుల సందర్శనలు.. ఇలా కార్యం ఏదైనా డప్పు సైతం తప్పనిసరిగా మారింది.



పద్మవ్యూహంలో.. బడి పిల్లలు

- అస్తవ్యస్త ట్రాఫిక్‌తో తప్పని అవస్థలు
- సమన్వయంతో సాగితేనే భద్రత

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన రోజది. మదినిండా సంతోషం నింపుకుని జెండాకు వందనం చేసిన చిన్నారి..ఆ మధుర ఘడియల్ని తనివితీరా ఆస్వాదించక ముందే ప్రాణాలు పోగొట్టుకున్నాడు. వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట మండలం మడికొండ జిల్లా పరిషత్తు పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న పల్లపు జితేందర్ అలియాస్ సన్ని అనే పదకొండేళ్ల బాలుడి విషాదాంతం ఇది. మొన్నటికి మొన్న జెండా వందనం రోజున బడికెళ్లి స్నేహితుడితో కలిసి ఇంటికి బయల్దేరిన సమయంలో పాఠశాల ప్రధాన గేటు దాటి రహదారి మీదకు రాగానే ఓ లారీ మృత్యువు రూపంలో వచ్చి కబలించింది... వినడానికి ఇదేదో చిన్న ప్రమాదంలా అనిపించొచ్చు. కానీ తరచి చూస్తే ఈ ఘటన బడి పిల్లల భద్రతలోని లోపాలను ఎత్తి చూపుతుంది.

న్యూస్‌టుడే, డోర్నకల్

తప్పని తిప్పలు

బడుల్లో పిల్లలను చేర్చేటప్పుడు తల్లిదండ్రులు చదువు గురించే ఆలోచిస్తున్నారు. అన్ని హంగులతో నడుస్తున్న బడి ప్రాంగణాల్లో విశాలమైన 'పార్కింగ్' స్థలాలున్నా వాటి చుట్టుపక్కల వీధులు, గల్లీలు చాలా ఇరకుగా ఉంటుండటం, బడి వేళల్లో రద్దీ మాటలకందనంత తీవ్ర స్థాయిలో చిన్నారుల ప్రాణాల మీదకొస్తోంది. పాఠశాల పరిసరాలొక్కటే కాదు ఉదయం బడికెళ్లే వేళ, మళ్లీ సాయంత్రం ఇంటికొచ్చే సమయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని ముఖ్య కూడళ్లు పద్మవ్యూహాన్ని తలపిస్తున్నాయి. ఓ వైపు ప్రైవేటు బస్సులు, ప్రైవేటు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, పాదచారులు, మరో పక్క పాఠశాల బస్సులు... ఇవన్నీ ఒకే సమయంలో రహదారులపై పరుగులు తీస్తుండటంతో బడి పిల్లలకు అవస్థలు తప్పడం లేదు. వివిధ కళాశాలలకెళ్లే విద్యార్థుల ద్విచక్ర వాహనాల వేగానికి కళ్లెం వేసే పరిస్థితి లేకపోవడం చూస్తే ఒళ్లు జలదరిస్తోంది. మహబూబాబాద్, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ప్రాణాంతకంగా తయారైన ప్రదేశాల్లో పిల్లలకు భద్రత కల్పించాల్సిన అవసరాన్ని ప్రభుత్వ యంత్రాంగం గుర్తించాలి. ఇదే సందర్భంలో బస్సులు నడుపుతున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై గురుతర బాధ్యత ఉంది. తల్లిదండ్రులూ అప్రమత్తంగా ఉండాలి.

అప్రమత్తత అవసరం

ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో అన్ని రకాల పాఠశాలల సంఖ్య 4,361. వీటిల్లో ప్రైవేటు విద్యా సంస్థలు 2,320 దాకా ఉన్నాయి. విద్యార్థుల సంఖ్య 5.86 లక్షల పైచిలుకే. బడికెళ్లే హడావుడి, ఇంటికొచ్చే తొందరలో ఎంతటి వారికైనా ఏమరపాటు తప్పదు. కొన్ని సందర్భాల్లో విషాద ఘటనలు చోటు చేసుకునే ఆస్కారముంది. నాలుగేళ్ల నుంచి 14 ఏళ్లలోపు పిల్లలకు ప్రమాదం పొంచి ఉండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాల నివారణకు అటు యాజమాన్యాలు, ఇటు ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నా ఫలితాలు అంతగా కనిపించడం లేదు. పుస్తకాలతో కసరత్తు, ఆపై ఇంటికి వెళ్లాలనే తొందర.. పిల్లల పాలిట శాపంగా మారుతోంది. అనుక్షణం అప్రమత్తత అవసరమనే విషయాన్ని మడికొండ దుర్ఘటన చెప్పకనే చెబుతుంది. ఐదు జిల్లాల్లోనూ ప్రధాన రహదారులకు ఆనుకుని అనేక పాఠశాలలు ఉన్నాయి. అవి ప్రైవేటు పాఠశాలలే కానక్కరేదు. సర్కారు బడులు సైతం అనేకం అలాగే ఉన్నాయి. ప్రభుత్వం ఇలాంటి వాటి వివరాలు సేకరించి ప్రహరీలు నిర్మించాలనే ఆలోచన చేస్తోంది.

ఇలా చేద్దాం..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని డిపోల పరిధిలో ఉన్న బస్సులు 960. బడి బస్సులు 1,871. అన్ని రకాల ప్రైవేటు వాహనాలు 3.65 లక్షలకు పైగా ఉంటాయి. ఇవి కాక ఇతర జిల్లాల నుంచి రాకపోకలు కొనసాగించేవి మరో 85 వేలు ఉంటాయని అంచనా. వీటిల్లో అన్ని కాకున్నా 60 శాతానికి పైగా వాహనాలు అతి వేగంతో దూసుకెళ్లేవే. వేగ నియంత్రణ మన చేతుల్లో లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరి జాగ్రత్తల్లో వాళ్లుండటం తప్పనిసరి. ప్రధానంగా పాఠశాల యాజమాన్యాలు, ట్రాఫిక్ పోలీసులు, తల్లిదండ్రుల స్వీయ పరిరక్షణ అనేది కీలకమైన అంశాలు. దైనందిన వ్యవహారాల్లో నిమగ్నం కావడం వల్ల వీటిని ఎవరికి వారు పెడచెవిన పెడుతున్నారు. ప్రమాదాలకు ఇది కారణ 'భూతం' అవుతోంది. పాఠశాలలున్న ప్రదేశాల్లోనూ వేగం నియంత్రణలో ఉండటం లేదు. 20 కిలోమీటర్ల వేగం మించొద్దనే నిబంధన ఉన్నా అమలు కావడం లేదు. దీని పర్యవసానంగానే మడికొండ దుర్ఘటన. ఇప్పటికైనా మనం మేల్కోవాలి. స్వీయ భద్రతకు పెద్ద పీట వేసేందుకు కృషి చేయాలి. రహదారి సమీపంలో ఉన్న బడుల యాజమాన్యాలు ఏకరూప దుస్తుల్లో కొందరిని బందోబస్తుకు నియమించుకోవాలి. వారిని చూసైనా వాహన చోదకులు కాస్త నెమ్మదిగా వెళ్లే ఆస్కారం ఉంది.



తొలి ప్రాధాన్యం చిన్నారుల సంరక్షణే

–తక్కెళ్లపల్లి బుచ్చిబాబు, వడుప్సా జిల్లా అధ్యక్షుడు, వరంగల్ అర్బన్ జిల్లా

ప్రస్తుతం అన్ని పాఠశాలలు 'కండిషన్'లో ఉన్న వాహనాలనే నడుపుతున్నాయి. గతంలో మాదిరిగా పాత బస్సులను తీసుకొచ్చి వాటికి రంగులేసి నడిపే పరిస్థితి ఇప్పుడు లేదు. ఏదైనా దుర్ఘటన జరిగితే అందుకు పాఠశాల యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. కాబట్టి అంతా అప్రమత్తంగా ఉంటున్నారు. శిక్షణ పొందిన డ్రైవర్‌నే నియమిస్తున్నాం. అదనంగా సహాయకుడిని ఏర్పాటు చేస్తున్నాం. ఎక్కేటప్పుడు, దించేటప్పుడు సహాయకులు అన్ని చర్యలు తీసుకుంటారు. విద్యార్థి బస్సు దిగి దూరంగా వెళ్లాకే, వాహనాన్ని కదిలించాలనే సూచన చేశాం. ఇలా... యాజమాన్యం తరపున అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ఒక ఉపాధ్యాయుడు పొరపాటుగా కొడితే ఒక పిల్లాడికే దెబ్బ తాకుతుంది. అదే ఒక డ్రైవర్ పొరపాటు చేస్తే బస్సులోని 30-40 మంది పిల్లలపై ఆ ప్రభావం ఉంటుంది. కాబట్టి జాగ్రత్తగా నడుచుకోవాలని డ్రైవర్లకు తరచూ సూచిస్తున్నాం. బస్సు ఎక్కే ముందు శ్వాస నిర్ధారణ పరీక్ష చేస్తున్నాం. మా వైపు నుంచి తీసుకుంటున్న చర్యలకు అదనంగా తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలి. తమ పిల్లలను తీసుకెళ్తున్న బస్సులపై నిఘా ఉంచాలి. ఏమైనా లోటుపాట్లు ఉంటే యాజమాన్యాల దృష్టికి తీసుకురావాలి. బస్టాపు దగ్గర తల్లిదండ్రులు లేదా సంరక్షణలు ఉంటే బాగుంటుంది.

న్యూడెమోక్రసీ అజ్ఞాత దళాలపై పోలీసుల నజర్...!

- ☛ వరుస సంఘటనలతో బెంబేలెత్తుతున్న పార్టీ వర్గాలు
- ☛ దళాల కదలికలు, కార్యకలాపాలపై నిఘా పెంచిన పోలీసులు



కొత్తగూడ, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లాలో అడవుల్లో న్యూడెమోక్రసీ అజ్ఞాత దళాల కదలికలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. న్యూడెమోక్రసీ పార్టీలోని పెద్దచంద్రన్న, రాయల వర్గాలకు చెందిన అజ్ఞాత దళాలపై నిఘా పెంచారు. మొన్నటి దాకా వీటిపై పోలీసులు పెద్దగా దృష్టి సారించలేదు. జిల్లా ఎస్పీగా నంద్యాల కోటిరెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నక్సల్స్ కార్యకలాపాలపై సమగ్ర సమాచారం సేకరించారు. ఏజెన్సీ మండలాల్లోని పోలీసుస్టేషన్లను తరచూ సందర్శిస్తూ స్థానిక పోలీసులను నిరంతరం అప్రమత్తం చేస్తున్నారు. న్యూడెమోక్రసీ అజ్ఞాత దళాలపై దృష్టి కేంద్రీకరించే విధంగా చర్యలు చేపట్టారు. ఇలాంటి చర్యలతోనే ఇటీవల న్యూడెమోక్రసీ దళాలపై పోలీసుల దాడులకు పూనుకున్నారు.

వరుస సంఘటనలతో పార్టీ వర్గాల్లో ఆందోళన

నెల రోజుల క్రితం గంగారం మండలం జంగాలపల్లిలో ఒక ఇంట్లో పంచాయతీ నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ పెద్ద చంద్రన్న వర్గానికి చెందిన శ్యామ్ దళాన్ని పట్టుకొనేందుకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. రాత్రి సమయం కావడంతో పోలీసుల రాకను తెలుసుకున్న శ్యామ్ దళం సామగ్రిని వదిలేసి అక్కడి నుంచి పారిపోవడంతో త్రుటిలో కాల్పులు తప్పాయి. దళ సభ్యులకు ఎలాంటి ప్రాణనష్టం లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం గార్ల మండలంలో రాయల వర్గానికి చెందిన అజ్ఞాత దళనేత మధును పోలీసులు అరెస్టు చేశారు. ఈయన అరెస్టుతో రాయల వర్గానికి తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో పాటు న్యూడెమోక్రసీ నక్సల్స్‌పై నిఘా పెంచి క్రమంగా వీరి నియంత్రణకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం పెద్దచంద్రన్న వర్గానికి చెందిన కీలకమైన అజ్ఞాత దళనేత సూర్యం దళంపై పోలీసుల నిఘా పెట్టారు. ఆయన అటవీ ప్రాంతంలో సేదతీరుతున్న ప్రాంతాన్ని ముట్టడించేందుకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునేలోగా అప్రమత్తమైన సూర్యం దళం అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి వెళ్లడంతో పెద్ద ముప్పు నుంచి బయటపడింది.

రామన్నగూడెం అడవిలో అసలేం జరిగింది..?

కొత్తగూడ మండలం రామన్నగూడెం అటవీ ప్రాంతంలో న్యూడెమోక్రసీ పెద్దచంద్రన్న వర్గానికి చెందిన సూర్యం దళం ఉమ్మడి వరంగల్ జిల్లాలో కీలకంగా వ్యవహరిస్తోంది. కొత్తగూడ, గంగారం, గూడూరు మండలాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తూ పలు పంచాయతీలు నిర్వహిస్తోంది. ఎన్డీ దళాల నియంత్రణలో భాగంగా ఈ దళంపై కూడా పోలీసులు నిఘా పెంచారు. ఇందులో భాగంగా రామన్నగూడెం అటవీ ప్రాంతంలో సూర్యం దళం పంచాయతీ నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారాన్ని అందుకున్న పోలీసులు ముట్టడించేందుకు సిద్ధమయ్యారు. ప్రణాళిక ప్రకారం అటవీ ప్రాంతం నుంచి కాకుండా దొరవారివేంపల్లి మీదుగా సూర్యం దళం మకాం వేసిన ప్రాంతానికి పోలీసులు ఇరువైపులా వస్తుండగా అడవిలో కలిసిన పశువుల కాపరులు, ఇతరులకు సంబంధించిన సెల్‌ఫోన్లు లాక్కున్నట్లు సమాచారం. దళానికి ఎలాంటి సమాచారం ఇవ్వద్దని హెచ్చరికలు చేసినట్లు తెలిసింది. అటవీ ప్రాంతంలోకి పోలీసులు వచ్చినట్లు సూర్యం దళానికి సమాచారం అందడంతో రెప్పపాటులో అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి పారిపోయారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దళం సేదతీరిన ఆనవాళ్లు మాత్రమే గుర్తించినట్లు సమాచారం. దళాన్ని పట్టుకొనేందుకు పోలీసులు ప్రయత్నించినప్పటికీ దళం ఆచూకీ దొరక్కపోవడంతో వెనుదిరిగారు. దళాన్ని పట్టుకొనేందుకు కాదని గుడుంబా తయారీపై దాడులు నిర్వహించేందుకంటూ పోలీసులు సంఘటన విషయాన్ని దారి మళ్లించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. దళం అప్రమత్తమైతే కార్యకలాపాల ఆచూకీ తెలియడం కష్టమవుతుందనే కోణంలో పోలీసులు ఇలాంటి చర్యకు పూనుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. వరుసగా జరుగుతున్న సంఘటనలు పరిశీలిస్తే న్యూడెమోక్రసీ దళాలను కట్టడి చేసేందుకు పోలీసులు నిఘా పెంచి వారి కార్యకలాపాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. న్యూడెమోక్రసీ దళాల నియంత్రణ తప్పదని ఇప్పటికే ఎస్పీ కోటిరెడ్డి ప్రకటించారు. నెలరోజుల వ్యవధిలోనే న్యూడెమోక్రసీకి చెందిన దళాలపై మూడు వరుస సంఘటనలు జరగడంతో ఆ పార్టీ వర్గాల్లో ఆందోళన నెలకొంది.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: కురవి మండలంలోని గిరిజన తండాలో కొనుగోలు చేసి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేసి వారి నుంచి రూ.50 వేల విలువ చేసే 10 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ రాజమహేంద్రనాయక్ అన్నారు. పట్టణ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ కేసు వివరాలు వెల్లడించారు... మహబూబాబాద్ పట్టణ శివారులో పశువుల అక్రమ రవాణా అరికట్టేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఆదివారం ఉదయం ఎస్సై కమలాకర్ వాహనాలు తనిఖీ చేస్తున్నారు. కురవి నుంచి మహబూబాబాద్ వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న మహారాష్ట్రకు చెందిన విష్ణు, సరళ, కురవి మండలానికి చెందిన జాటోతు రాందాస్‌ను విచారించారు. మోదుగులగూడెం శివారు జూర్ తండాకు చెందిన దారావతు వీరన్న వద్ద నుంచి రాందాస్ కిలో గంజాయిని కొనుగోలు చేసినట్లు చెప్పాడు. అతను మహారాష్ట్రకు చెందిన విష్ణు, సరళకు రూ.1300 కు విక్రయించినట్లు విచారణలో వెల్లడైంది. ముగ్గురు రూ.50 వేల విలువైన పది కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తుండటంతో ఎస్సై కమలాకర్ వారిని మహబూబాబాద్ తహసీల్దార్ ఎదుట విచారించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. పట్టణ సీఐ జబ్బార్ కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేశామన్నారు. కేసును పూర్తి స్థాయిలో విచారిస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. సీఐ జబ్బార్, ఎస్సైలు తిరుపతి, కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



అరెస్టు చేసిన నిందితులను చూపిస్తున్న డీఎస్పీ రాజమహేంద్రనాయక్

క్రైమ్ కార్నర్

విషజ్వరంతో బాలిక మృతి

నైన్‌పాక (చిట్యాల), న్యూస్‌టుడే: మండలంలోని నైన్‌పాక శివారు వరికోల్‌పల్లికి చెందిన ఆకునూరి రాజేష్, రవళిల కూతురు మన్విత (3) విషజ్వరం బారిన పడి ఆదివారం సాయంత్రం మృతి చెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం మన్విత కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఇటీవల ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయినా జ్వరం తగ్గలేదు. ఇంటి వద్దనే చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందింది.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

కీర్తినగర్‌కాలనీ(గీసుకొండ), న్యూస్‌టుడే: మూడో డివిజన్ పరిధిలోని కీర్తినగర్‌కాలనీలో ఆదివారం సయ్యద్ ఖాజా(38) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానిక ఎస్సై రామకృష్ణగౌడ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. రెండో డివిజన్‌లోని మొగిలిచెర్లకి చెందిన ఖాజా ఎనుమాములలోని ఓ మద్యం దకాణంలో పని చేస్తున్నాడు. ఖాజాకు అప్పులు ఎక్కువ కావడంతో తాగుడుకు బానిసయ్యాడు. ఆదివారం అమ్మమ్మ ఇంటికి వచ్చి ఎవరూలేని సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య సలీమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

పరకాల రూరల్, న్యూస్‌టుడే: రహస్యంగా పేకాట ఆడుతున్న స్థావరంపై శనివారం అర్ధరాత్రి దాడులు నిర్వహించి ఐదుగురురిని అరెస్టు చేసి వారి నుంచి నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... నర్సక్కపల్లి శివారు కార్తీకేయ రైస్ మిల్లు సమీపంలో కొంత మంది పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై నేతృత్వంలో పరకాల పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో పేకాట ఆడుతున్న ఐదుగురు కొమ్ముల రమేష్, రవికిరణ్, తిరుపతి, బాషిక తిరుపతి, బొచ్చు చిన్ని కృష్ణను అరెస్టు చేసి వారి నుంచి రూ.8,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న పేకాట రాయుళ్లను పరకాల జూనియర్ సివిల్ జడ్జి ముందు బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

పరకాల, న్యూస్‌టుడే: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో పేకాట ఆడుతున్న 8 మందిని ఆదివారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. దండ్రె స్వామి, కుమారస్వామి, శివకృష్ణ, విజయ్‌కుమార్, రవి, అఫ్జల్, రోకళ్ల రమేశ్, పుట్ట విజేందర్ పేకాట పట్టుబడ్డారన్నారు. వారి నుంచి రూ. 6,350 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి, న్యూస్‌టుడే: వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. సీఐ పుల్యాల కిషన్ కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన ఓ ఇంటిలో గోనెల రాజు, శీలం దేవేందర్, పెద్దమ్మ ప్రవీణ్, రాజు, వెంగల నాగరాజు, శీలం అశోక్, వెంగల శ్రీనివాస్, గోనెల సురేశ్ ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతున్నారు. పోలీసులు దాడి చేసి వారి వద్ద నుంచి రూ.14,790 నగదు, 6 చరవాణులు స్వాధీనం చేసుకోవడంతో పాటు వారిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య



నాగరాజు (పాతచిత్రం)

పెంబర్తి(జనగామ రూరల్), న్యూస్‌టుడే: ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జనగామ జిల్లా పెంబర్తిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బైరి ప్రభాకర్, లలిత దంపతులకు కుమారుడు నాగరాజు, కుమార్తె రవళి ఉన్నారు. బైరి నాగరాజు(25) బీటెక్ పూర్తి చేసి గత కొంతకాలంగా హైదరాబాద్‌లో ప్రైవేటుగా ఉద్యోగం చేస్తున్నాడు. కాగా కొద్ది రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు ప్రభాకర్, లలిత ఊరికి వెళ్లారు. చెల్లెలు రవళి బయటకు వెళ్లింది. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనగామ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

గుర్తు తెలియని మృతదేహం వివరాలు లభ్యం

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: స్టేషన్‌ఘన్‌పూర్‌లోని విద్యుత్తు ఉపకేంద్రం వద్ద శనివారం పోలీసులు గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించిన విషయం విదితమే. మృతదేహం వివరాలను గుర్తించినట్లు సీఐ రావులనరేందర్ ఆదివారం తెలిపారు. మృతుని దుస్తుల్లో విజిటింగ్ కార్డు, రూ.1,600 నగదు, చరవాణి లభించాయన్నారు. చరవాణిలో ఉన్న ఫోన్ నెంబర్లు ఆధారంగా మృతుడి వివరాలను తెలుసుకున్నారు. ఈయన పేరు శ్రీకాంత్ (18). రఘునాథపల్లి మండలం మేకలగట్టు శివారు గిద్దబండతండాకు చెందిన మంగమ్మ చిన్న కుమారుడు. తొర్రూరులోని దుకాణంలో మూడు రోజుల పాటు పని చేసి మానేశాడు. అనంతరం ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. తల్లి మంగమ్మ, బంధువులు శ్రీకాంత్ కోసం బంధువుల ఇళ్లలో వెతికారు. తొర్రూరు పోలీస్‌స్టేషన్‌లో జులై 15న ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆదివారం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రావుల నరేందర్ తెలిపారు.

బావిలో పడి గొర్రెల కాపరి దుర్మరణం



పైడి మృతదేహం

నర్సంపేట(రుద్రగూడెం), న్యూస్‌టుడే: పంట చేనులో పడిన గొర్రెలు బయటకు పంపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు దారి పక్కన బావిలో పడి గొర్రెల కాపరి దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం నల్లబెల్లి మండలంలో వెలుగు చూసింది. గ్రామస్థులు, నల్లబెల్లి హెడ్ కానిస్టేబుల్ యాకయ్య తెలిపిన వివరాల మేరకు... రుద్రగూడెం గ్రామానికి చెందిన గుండెబోయిన మల్లమ్మకు ముగ్గురు కుమారులున్నారు. ఇద్దరు కుమారులకు వివాహం చేయగా చిన్న కుమారుడు పైడి(22) తల్లి మల్లమ్మతోనే ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. పైడి అదే గ్రామంలో పిండి కొమరయ్యకు చెందిన గొర్రెలు, మేకలకు పోషిస్తూ పాలేరుగా ఉన్నాడు. రోజు మాదిరిగానే పైడి యజమాని కొమరయ్యతో కలిసి అదే గ్రామ శివారులో గొర్రెలు, మేకలను మేపుతుండగా ఆ జీవాలు సమీపంలోని పంట చేలో పడగా వాటిని అక్కడి నుంచి మలిపేందుకు పరుగెత్తాడు. ఐతే దారి పక్కనున్న పాత బావిని చూడక పరుగు తీస్తుండగా కాలు జారి ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. కొమరయ్య జీవాల వద్దకు వెళ్లి వాటిని చేలో నుంచి బయటకు పంపించి వెనక్కి తిరిగి చూడగా పైడి కనిపించ లేదు. సమీపంలోని బావిలో కేకలు వినిపించడంతో గమనించిన కొమరయ్య స్థానికులను అప్రమత్తం చేశాడు. అప్పటికే బావిలో పైడి మృతిచెందాడు. సమీపంలో ఉన్న వారంతా వచ్చి బావిలోని మృతదేహాన్ని బయటకు తీశారు. సమాచారం అందుకున్న హెడ్‌కానిస్టేబుల్ యాకయ్య సంఘటన స్థలాన్ని సందర్శించి పంచనామా చేసి శవపరీక్ష కోసం మృతదేహాన్ని నర్సంపేట పోస్టుమార్టంకు తరలించారు. మృతుడి తల్లి మల్లమ్మ చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

పంటల బీమాపై ధీమా ఏది...?

● ప్రీమియం చెల్లించినా అందని పరిహారం

● నష్టపోతే దరఖాస్తు చేసుకోవాలంటున్న బీమా కంపెనీలు



ఆగస్టులో వర్షాలు లేక కేసముద్రం మండలంలో ఎండిపోయిన వరి

కేసముద్రం, న్యూస్‌టుడే

పంట నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు 2016లో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను ప్రారంభించింది. గతంలో ఉన్న బీమా పథకాల కంటే తక్కువ ప్రీమియంతో కేవలం ఖరీఫ్‌లో 2 శాతం, రబీలో 1.5 శాతం నిర్ధారించింది. తక్కువ ప్రీమియంతో పాటు ప్రతికూల వాతావరణం కారణంగా పంటలు సాగు చేయలేక పోయినా, అకాల వర్షాల కారణంగా కల్లాలపై పంటలు తడిసి నష్టపోయినా పరిహారం అందించాలి. దీంతో ప్రధానమంత్రి ఫసల్ బీమాపై రైతులు కొండంత ఆశలు పెట్టుకున్నారు. చివరకు బీమాపై రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో 2016 ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదు. దీంతో రైతులకు బీమాపై ధీమా లేకుండా పోయింది. పదేళ్లుగా బీమా ప్రీమియం చెల్లిస్తున్నా ఏ ఒక్కరికీ పరిహారం రాలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. బీమా చేయడంతో పాటు పంట నష్టపోయిన సమయంలో కంపెనీకి, వ్యవసాయ శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోకపోవడంతో రైతులకు పరిహారం అందకుండా పోతోంది. ఉదాహరణకు జిల్లాలో 2016 జులై, ఆగస్టు నెలల్లో వర్షాలు పడకపోవడంతో ఖరీఫ్‌లో నాటు వేయకుండా వరి నారులో పశువులను మేపారు. వారిలో బ్యాంకు ద్వారా ప్రీమియం చెల్లించిన రైతులు వేల సంఖ్యలో ఉన్నారు. పరిహారం మాత్రం అందలేదు. దీనిపై 'న్యూస్‌టుడే' బీమా కంపెనీ అధికారులను ప్రశ్నించగా ఆ రైతులు దరఖాస్తు చేసుకోలేదని, తమ దృష్టికి తీసుకొచ్చిన రైతుల పంటలను పరిశీలించామని త్వరలో వారికి పరిహారం అందించనున్నట్లు తెలిపారు. బీమా చేసిన రైతులు తమ పంట నష్టపోయిన సమయంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరాన్ని వివరిస్తూ 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు...

విత్తనాలు విత్తిన రోజు నుంచి పంట చేతికొచ్చే దాకా అన్నదాతకు అడుగడుగునా కష్టాలే.. విత్తనం వేయడానికి అనువైన వర్షాలు కురిసే దాకా ఎదురు చూడాలి.. విత్తిన తరువాత మొలకెత్తే దాకా మరో సమస్య.. మొలకెత్తిన అనంతరం చీడపీడల సమస్య.. చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు, వడగండ్లకు కళ్ల ముందే పంట నేలపాలవుతుంది.. తీరా చేతికొచ్చిన పంటను కల్లాల్లో ఆరబోసిన తరువాత కూడా ఎడతెరిపి లేని వర్షాలకు మొలకెత్తి పంట నష్టపోయిన సందర్భాలెన్నో ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో రైతులకు అండగా నిలిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖరీఫ్ - 2016 నుంచి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేస్తోంది. గతంలో ఉన్న నిబంధనలు తొలగించి రైతులకు ఆపదలో అండగా నిలిచే విధంగా పథకాన్ని రూపొందించారు. కరవు కారణంగా పంట సాగు చేయలేని పరిస్థితిలో రైతులకు నష్టపరిహారం అందజేయనున్నారు. పంట కోసిన తరువాత కల్లాలపై నష్టపోయినా పరిహారం అందుతుంది. కరవు, వరదలు, తుఫాన్, చీడపీడలు, తెగుళ్ల బెడద, అధిక వర్షపాతం, అల్ప వర్షపాతం, తదితర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులకు చేయూతనిచ్చి నష్టపరిహారాన్ని అందజేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతనంగా ఖరీఫ్-2016 పంట కాలం నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేస్తోంది. వరి పంటను గ్రామం యూనిట్‌గా తీసుకుంటుండగా మిగిలిన పంటలకు మండలాన్ని యూనిట్‌గా తీసుకున్నారు. ఐతే పలుచోట్ల బీమాపై సరైన అవగాహన లేకపోవడంతో రైతులకు పరిహారం అందకుండా పోతుంది.

బీమా చేసే పంటల వివరాలు..

1. వరి (గ్రామం యూనిట్)
2. మొక్కజొన్న
3. కంది
4. పెసర
5. పసుపు
6. వేరుసెనగ

ప్రీమియం చెల్లించాల్సిన గడువు

ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేస్తున్న రైతులు వరి పంటకు ఆగస్టు 31లోగా చెల్లించాల్సి ఉంటుంది

నష్టపోతే దరఖాస్తు చేసుకోవాలి

ప్రధాన మంత్రి ఫసల్ బీమాలో రైతులు చెల్లించే ప్రీమియాన్ని తక్కువ చేయడంతో పాటు పంటలు సాగు చేయలేని పరిస్థితి ఉంటే బీమాలో 25 శాతం పరిహారం అందించడంతోపాటు కల్లాలపై తడిసి నష్టం వాటిల్లినా పరిహారం అందించనున్నట్లు ప్రకటించడంతో రైతులు బీమాపై ఆశలు పెంచుకున్నారు. 2016-17 సంవత్సరం ఖరీఫ్‌లో తెలంగాణ వ్యాప్తంగా 6,70,000 రైతులు రూ.89,34,55,819 ప్రీమియం చెల్లించారు. 2016 సంవత్సరంలో వరంగల్ ఉమ్మడి జిల్లాలోని కొన్ని మండలాల్లో జూన్‌లో ముందస్తుగా వర్షాలు పడటంతో రైతులు ఉత్సాహంగా ఖరీఫ్ సాగును ప్రారంభించారు. అనంతరం జులై, ఆగస్టు నెలల్లో వర్షాలు ముఖం చాటేశాయి. అప్పటికే రైతులు వరిసాగుకు చేసేందుకు విత్తనాలు ఖరీదు చేసి నారు పోసుకున్నారు. రెండు నెలలు వర్షాలు లేకపోవడంతో నాట్లు వేయలేని పరిస్థితిలో పోసిన నారుమళ్లలో పశువులతో మేపారు. నిబంధనల ప్రకారం నాట్లు వేయకుండా నష్టపోయిన రైతులకు బీమాలో 25 శాతం పరిహారం అందించాలి. కాని జిల్లాలో ఒక్క రైతుకు కూడా బీమా పరిహారం అందలేదు. దీనికి గల కారణాలను ఆరాతీయగా నారు పోసిన తరువాత నాట్లు వేయలేని పరిస్థితిలో 25 శాతం బీమా చెల్లించాల్సిన విషయం వాస్తవమేనని కాకుంటే రైతులు దరఖాస్తు చేసుకోలేదని బీమా కంపెనీకి చెందిన అధికారులు చెబుతున్నారు. బీమా కంపెనీకి లేదా వ్యవసాయశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకుంటే ఆ రైతులకు పరిహారం లభించేది. ఈ ఏడాది జిల్లాలో సరైన వర్షాలు లేకపోవడంతో వరి సాగుపై రైతులు ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నెల చివరి దాకా ఇలాంటి పరిస్థితే ఉంటే ఇప్పటికే నారుపోసిన రైతులు నష్టపోవాల్సి వస్తుంది. బీమా ప్రీమియం చెల్లించిన రైతులు పంటలు నష్టపోయిన సమయంలో పూర్తి ఆధారాలతో అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అప్పుడే నష్టపోయిన పంటలకు పరిహారం అందుతుంది.

బీమా చేసే విధానం

● బ్యాంకుల నుంచి పంట రుణం తీసుకునే రైతుల నుంచి ప్రీమియం మినహాయించుకొని బీమా కంపెనీకి చెల్లించి పంటలకు బీమా చేయిస్తున్నారు. బ్యాంకులో రుణం తీసుకునే ప్రతి రైతుకు ఇది తప్పని సరి.

● బ్యాంకులో రుణం పొందని రైతులు సమీపంలోని బ్యాంకులో దరఖాస్తు చేసుకొని ప్రీమియం చెల్లించి పంటలకు బీమా చేయించుకోవచ్చు. చోళమండలం ఎంఎస్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ హైదరాబాద్ పేరుతో డీడీ పట్టాపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం నకలు, ఒక ఫోటో జత చేసి వ్యవసాయాధికారి కార్యాలయంలో అందజేయాలి.

రూ.102 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం..

ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకంలో ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా సాగు చేయలేని పరిస్థితితోపాటు కల్లాలపై పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి. 2016లో జులై, ఆగస్టులో వర్షాలు లేకపోవడంతో రైతులు నష్టపోగా సెప్టెంబరు నెలలో అకాల వర్షాల కారణంగా కల్లాలపై వరి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇందులో కొంత మంది రైతులు బీమా కంపెనీకి దరఖాస్తు చేసుకోగా సర్వే చేసిన బీమా కంపెనీ ప్రతినిధులు రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల మంది రైతులు పంట నష్టపోయారని తేల్చారు. వీరికి గాను రూ.180 కోట్ల పరిహారం చెల్లించనున్నట్లు ప్రకటించారు. బీమా ప్రీమియంలో రైతు 2 శాతం చెల్లించగా మిగిలిన దానిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరించాల్సి ఉంటుంది. సర్వే చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ప్రీమియం చెల్లించకపోవడంతో రైతులకు నష్టపరిహారం అందలేదు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల క్రితం రూ.102 కోట్లు విడుదల చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా పంట నష్టపోయిన 2 లక్షల మంది రైతులకు పరిహారం అందనుంది.

బీమా మొత్తం, చెల్లించాల్సిన ప్రీమియం(ఎకరాకు)

పంట	బీమా మొత్తం	చెల్లించాల్సిన ప్రీమియం
వరి	రూ.29,000	రూ. 580
మొక్కజొన్న	రూ.25,000	రూ. 500
కంది	రూ.14,000	రూ. 280
పెసర	రూ.13,000	రూ. 260
వేరుసెనగ	రూ.16,000	రూ. 320
పసుపు	రూ.50,000	రూ. 750

వర్తించే పరిస్థితులు..

1. పంట కోత ప్రయోగాల యూనిట్ దిగుబడి అంచనా ప్రకారం బీమా పరిహారం చెల్లిస్తారు.

2. ప్రకృతి విపత్తుల కారణంగా పంటలకు జరిగే నష్టం ఆధారంగా పరిహారం అందజేస్తారు.

3. పంట సాగు చేయలేని పరిస్థితిలో రైతులకు కలిగే నష్టం ఆధారంగా పరిహారం ఇస్తారు.

4. పంట కోత అనంతరం కల్లాలపై జరిగే నష్టానికి పరిహారం అందజేస్తారు

త్వరితగతిన మరమ్మతులు పూర్తిచేయాలి

మాధన్నపేట(నర్సంపేట రూరల్), న్యూస్‌టుడే: మాధన్నపేట పెద్దచెరువు పెద్ద తూము షట్టర్ మరమ్మతుల పనులు త్వరితగతిన పూర్తిచేసి ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని పౌరసరఫరాల సంస్థ రాష్ట్ర ఛైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. నర్సంపేట మండలంలోని మాధన్నపేట పెద్దచెరువు పెద్దతూము వద్ద జరుగుతున్న మరమ్మతుల పనులను సుదర్శన్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెరాస ప్రభుత్వం నర్సంపేట నియోజకవర్గ రైతులకు మేలు చేయడానికి మాధన్నపేట చెరువు పునరుద్ధరణ పనుల కోసం రూ.7.60 కోట్లు మంజూరు చేసిందన్నారు. గడువు ముగుస్తున్నా గుత్తేదారు పనులు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో పెద్దతూము మరమ్మతుల కోసం నిధులు కేటాయించిందని, గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగా నేడు ఈ దుస్థితి వచ్చిందని విమర్శించారు. ఇప్పటికే రెండేళ్లు గడిచినా చెరువు పనులు పూర్తి కాలేదన్నారు. ఎంత కష్టమైనా రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ఇక్కడే ఉండి పనులు పూర్తి చేయిస్తామని పేర్కొన్నారు. నీటిపారుదల, రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో మరమ్మతుల పనులు చేస్తామన్నారు. ఏ రైతు అధైర్యపడొద్దని, ఎవరికి నష్టం కలగకుండా పనులు చేయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటనారాయణ, శ్రీనివాస్, డీఈఈ సుదర్శన్‌రావు, సీఐ దేవేందర్‌రెడ్డి, నాయకులు కుమారస్వామి, సురేశ్, బైరి మురళీ తదితరులు పాల్గొన్నారు.



డీఈఈ, సీఐతో మాట్లాడుతున్న పెద్ది

పాకాలలో పర్యాటకుల సందడి

ఖానాపురం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన పాకాలలో ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో బ్యాంకు ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు, కుటుంబ సమేతంగా పాకాలలో సందడి చేశారు. తుంగబంధం తూముపై పాకాల సుందర దృశ్యాలను కెమెరాల్లో బంధించారు. తుంగబంధం తూములో పిల్లాపాపలతో అందరూ ఈతకొడుతూ ఉద్యానవనంలో సందడి చేశారు. బోటింగ్‌లో షికారు చేస్తూ ఉర్రూతలూగారు. కట్టపైకి అనుమతి ఇవ్వడంతో జోరుగా హుషారుగా పర్యటించారు. నర్సంపేట, హన్మకొండ, ఖానాపురం, అశోక్‌నగర్ నుంచి రైతులు సామూహిక వనభోజనాలకు తరలివచ్చారు. సరస్సు పూర్తిగా నిండాలని రైతులు మైసమ్మకు మొక్కులు చెల్లించారు.



తుంగబంధం కాలువలో పర్యాటకుల సందడి

22 అడుగులకు చేరిన పాకాల నీటిమట్టం: వరంగల్ రూరల్ జిల్లాలోని ప్రముఖ జలాశయమైన పాకాలలో వరుసగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో సరస్సులోకి 22 అడుగులకు నీటిమట్టం చేరింది. సరస్సు పూర్తి నీటి సామర్థ్యం 30 అడుగులు. మరో 8 అడుగులకు నీరు చేరితే పాకాల పరవళ్లు తొక్కనుంది. ప్రస్తుతం సరస్సు ఆయకట్టులో 28,500 ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుత నీటితో పూర్తిగా ఖరీఫ్ చేతికందుతుందని ఇక నుంచి వచ్చే నీరు రబీకి వినియోగించవచ్చని రైతులు, నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కురుస్తున్న వర్షాలతో పాకాల సరస్సు ఎప్పుడు మత్తడి పోస్తుందోనని అందరూ ఎదురు చూస్తున్నారు.

TENTH Mathematics

Polynomials

A Polynomial in variable x is an expression containing the sum of a finite number of terms of the form ax^n for any real number 'a' and any whole number 'n'.

Examples of polynomials:

i) $x^2 + 2x + 3$ ii) $\sqrt{2}x + 5$

iii) $\frac{3}{5}x^3 + \frac{2}{7}x^2 + \frac{1}{3}x + 4$

ప్రతిభ

Write a cubic polynomial...

Lets consider the expressions that are not polynomials

i) $10\sqrt{x} + 2$ ii) $5x^{1/3} + 3$

iii) $4x^{-1} + \frac{1}{x^2}$ iv) $1 + x^2 + x^3 + x^4 + ...$

v) $\sqrt{-2}x^2 + 5x$

In the first three examples the powers of 'x' are not whole numbers hence these are not polynomials. In the fourth example even though the powers of the variable 'x' are whole numbers, it is the sum of infinite terms hence it is not a polynomial. Also $\sqrt{-2}x^2 + 5x$ is not a real polynomial as the coefficient of x^2 is $\sqrt{-2}$ which is not a real number.

Therefore for an expression to be called as a polynomial check for ....

i) Number of terms (must be finite)
ii) Coefficients of various powers of x (must be real numbers)
iii) Various powers of the variable x (must be whole numbers)

★ Try to write three examples for polynomials and three expressions that are not polynomials.

Degree of a polynomial

Consider $p(x) = x^2 + 2x + 1$

The highest power of x in the polynomial p(x) is called as the degree of the polynomial. In the above example it is 2. Hence, p(x) is a polynomial of degree 2 which is called as a quadratic polynomial.

★ The polynomials of degree one are called as Linear polynomials
Ex: $2x + 5$, $\sqrt{3}y - 2$

★ The polynomials of degree two are called as quadratic polynomials.
Ex: $\frac{1}{5}x^2 - 2x + 3$, $5y^2 - \sqrt{2}y$

★ The polynomials of degree three are called as cubic polynomials
Ex: $3y^3 + 1$, $5p^3 + \frac{1}{3}p + \sqrt{2}p + 8$

In general a polynomial in variable x of degree n where 'n' is a natural number is given by $p(x) = a_0x^n + a_1x^{n-1} + a_2x^{n-2} + ... + a_{n-1}x + a_n$ where $a_0, a_1, a_2, ... a_n$ are real numbers and $a_0 \neq 0$.

In general we write ....

★ Linear polynomial as $ax + b$ where a, b are real numbers and $a \neq 0$.
★ Quadratic polynomial as $ax^2 + bx + c$ where a, b and c are real number and $a \neq 0$.
★ Cubic polynomial as $ax^3 + bx^2 + cx + d$ where a, b, c, d are real numbers and $a \neq 0$.

Observe that in the above general forms of writing Linear, Quadratic and Cubic polynomials the condition $a \neq 0$ is necessary.

Q: Why do you think in the polynomial of degree 5, $p(x) = ax^5 + bx^4 + cx^3 + dx^2 + ex + f$ the condition $a \neq 0$ is necessary?

★ If a = 0, the polynomial p (x) reduces to $p(x) = bx^4 + cx^3 + dx^2 + ex + f$ which is a polynomial of degree 4 and not degree 5.

Hence, while writing the general form of the



Writer:
V. Padma Priya
Senior Teacher

polynomial of degree 5 i.e, $p(x) = ax^5 + bx^4 + cx^3 + dx^2 + ex + f$ it is necessary to write $a \neq 0$.

★ Try to write general form of the polynomial in x of degree 4 value of the polynomial.
★ Let p(x) be a polynomial and k be any real number then the value of p(x) at x = k is given by p(k).

Q: If $p(x) = x^2 - 8x + 12$ find p(2) and $p\left(\frac{1}{2}\right)$

Sol: $p(x) = x^2 - 8x + 12$

$p(2) = 2^2 - 8 \times 2 + 12$

$= 4 - 16 + 12 = 0$

$p\left(\frac{1}{2}\right) = \left(\frac{1}{2}\right)^2 - 8\left(\frac{1}{2}\right) + 12$

$= \frac{1}{4} - 4 + 12 = \frac{33}{4}$

Zeros of a polynomial

A real number 'k' is said to be the zero of the polynomial p (x) if p (k) = 0.

In the above example p (2) = 0 hence, x = 2 is the zero of the polynomial $p(x) = x^2 - 8x + 12$.

A polynomial of degree n has atmost n zeros.

★ Linear polynomial ax+b has one zero $x = \frac{-b}{a}$
★ Quadratic polynomial has atmost 2 zeros.

Q: Write a Quadratic polynomial that has no real zeros.

Sol: Quadratic polynomials of the form $ax^2 + b$ has no real zeros.
Ex: $2x^2 + 5$ has no real zeros
As $x = \pm\sqrt{\frac{-5}{2}}$ are not real number.

Q: Write a Quadratic polynomial that has one zero.

Sol: A Quadartic polynomial that can be expressed as $(a + b)^2$ or $(a - b)^2$ has one zero.
Ex: $x^2 - 4x + 4$ It can be written as $(x - 2)^2$, has one zero, x = 2.
Ex: $x^2 + 6x + 9$
It can be written as $(x + 3)^2$, has one zero x = −3

★ Quadratic polynomial of the form ax^2 has one zero x = 0.

Q: Write a Quadratic polynomial with three terms that has no real zeros.

A: The Quadratic polynomial with three terms i.e, $ax^2 + bx + c$ has no real zeros if $4ac > b^2$
For ex: $2x^2 + 3x + 5$ has no real zeroes. Here a = 2, b = 3, c = 5; $4ac = 4 \times 2 \times 5 = 40 > 9$.

★ Try to write a polynomial of degree 8 with 5 terms.
★ Try to write a cubic polynomial with 2 terms that has one zero.
★ Try to write a quadratic polynomial with two terms that has no zero.

BANK EXAMS

Quantitative Aptitude

The area of the rectangle...

Directions (Q.1 - 5): In each of the following questions, a question is followed by information given in three statements. You have to study the question along with the statements and decide, the information given in which of the statement(s) is necessary to answer the question.

1. What is the area of a right-angled triangle?
I. The base of the triangle is X cm.
II. The height of the triangle is Y cm.
III. The hypotenuse of the triangle is 2 cm.
1) Only I & II 2) Only II
3) Only II & III 4) Any two of the three
5) None of these

2. What is the average age of the six members A, B, C, D, E & F in a family?
I. Total age of D & E is 14 years.
II. Average age of A, B, C and F is 50 years.
III. Average age of A, B, D and E is 40 years.
1) Only I & II 2) Only I & III
3) Only II & III 4) All I, II & III 5) None

3. What is the rate of interest pcpa?
I. The amount doubles itself a simple interest in 10 years.
II. The difference between the compound interest and the simple interest on an amount of Rs.15,000 in two years is Rs.150.
III. The compound interest accrued in 8 years is more than the amount (principal).
1) Only I 2) Only II 3) Only II & III
4) Only I & III 5) Only either I or II

4. What are the marks scored by Abhijit in English?
I. The marks scored by Abhijit in Maths is more than his marks in science by 20.
II. Total marks scored by Abhijit in Maths, Science and English is 198.
III. The marks scored by Abhijit in Science is more than his marks in English by 12.
1) Any two of the three 2) Only II & III
3) All I, II & III
4) The question cannot be answered even with the information in all the three statements
5) None of these

5. In how many days will B alone complete the work?
I. A and B together can complete the work in 8 days.
II. B and C together can complete the work in 10 days.
III. A and C together can complete the work in 12 days.
1) Only I & II 2) Only II & III 3) All I, II & III
4) The question cannot be answered even with the information in all the three statements.
5) None of these

6. The length of a rectangle is three-fifth of the side of a square. The radius of a circle is equal to side of the square. The circumference of the circle is 132 cm. What is the area of the rectangle if the breadth of the rectangle is 8 cm?
1) 112.4 sq. cm. 2) 104.2 sq. cm.
3) 100.8 sq. cm. 4) Cannot be determined



Writer:
- Dr. G.S. Giridhar
Director, RACE Institute

5) None of these

7. Five-ninth of a number is equal to twenty five percent of second number. Second number is equal to one-fourth of third number. The value of third number is 2960. What is 30 percent of first number?
1) 88.8 2) 99.9 3) 66.6
4) Cannot be determined 5) None of these

8. Smallest side of a right angled triangle is 8 cm less than the side of a square of perimeter 56 cm. Second largest side of the right angled triangle is 4 cm less than the length of rectangle of area 96 sq. cm. and breadth 8 cm. What is the largest side of the right angled triangle?
1) 20 cm 2) 12 cm 3) 10 cm
4) 15 cm 5) None of these

Key with Solutions

1-4; Are of right-angled triangle
$= \frac{1}{2} \times l \times b \times h$ and hypotenuse
$= \sqrt{b^2 + h^2}$
Combining any two of the three given statements we can find the area of the triangle

2-1; From I and II we can only find the average ages of the family.

3-5; Only either I or II.

4-3; Marks obtained by Abhijit in English → E
Marks obtained by Abhijit in Science → S
Marks obtained by Abhijit in Math → M
We got the following equations
M = S + 20, M + S + E = 198, S = E + 12
We need all the three statements to solve the equations.

5-3; We need all three equations to solve the equation.

6-3; $2\pi r = 132$

$\Rightarrow 2 \times \frac{22}{7} \times r = 132$

$\Rightarrow r = \frac{132 \times 7}{2 \times 22} = 21c$ m

∴ Side of square = 21 cm

∴ Length of the rectangle = $\frac{3 \times 21}{5}$ cm

∴ Area of the rectangle = $\frac{3 \times 21}{5} \times 8$

= 100.8 sq.cm.

7-2; Second number = $\frac{1}{4} \times 2960 = 740$

∴ First number $\times \frac{5}{9} = \frac{740 \times 25}{100}$

$\Rightarrow$ First number $= \frac{740}{4} \times \frac{9}{5} = 333$

∴ 30% of 333 $= \frac{333 \times 30}{100} = 99.9$

8-3; Side of a square $= \frac{\text{Perimeter}}{4} = \frac{56}{4} = 14$ cm

∴ Smallest side of the right angled triangle = 14 − 8 = 6 cm.

Length of rectangle $= \frac{\text{Area}}{\text{Breadth}} = \frac{96}{8} = 12$ cm

∴ Second side of the triangle = 12 − 4 = 8 cm

∴ Hypotenuse of the right angled triangle

$= \sqrt{6^2 + 8^2} = \sqrt{36 + 64} = \sqrt{100} = 10$ cm

కరెంట్ అఫైర్స్



ఇటీవల మహిళల వన్డే ప్రపంచకప్ టోర్నీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో భారత క్రీడాకారిణి హర్మన్ ప్రీత్‌కౌర్ 171 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది.

ప్రతిభ

'ఆనంద లహరి' కార్యక్రమ ఉద్దేశం...?

1. అయోధ్యలో వివాదాస్పద ప్రాంతంలో రామమందిరం నిర్మాణానికి తమకు అభ్యంతరం లేదని 2017 ఆగస్టు 21 న ప్రకటించిన ఉత్తర్ ప్రదేశ్ షియా సెంట్రల్ వక్ఫ్ బోర్డ్ మండలి ఛైర్మన్ ఎవరు? (దీనికి ప్రతిగా వివాదాస్పద ప్రాంతానికి దూరంగా, ముస్లింలు అత్యధికంగా ఉండే ప్రాంతంలో 'మజీద్ ఎ అమన్' పేరుతో మసీదును నిర్మించాలని కోరారు.)
   ఎ) సయ్యద్ వసీం రిజ్వీ బి) మహ్మద్ అజం ఖాన్
   సి) మోహసిన్ రజా డి) బుక్కల్ నవాబ్
2. 2017 ఆగస్టు 21 నుంచి రెండు వారాలపాటు దక్షిణ కొరియా ఏ దేశంతో కలిసి 'ఉల్చి ఫ్రీడం గార్డియన్' పేరిట వార్షిక సంయుక్త సైనిక విన్యాసాలను నిర్వహిస్తోంది?
   ఎ) చైనా బి) అమెరికా
   సి) రష్యా డి) ఉత్తర కొరియా
3. ఏ రాష్ట్రంలో సంభవించిన వరదల కారణంగా అక్కడ ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన కజిరంగా జాతీయ పార్కులో 2017 ఆగస్టులో 346 జంతువులు మృత్యువాతపడ్డాయి?
   ఎ) ఉత్తర్ ప్రదేశ్ బి) బిహార్
   సి) ఉత్తరాఖండ్ డి) అసోం
4. ఇటీవల వార్తల్లోకి వచ్చిన 'తల్ అఫర్' నగరం ఏ దేశంలో ఉంది? (ఉగ్రవాద సంస్థ 'ఇస్లామిక్ స్టేట్' నుంచి తల్ అఫర్ నగరాన్ని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ఈ దేశ సైనిక బలగాలు 2017 ఆగస్టులో దాడులు ప్రారంభించాయి.)
   ఎ) లిబియా బి) సిరియా
   సి) ఇరాక్ డి) సౌదీ అరేబియా
5. 2018 ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచకప్ పోటీలకు రష్యా చేస్తున్న ఏర్పాట్లను కళ్లకు కట్టేలా 'గో మారడోవియా' పేరుతో ఆకట్టుకునేలా డాక్యుమెంటరీని రూపొందించి, వార్తల్లో నిలిచిన విశాఖపట్నం యువకుడు?
   ఎ) వేల్పుల సాకేత్‌బాబు బి) సాగి శ్రీహరి వర్మ
   సి) అవ్వారు శ్రీనివాసరావు డి) చుక్కా రాజశేఖర్
6. ఇళ్లలో దొంగతనాలను అరికట్టడం, నేర నియంత్రణలో భాగంగా తాళం వేసి ఉన్న ఇళ్ల పర్యవేక్షణ విధానం (LHMS-లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) యాప్‌ను ఇటీవల ఏ రాష్ట్ర పోలీసులు అందుబాటులోకి తెచ్చారు?
   ఎ) ఆంధ్రప్రదేశ్ బి) తమిళనాడు
   సి) తెలంగాణ డి) కర్ణాటక
7. రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం రామ్‌నాథ్ కోవింద్ 2017 ఆగస్టు 21 న తొలిసారిగా ఏ నగరంలో పర్యటించారు?
   ఎ) లేహ్ బి) గువహటి (గౌహతి)
   సి) పోఖ్రాన్ డి) అహ్మదాబాద్
8. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో రాజ్‌భవన్‌లో ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడుకు ఏ రోజున ఘన సన్మానం జరిగింది? (ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన వెంకయ్యకు సన్మానం చేసిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది.)
   ఎ) ఆగస్టు 20 బి) ఆగస్టు 21
   సి) ఆగస్టు 22 డి) ఆగస్టు 23



రచయిత
- సీహెచ్. కృష్ణప్రసాద్
విషయ నిపుణులు

9. ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ క్రిస్టలోగ్రఫీ (ఐయూసీఆర్) - 2017 సదస్సును 2017 ఆగస్టులో ఎక్కడ నిర్వహించారు? (మూడేళ్లకోసారి జరిగే ఈ సదస్సును భారత్‌లో నిర్వహించడం ఇదే తొలిసారి. ఇది 24 వ సదస్సు.)
   ఎ) విశాఖపట్నం బి) దిల్లీ
   సి) హైదరాబాద్ డి) బెంగళూరు
10. అమెరికా సైనిక బలగాల కమాండర్ ఇన్‌చీఫ్ హోదాలో ఆర్లింగ్టన్‌లోని ఫోర్ట్ మయర్‌లో ఏ రోజున నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన దక్షిణాసియా విధానాన్ని ఆవిష్కరించారు?
   ఎ) 2017 ఆగస్టు 20 బి) 2017 ఆగస్టు 22
   సి) 2017 ఆగస్టు 24 డి) 2017 ఆగస్టు 26
11. ప్రజల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏ పేరుతో నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది? (సామాజిక రుగ్మతలైన వరకట్నం, బాల్యవివాహాలు, లింగవివక్ష, మత్తుపదార్థాలు, కులవివక్ష లాంటి వాటిని రూపుమాపేందుకు దోహదపడేలా కార్యక్రమాలు రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని 110 పురపాలక పట్టణాలు, నగరాల్లో ప్రతీ వారాంతంలో 4 గంటలపాటు నిర్వహించనున్నారు.)
   ఎ) సంతోష లహరి బి) నవ్వుల హరివిల్లు
   సి) విజ్ఞాన వినోదం డి) ఆనంద లహరి
12. రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి జయంతి వేడుకలు, రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఏ రోజున హైదరాబాద్ శివారు బుద్వేల్‌లో విద్యాసంస్థలు, రెడ్డి హాస్టల్ భవన సముదాయానికి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు?
   ఎ) 2017 ఆగస్టు 22 బి) 2017 ఆగస్టు 23
   సి) 2017 ఆగస్టు 24 డి) 2017 ఆగస్టు 25
13. ఐఐటీ, ఐఐఎస్‌సీల్లోని పరిశోధక (పీహెచ్‌డీ) విద్యార్థులకు ఇకనుంచి ప్రతినెలా ఎంత మొత్తంలో ఫెలోషిప్ అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది? (ప్రస్తుతం ఈ విద్యార్థులకు రూ. 25 వేలు మాత్రమే ఫెలోషిప్ అందుతోంది. అయిదేళ్లపాటు వీటిని అందజేస్తారు. వీటిని పొందే సమయంలో విద్యార్థులు ఇతర ఉద్యోగాలు చేసేందుకు వీలుండదు.)
   ఎ) రూ. 40 వేలు బి) రూ. 50 వేలు
   సి) రూ. 60 వేలు డి) రూ. 70 వేలు
14. 2017 ఆగస్టు 19 న ఏ రాష్ట్రంలోని ఖతౌలి వద్ద పూరీ-హరిద్వార్ కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ఘటనలో 23 మంది మరణించారు? (ఒడిశాలోని పూరీ నుంచి ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ మధ్య 2370 కి.మీ. దూరాన్ని కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ 48 గంటల్లో పూర్తి చేస్తుంది).
   ఎ) ఉత్తర్ ప్రదేశ్ బి) ఒడిశా
   సి) ఉత్తరాఖండ్ డి) పశ్చిమ్ బంగ
15. ప్రభుత్వ, ప్రయివేట్ స్థలాల్లో వేధింపులు, గృహహింస, ఈవ్‌టీజర్ల నుంచి మహిళలను రక్షించేందుకు 2017 ఆగస్టు 19 న తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన హెల్ప్‌లైన్ నంబరును గుర్తించండి. (మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ సచివాలయంలో ఈ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించారు. మహిళలు, బాలికల అక్రమ రవాణాను నిరోధించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించేలా 'స్వరక్ష' పేరిట సదస్సులు నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు.)
   ఎ) 161 బి) 171 సి) 181 డి) 191
16. ఏ దేశంలో కుష్ఠువ్యాధి నిర్మూలనకు కృషి చేసి, ఆ దేశ మదర్ థెరిసాగా పేరుపొందిన జర్మనీ వైద్యురాలు రూత్ ఫా 2017 ఆగస్టు 10 న మరణించారు?
   ఎ) పాకిస్థాన్ బి) బంగ్లాదేశ్
   సి) నేపాల్ డి) శ్రీలంక
17. ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం కోసం ఎంత అటవీ భూమి మళ్లింపునకు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ 2017 ఆగస్టు 17 న ఆమోద ముద్ర వేసింది?
   ఎ) 10,444.89 హెక్టార్లు బి) 11,444.89 హెక్టార్లు
   సి) 12,444.89 హెక్టార్లు డి) 13,444.89 హెక్టార్లు
18. 2017 ఆగస్టు 2 న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రకటించిన ద్రవ్య పరపతి విధాన సమీక్ష ప్రకారం 2017 జులై 28 నాటికి భారత విదేశీ మారక నిల్వలు ఎంత మొత్తానికి చేరాయి?
   ఎ) 192.9 బిలియన్ డాలర్లు
   బి) 292.9 బిలియన్ డాలర్లు
   సి) 392.9 బిలియన్ డాలర్లు
   డి) 492.9 బిలియన్ డాలర్లు
19. కింది అంశాల్లో సరైంది ఏది?
   1) ఆవు వల్ల సమకూరే ప్రయోజనాలపై పరిశోధన చేపట్టడానికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం 19 మంది సభ్యులతో శాస్త్ర సాంకేతిక మంత్రి హర్షవర్ధన్ నేతృత్వంలో ఒక సంఘాన్ని ఏర్పాటు చేసింది.
   2) పంచగవ్య అని పిలిచే ఆవు పాలు, మూత్రం, పేడ, పెరుగు, నెయ్యితో వ్యవసాయం, ఆరోగ్యపరంగా, ఇతరత్రా కలిగే ప్రయోజనాలను శాస్త్రీయంగా రుజువు చేసే ప్రాజెక్టులను ఈ సంఘం ఎంపిక చేస్తుంది.
   3) ఈ కార్యక్రమానికి ప్రభుత్వం 'సైంటిఫిక్ వాలిడేషన్ అండ్ రిసెర్చ్ ఆన్ పంచగవ్య (ఎస్‌వీఏఆర్‌వోపీ)గా నామకరణం చేసింది.
   4) ఎస్‌వీఏఆర్‌వోపీకి మార్గదర్శకత్వం వహించే సంఘం కాలవ్యవధి మూడేళ్లుగా ప్రభుత్వం పేర్కొంది.
   ఎ) 1, 2 బి) 1, 2, 3 సి) 1, 3, 4 డి) పైవన్నీ
20. 'ది ఆర్గ్యుమెంటేటివ్ ఇండియన్' అనే డాక్యుమెంటరీని దర్శకుడు సుమన్ ఘోష్ ఎవరి జీవితంపై రూపొందించారు?
   ఎ) ఏపీజే అబ్దుల్ కలాం బి) ప్రణబ్ ముఖర్జీ
   సి) నరేంద్ర మోదీ డి) అమర్త్యసేన్
21. ఐక్య రాజ్య సమితి ఆర్థిక సామాజిక మండలి (ECOSOC) ఆధ్వర్యంలో సుస్థిరాభివృద్ధిపై 2017 జులైలో న్యూయార్క్‌లో నిర్వహించిన అత్యున్నత రాజకీయ వేదిక (హెచ్‌ఎల్‌పీఎఫ్) సమావేశంలో మన దేశం నుంచి పాల్గొన్న ఏకైక రాష్ట్రం ఏది?
   ఎ) ఆంధ్రప్రదేశ్ బి) తమిళనాడు
   సి) కర్ణాటక డి) కేరళ

మూగబోయిన బిగ్ బెన్



- దాదాపు రూ. 240 కోట్లతో చేపడుతున్న మరమ్మతులు, ఆధునికీకరణ పనుల కారణంగా లండన్‌లోని ప్రఖ్యాత గడియారం 'బిగ్‌బెన్' 2017 ఆగస్టు 21 న మూగబోయింది.
- వ్యవహారికంగా బిగ్‌బెన్, ది గ్రేట్ బెల్‌గా పిలుస్తున్నప్పటికీ అధికారికంగా దీన్ని ఎలిజబెత్ టవర్‌గా పేర్కొంటారు.
- 13 టన్నుల బరువుండే బిగ్‌బెన్ మళ్లీ 2021 లో మోగనుంది. బిగ్‌బెన్ రోజూ ప్రతి గంటకూ ఒక్కసారి చొప్పున మోగుతుంది. దీనిచుట్టూ ఉండే నాలుగు గంటలు ప్రతి 15 నిమిషాలకు ఒకసారి మోగుతాయి.

22. కింది అంశాల్లో సరైనవి ఏవి?
   1) దేశంలో పెట్టుబడులు పెట్టడానికి అనువుగా ఉండే రాష్ట్రాలతో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రిసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్) రూపొందించిన జాబితాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వరుసగా మూడు, అయిదు స్థానాల్లో నిలిచాయి.
   2) ఈ జాబితాలో గుజరాత్ అగ్రస్థానంలో ఉంది.
   3) దిల్లీ (2), హరియాణా (4), తమిళనాడు (6), కేరళ (7), మహారాష్ట్ర (8), కర్ణాటక (9), మధ్యప్రదేశ్ (10) తొలి 10 స్థానాల్లో నిలిచాయి.
   4) 2016 జాబితాలో కూడా గుజరాత్, దిల్లీ తొలి రెండు స్థానాల్లోనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో, తెలంగాణ 13 వ స్థానంలో ఉన్నాయి.
   ఎ) 1, 2 బి) 1, 2, 3 సి) 1, 2, 4 డి) పైవన్నీ
23. కింది అంశాల్లో సరైనవి గుర్తించండి.
   1) తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ 2017 ఆగస్టు 19 న భారతీయ ఆహార, వ్యవసాయ మండలి (ఐసీఎఫ్ఏ - ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్) నాయకత్వ పురస్కారానికి ఎంపికయ్యారు.
   2) ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ విధాన నాయకత్వ విభాగం కింద కేసీఆర్‌ను పురస్కారానికి ఎంపిక చేసింది.
   3) సెప్టెంబరు 5 న దిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో జరిగే ప్రపంచ వ్యవసాయ నాయకత్వ శిఖరాగ్ర సదస్సులో కేసీఆర్ ఈ పురస్కారాన్ని అందుకుంటారు. వ్యవసాయ గ్రామీణాభివృద్ధికి కృషి చేసిన వారికి 2008 నుంచి ఈ పురస్కారాన్ని ఐసీఎఫ్ఏ అందిస్తోంది.
   4) తెలంగాణలో వివిధ పథకాల ద్వారా గ్రామీణ ప్రజలు, వ్యవసాయదారుల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు విశేష కృషి చేస్తున్నందుకు కేసీఆర్‌ను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు మండలి ఛైర్మన్ ఎంజే ఖాన్ ప్రకటించారు.
   ఎ) 1, 2 బి) 1, 2, 3
   సి) 1, 3, 4 డి) పైవన్నీ

మూడుసార్లు తలాక్ చెల్లదన్న సుప్రీంకోర్టు



★ మూడుసార్లు (ట్రిపుల్) తలాక్ చెప్పి విడాకులు తీసుకునేందుకు ముస్లింలలో ఉన్న పద్ధతి చెల్లనేరదని 2017 ఆగస్టు 22 న సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. చాలా కాలం నుంచి వివాదానికి, చర్చోపచర్చలకు తావిస్తున్న ఈ విధానంపై సర్వోన్నత న్యాయస్థానం చరిత్రాత్మకమైన తీర్పునిచ్చింది. ఖురాన్ మూల సూత్రాలకూ ఇది వ్యతిరేకంగా ఉందని వ్యాఖ్యానించింది.

★ ఈ మేరకు 3-2 ఆధిక్యంతో అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 395 పేజీలతో సంచలనాత్మక తీర్పు వెలువరించింది. ఏ రకంగా చూసినా ఈ పద్ధతి సరికాదని చెబుతూ, 1400 ఏళ్లుగా ముస్లిం సమాజంలో కొనసాగుతూ వచ్చిన ఆచారానికి తెరదించింది.

★ ముమ్మారు తలాక్‌తో విడాకులు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ఆరు పిటిషన్లపై ధర్మాసనం తాజా తీర్పు వెలువరించింది. సాయరా బానో, ఇష్రత్ జహాన్, గుల్షన్ పర్వీన్, అఫ్రీన్ రెహ్మాన్, అతియా సబ్రీలతో పాటు భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ అనే సంస్థ ఈ పిటిషన్లు దాఖలు చేశాయి.

★ ముమ్మారు తలాక్ పద్ధతి రాజ్యాంగ అతిక్రమణేనని, దీన్ని రద్దు చేయాల్సిందేనని జస్టిస్ కురియెన్ జోసెఫ్, జస్టిస్ ఆర్.ఎఫ్. నారీమన్, జస్టిస్ యు.యు. లలిత్ అభిప్రాయపడగా, ముమ్మారు తలాక్ అనేది మతపరమైన ఆచారమనీ, దాన్ని ఆరునెలల పాటు నిలుపు చేసి, ప్రభుత్వం ఒక చట్టం చేయడం మేలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్. ఖేహర్, జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ తమ తీర్పులో అభిప్రాయపడ్డారు.

జవాబులు

1–ఎ	6–ఎ	11–డి	16–ఎ	21–ఎ
2–బి	7–ఎ	12–ఎ	17–సి	22–డి
3–డి	8–బి	13–డి	18–సి	23–డి.
4–సి	9–సి	14–ఎ	19–డి	
5–బి	10–బి	15–సి	20–డి	

హాయ్! బుజ్జీ!!

> కష్టాల్ని ఓర్చి పనిచేసినప్పుడే
> మనిషికి విజయం విలువ
> తెలుస్తుంది
> – అబ్దుల్ కలాం

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Quarter = నాలుగో భాగం
- మలయుజం = చందనం

చిలిపి ప్రశ్న

సముద్రము మధ్యలో ఏముంటుంది?

ఒకే ప్రశ్న



ఇప్పటి రెండు రూపాయల నాణెం బరువెంతో తెలుసా?

చెప్పుకోండి చూద్దాం

పక్కనున్న పెద్ద కథనం మొత్తం చదివితే ఇక్కడి ఖాళీల్ని పూరించొచ్చు. ఏ రూపాయి ఎక్కడ తయారైందో గుర్తించి గడుల్లో రాయండి.



1



2

అది ఎవరు?



పైనున్న గణపతిని పోలిఉన్న దేవరు?

a



b




c



ఎంతెంత గొప్పంట.. రూపాయి బిళ్లంట!

కొత్తక వింత పాతొక రోత అన్నది సామెత. అందుకే మొన్నొచ్చి తళతళ మెరిసిపోతున్న కొత్త 200 నోటును మనమంతా ఆసక్తిగా చూస్తున్నాం. అది చూసి రూపాయి బిళ్ల చిన్నబోయింది. 'ఇప్పుడిప్పుడు వచ్చిందని అంతా దాన్ని చిత్రంగా చూస్తున్నారు. మరి ఎప్పటి నుంచో ఉన్న మా నాణేల్ని మాత్రం ఎప్పుడూ పట్టించుకోరేం. అసలు పిల్లాడి చేతిలో అమ్మ ఒక్క నాణెం పెట్టిందంటే వాడి ముఖంలో ఆనందం చూడాలి. అసలదీ రూపాయి మజాకా' అంటూ దాని గొప్పలేవో తనే చెప్పడం ప్రారంభించింది.



మన దేశంలో ఐదు, పది వేల నోట్లు ఉండేవి తెల్సా. ఎప్పుడంటే 1954–1978ల మధ్య.



గ్రాఫిక్: పార్థు

మా చరిత్ర ఎంతో ఘనమండీ!

- ప్రపంచంలో మొదటగా డబ్బు నాణేలు వాడిన వాళ్లలో భారతీయులూ ఒకరు. క్రీస్తు పూర్వం ఆరో శతాబ్దం నుంచీ ఇక్కడ మా గలగలున్నాయి.
- 1509-1529ల మధ్య శ్రీకృష్ణదేవరాయలు పాలనలో మా నాణేలన్నీ బంగారంతోనే తయారయ్యేవి. మౌర్యుల కాలంలో వెండి నాణేలే డబ్బులు.
- ఇప్పుడంటే మా విలువ తగ్గి పెద్ద నోట్ల వాడకం పెరిగిపోయిందిగానీ.... మీ తాతలు, ముత్తాతలూ అంతా మమ్మల్నే వాడేవాళ్లు. పైసలతోనే పళ్లూ, కూరగాయల్లాంటివీ కొనుక్కునేవాళ్లు. పైసా, రెండు, మూడు పైసల్లాంటి నాణేలు ఇప్పుడు మీలో ఎంత మందికి తెలుససలు? చూద్దామన్నా కనిపించవిప్పుడు.
- ఇప్పుడు మీరు చూస్తున్న మా నాణేలు 1950 తర్వాత తయారైనవే. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) మమ్మల్ని తయారు చేయిస్తుంది.
- మేమంతా ఓ రకమైన ఉక్కు, నికెల్ లోహాలతో తయారవుతున్నాం.

మా పుట్టుక ఇక్కడేనండీ!

మేమూ, మా అన్నలూ ఎక్కడ నుంచి పుట్టుకొస్తామో తెలుసా? హైదరాబాద్, ముంబయి, కోల్‌కతా, ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాల నుంచి. అక్కడి ప్రభుత్వ తయారీ కేంద్రాల్లో తయారవుతాం.

మేం ఎక్కడ తయారయ్యామన్న దాన్ని మీరు చిటికెలో చెప్పేయొచ్చు. నాణెంపై ఎప్పుడు తయారైందో తెలిసేలా సంవత్సరం సంఖ్య ఉంటుంది కదా. దానికి కిందవైపు చూడండి. అక్కడ గుండ్రటి చుక్క ఉంటే నోయిడా, నక్షత్రం ఉంటే హైదరాబాద్, డైమండ్ ఉంటే ముంబయి, ఏ గుర్తూ లేకపోతే కోల్‌కతాలో తయారయినట్లు అర్థమన్నమాట.

ఆశ్చర్యపోతారండీ!

- ఇంతకీ మా తయారీకి ఎంత ఖర్చవుతుందో తెలుసా? మా పెద్దన్న పది నాణెం తయారీకి ఆరు రూపాయలకు పైగా ఖర్చు పెట్టాల్సిందే.
- మా చిన్నన్న ఐదు రూపాయల నాణేన్ని చూసుంటారు. ఆ మధ్య ఓసారి దీన్ని బంగ్లాదేశ్ వాళ్లు స్మగ్లింగే చేసేసుకున్నారు. ఎందుకనుకుంటున్నారు. గడ్డం గీసుకునే బ్లేడ్‌ల తయారికి. దిట్టంగా ఉండే ఒక ఐదు బిళ్లని కరిగిస్తే ఆరు బ్లేడ్‌లు తయారవుతాయట. వాటిని రెండు రూపాయలకొకటి చొప్పున అమ్మేసేవారు. అంటే ఐదు బిళ్లని కరిగించి 12 రూపాయల విలువైన బ్లేడ్‌లను అమ్మేసేవారన్న మాట. తర్వాత ఈ విషయం మన ప్రభుత్వానికి తెలిసి వీటిని అక్రమ రవాణాని నిలిపేసిందిలేండి.

నవ్వుల జల్లులు!



టీచర్: రాముా! పులికీ, కోడికీ తేడా ఏంటో చెప్పు?

రాము: పులి క్రూర జంతువు, కోడి కూర జంతువు టీచర్!

టీచర్: ఒక భోజనం ప్లేటు 100 రూపాయలైతే రెండు భోజనాలు ఎంతవుతాయిరా?

కిట్టు: రెండు ప్లేట్లే రెండొందలవుతాయి. భోజనంతో కలిపైతే చాలానే ఎక్కువ అవుతాయేమో టీచర్!

- తోట తిరుపతిరావు, విశాఖపట్నం

సుడోకు

5	3				4			
		4	1					
1			9		6		8	3
9	7		3	2		6		
				4				
		3		6	9		7	2
3	5		6		7			4
					2	7		
			8				3	1

ఈ సుడోకును 1 నుంచి 9 వరకు అంకెలతో నింపాలి. ప్రతి అడ్డు, నిలువు వరుసల్లోనూ, 3X3 చదరాల్లోనూ అన్ని అంకెలూ ఉండాలి. ఏదీ రెండుసార్లు రాకూడదు.



అపాయంలో ఉపాయం!

కథ



ఒక చెరువులో ఒకే ఒక్క మొసలి ఉండేది. దానికి అహంకారం ఎక్కువ. అది చేపలతో తానే రాజుగా ప్రకటించుకుంది. చేపలు మొసలికి భయపడి అంగీకరించి, తమను కాపాడే బాధ్యత కూడా రాజుగారిదేనని మొసలితో అన్నాయి. మొసలి అందుకు అంగీకరించింది.

ఒక రోజు ఆకాశం నుంచి వచ్చిన కొంగ నీటిపైనున్న ఒక చేపను తన్నుకుపోయింది. అప్పుడు మిగతా చేపలు మొసలిని తప్పు పట్టాయి. మొసలికి కోపం వచ్చి 'మీకు ఇష్టం లేకపోతే ఈ చెరువు విడిచి, భూమిపైకి వెళ్లిపొండి' అని అంది. చేపలు మారుమాట్లాడకుండా కుక్కిన పేనుల్లా ఉండిపోయాయి. భూమిపైకి వెళ్తే అవి బతకవు గదా!

అప్పుడు చేపల్లోని ఒక తెలివిగల చేప మొసలితోనే కొంగల పని పట్టాలనుకుంది. దాని దగ్గరకు వెళ్లి 'మొసలి మామా! నీవు మమ్మల్ని కాపాడాలి. నీవు నీటికి రాజువు. కాబట్టి మాకు కూడా నీవే రాజువు. అంటే నీవే మా దిక్కు. మాకు నీవు దేవునితో సమానం' అని అంది.

మొసలి పరమానందం చెందింది. ఆ చేపతో 'నేనేం చెయ్యాలి. ఆ కొంగపై నుంచి ఎగిరివచ్చి చేపను తన్నుకుపోయింది. నీటిలో అడుగుపెట్టనీ దాని సంగతి చెబుతా' అని అంది.

అప్పుడు మేధావి చేప 'మొసలి మామా! నీవు పైకి నీ ముఖం కొద్దిగా కనిపించేటట్లు ఉండి చేపలా నటించు, ఆ కొంగ రాగానే దాన్ని నీ నోటితో లాగు' అంటూ సలహా ఇచ్చింది.

కొద్దిసేపటికే పైన ఎగురుతూ వచ్చిన కొంగ మొసలిని చేపగా భ్రమించి, నీటిపైన కనబడి, కనబడనట్లున్న మొసలిని తన ముక్కుతో అందుకోబోయింది. అదే అదనుగా మొసలి దాన్ని నోటితో పట్టి లాగి చంపేసింది. ఇది గమనించిన మిగతా కొంగలు తుర్రుమన్నాయి. చేపలు ఆనందపడ్డాయి. తెలివిగల చేప ఉపాయంతో చేపలకు కొంగ బాధ తప్పి హాయిగా జీవించాయి.

- సంగనబట్ల రామకిష్టయ్య

జాగృతి యువజన సమాఖ్య జిల్లా కమిటీ నియామకం

మహబూబాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ జాగృతి యువజన సమాఖ్య జిల్లా, నియోజకవర్గ, మండల నూతన కమిటీలను ఆదివారం నియమించినట్లు తెలంగాణ జాగృతి జిల్లా కన్వీనర్ గునిగంటి కమలాకర్, జిల్లా అధికార ప్రతినిధి మైలా చంద్రమౌళి తెలిపారు. జిల్లా కన్వీనర్‌గా గందశిరి వేణు, కోకన్వీనర్‌గా అమన్‌గోయెల్, బి.సుధాకర్, పి.సురేందర్, జీఆర్వోగా జి.రమేశ్‌నాయక్‌ను నియమించినట్లు వారు పేర్కొన్నారు. మహబూబాబాద్ నియోజకవర్గ కన్వీనర్‌గా డీవీ చారి, డోర్నకల్ నియోజకవర్గ కన్వీనర్‌గా డి.వినోద్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. వి.శేఖర్(మహబూబాబాద్), ఎం.యాకూబ్‌నాయక్(పెద్దవంగర) జె.మల్లేశ్(చిన్నగూడూరు) ఎ.బ్రహ్మం(మరిపెడ) ఎం.రాజేశ్(కురవి) కె.ప్రశాంత్(డోర్నకల్), డి.పురుషోత్తం(బయ్యారం), బి.శ్రీకాంత్(గూడూరు) ఎస్.సాయిచరణ్(కేసముద్రం) అలాగే మహబూబాబాద్, తొర్రూరు పట్టణ కమిటీలను నియమించినట్లు వారు వివరించారు.

'జాక్టో' ఆవిర్భావం

మానుకోట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) మహబూబాబాద్ జిల్లా స్టీరింగ్ కమిటీ స్థానిక ఎస్టీయూ భవన్‌లో జరిగిన సమావేశంలో ఏర్పాటైంది. విషయాన్ని జాక్టో బాధ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీలో కె.సుధాకర్‌చారి, ఎస్.ఏకాంబ్రచారి (ఎస్టీయూ), ఎం.మాధవ్, ఆర్.రాంరెడ్డి(టీడీటీఎఫ్), బి.జైత్రం, జేవీ రాం(డీజీటీయూ), పులి దేవేందర్, హల్యానాయక్ (టీపీఆర్టీయూ), కరుణాకర్, వెంకటనారాయణ (టీఆర్టీయూ), నాగముని, డి.వీరన్న (టీఎస్‌పీఎస్‌టీఎఫ్) ఉన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాక్టో నాయకులు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని, పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. సెప్టెంబర్ ఒకటిన పింఛన్ విఘాత దినంగా ప్రకటిస్తూ ఆ రోజున ఉపాధ్యాయులు, ఉద్యోగులు సామూహికంగా సీఎల్ పెట్టి నిరసన తెలపాలని కోరారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: మానసిక ఒత్తిడి తగ్గడానికి సోమవారం చేయాల్సిన దానాలు? ధూమ్ర వర్ణ గణపతిని పూజిస్తే వాస్తుదోషాలు పోతాయా? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: బలరామకృష్ణులు (రాజశేఖర్, రమ్యకృష్ణ).

మధ్యాహ్నం

12-00: స్పెషల్ అభి'రుచి': ఘుమఘుమలు 'ఉమేటో పలావు', మీచేతివంట 'బజ్జీమిర్చికూర', 'పంపాయిపల్లికుర్మా', జస్ట్ ఎమినిట్ 'మిరియాలగారెలు' తయారు చేసే విధానం. ఇంటింటి వంటింటి చిట్కాలు... 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00:వసంతం(డైలీ సీరియల్), 04-30: ఢీ 10 (రిపీట్), 06-00: శ్రీభాగవతం (భక్తిరసాత్మక దృశ్యకావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: అలీతో సరదాగా: నటి సితార, నటుడు రాజారవీంద్రలతో..., 10-30: సినీవారం: (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00జబర్దస్త్ రిపీట్
01:00 మైకేల్ మదన్ కామరాజు రిపీట్
01:15 ది బ్రేకప్ కన్సల్టెంట్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 హంగామా రిపీట్
సాయంత్రం
04:30 నా షో నా ఇష్టం
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 ఈ-జంక్షన్
09:00 పటాస్
09:30 అల్లరే అల్లరి
10:00 సరదాగా కాసేపు
10:30 నా షో నా ఇష్టం రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
- ★ డా.ఈటీవీ - (ఉ.6:30, 11:00, మ. 3:30, సా. 7:30)
- ★ యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా. 5:00, రా. 10:30)
- ★ అమృతం (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
- ★ హెల్తీ & బెస్టీ - (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)
- ★ ఆరోగ్యమస్తు (ఉ. 9:00, మ. 03:00, సా. 4:00, రా. 9:00)
- ★ ఆయుష్ (ఉ. 9:30)
- ★ లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (ఉ. 10:00)
- ★ అందరికీ ఆరోగ్యం (ఉ.10:30)
- ★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
- ★ హెల్తీ డయాబెటిక్ - (మ. 1:30)
- ★ జీవనరేఖ - ఉమెన్స్ హెల్త్ (మ. 2:00, రా. 7:00)
- ★ బాడీ మైండ్ & సోల్-అంతరంగం (మ. 2:30, రా. 9:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: మాయా మోహిని (నరసింహరాజు, స్మిత), 10-00: మార్నింగ్ షో: మాయదారి మరిది (సుమన్, మహాలక్ష్మి), మధ్యాహ్నం: 1-00: మాటినీ: అల్లుడుగారు (మోహన్‌బాబు, శోభన), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: కడపరెడ్డెమ్మ (శారద), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: సతీసావిత్రి (ఏఎన్నార్, ఎస్.వరలక్ష్మి), 10-00: సెకండ్‌షో: బంగారుబాపురం (కృష్ణ, జయప్రద).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - స్వినాచ్ బేసిల్ క్రేప్స్ & సొరకాయ తెలగపిండి రైస్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో - ఫ్రింగ్ స్ప్రింగ్ రోల్స్ & కాఫీ బీన్ అండ్ చికెన్ పాస్తా సలాడ్, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు - తమిళ్ మసాలా వడ & గుమ్మడిపండు లడ్డు, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు - బనానా చీజ్ పొట్రిడ్జ్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ (డయాబెటిక్ రెసిపీ) - గ్రీన్ స్మూతీ, ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్" - అటుకుల ఉప్మా & ఆలూ చిప్స్, మ.12.00: బెస్ట్ ఆఫ్ ఇండియా (తమిళనాడు క్యూసైన్) - కారమణి సుండల్ ఊతప్పం, మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ - షెజ్వాన్ టోఫు పరోటా, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కౌ" సూపర్ చెఫ్ - ఆపిల్ స్వీట్ బూంది, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - అవకాడో ఓట్స్ చాట్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (మెక్సికన్ స్పెషల్) - మెక్సికన్ ఫ్రైడ్ ఫిష్ & మెక్సికన్ చికెన్ బుర్రిటో, మ.1.30, రా.10.00: చటపట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - పైనాపిల్ రసం, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ - యాపిల్ క్రంబుల్ కేక్ & స్పెషల్ ఎగ్ నూడిల్స్, మ.2.15, రా.10.30: ఛెఫ్స్ స్పెషల్ - చిల్లీ గార్లిక్ పొటాటోస్, మ.2.30: చోటా షెఫ్ - ఎగ్ సలాడ్, మ.3.30: అతిథి - మీ ఇంటింటి నేస్తం, మ.5.15: స్నాక్స్ - బొబ్బర్ల కుడుములు.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 మంతారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 మంతారావం, 09-30 సుఖీభవ, 10-00 మంతారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 మంతారావం, 11-30 ఇది సంగతి, మధ్యాహ్నం: 12-00 మంతారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 మంతారావం, 02-35 సఖి, 03-00 మంతారావం, 03-30 సుఖీభవ, సాయంత్రం: 04-00 మంతారావం, 04-30 తీర్థయాత్ర: సిద్ధి వినాయక ఆలయం, అస్సిన్ అమెరికా 05-00 మంతారావం, 05-30 అంతర్యామి, 0 6-00 మంతారావం, 06-30 జై కిసాన్, రాత్రి: 07-00 మంతారావం, 07-30 ఇది సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 మంతారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 మంతారావం,11-30 ఇది సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 మంతారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 మంతారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 మంతారావం, 10-30 సుఖీభవ, 11-00 మంతారావం, 11-30 ఇది సంగతి, మధ్యాహ్నం: 12-00 మంతారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 మంతారావం, 02-35 సఖి, 03-00 మంతారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ గణపతి పంచాయతన మందిరం, సాంగ్లీ, మహారాష్ట్ర, సాయంత్రం: 04-00 మంతారావం, 04-30 సుఖీభవ, 05-00 మంతారావం, 05-30 అంతర్యామి, 06-00 జై కిసాన్, రాత్రి: 07-00 మంతారావం, 07-30 ఇది సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 మంతారావం,10-30 ఈటీవీ టాకీస్, 11-00 మంతారావం, 11-30 ఇది సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 28-08-2017

ఎస్వీబీసీ: ఉదయం: 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామ స్తోత్రం, 07-30 శ్రీవారిసేవలు (తోమాలసేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకు వేళాయె - శివుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 లైవ్ నాదనీరాజనం - తిరుమల, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్తమాల్యద, మధ్యాహ్నం: 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్రనామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 పారాయణాలు, 03-30 విష్ణుపురాణం, సాయంత్రం: 04-30 క్షేత్ర దర్శిని, 05-00 లైవ్ ఎస్.వి.సేవ - తిరుమల + ప్రత్యేక వార్తలు, ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, రాత్రి: 07-30 లైవ్ మంగళాశాసనం - శ్రీనివాసగద్యం + శివపంచాక్షరి + లింగాష్టకం, 08-00 భక్తిచైతన్యం, 08-30 ధర్మసోపానాలు - శ్రీ చాగంటి, 09-00 ఆలయ దర్శనం - మహారాష్ట్ర, 09-30 దేవిసప్తశతి - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనికపర్వం.

భక్తి టీవీ: ఉదయం: 06-00 శ్రీ శివ సహస్రం, 06-30 నమకంచమకం, 07-00 అర్చన, 07-30 శ్రావణలక్ష్మి నమోస్తుతే, 08-00 గణపతి దర్శనం, 08-30 లైవ్ గణేశ (లైవ్), 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, సాయంత్రం: 04-30 గణపతి దర్శనం, 05-00 శివస్తోత్రం, 05-30 శ్రీశివసహస్రం, 06-00 నమకంచమకం, రాత్రి: 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 జై..జై.. గణేశా (లైవ్), 08-30 రామాయణ తరంగిణి, 09-00 మహాగణపతిం, 09-30 వినాయక వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు: ఉదయం: 07-30 ఓంకారం, 08-00 సినిమా: బుజ్జిగాడు, 11-00 కామెడీ కిలాడీలు రిపీట్, మధ్యాహ్నం: 12-00 గోల్డెన్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, సాయంత్రం: 04-00 కామెడీ కిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., రాత్రి: 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 డిట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: బలుపు.

మా: ఉదయం: 06-30 సిల్వర్ ట్రీట్స్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు, 08-30 శ్రీనివాస చరితం, 09-00 సినిమా: ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, మధ్యాహ్నం: 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్‌బాస్, 02-00 బిగ్‌బాస్ రిపీట్, సాయంత్రం: 04-00 బిగ్‌బాస్ రిపీట్, 05-30 ఓ జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, రాత్రి: 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్‌బాస్, 10-30 బిగ్‌బాస్ రిపీట్.

జెమినీ: ఉదయం: 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: జానకి వెడ్స్ శ్రీరామ్, మధ్యాహ్నం: 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 దేవత (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాని 2 (రిపీట్), 03-00 సినిమా: జేమ్స్ బాండ్, సాయంత్రం: 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, రాత్రి: 07-00 నాతిచరామి, 07-30 నాని 2, 08-00 నువ్వునాకు నచ్చావ్, 08-30 శశిరేఖపరిణయం దివ్య చరిత, 09-00 నందిని, 09-30 సినిమా: నువ్వొస్తానంటే నేనొద్దంటానా.

హెచ్‌బీవో: ఉదయం: 06-00 జొనా హెక్స్, 07-03 స్పై కిడ్స్: ఐలాండ్ ఆఫ్ లాస్ట్ డ్రీమ్స్, 08-55 చార్లీ అండ్ ది చాకొలెట్ ఫ్యాక్టరీ, 10-52 ది డార్క్‌నెస్, మధ్యాహ్నం: 01-23 ఏజ్ మ్యాన్ 3, 3-13 డీప్ బ్లూ సీ, సాయంత్రం: 05-00 ది ఎకౌంటెంట్, 06-56 జాక్ ది జెయింట్ స్లేయర్, రాత్రి: 9-00 పాలిన్ సాకర్, 10-49 ది హ్యాంగ్ ఓవర్ పార్ట్ 2.

పత్తిలో గులాబి రంగు పురుగు నివారణ

ప్రస్తుతం పత్తి 50నుంచి 65రోజులు దశలో ఉంది. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ గులాబి రంగు పురుగు (రెక్కల పురుగు) ఉనికిని గమనించటం జరిగింది. ఈ పురుగు గత రెండు సంవత్సరాలుగా బీటీ పత్తినికూడా ఆశించి నష్టపరుస్తోంది. కాబట్టి ఈ పురుగు ఉధృతిని తెలుసుకొని సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టి పురుగులను నివారించాల్సిన అవసరం ఉందని ఖమ్మం డాట్‌సెంటర్ సమన్వయకర్త డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు.

గులాబిరంగు పురుగు: తల్లి పురుగులు లేత ఆకుల అడుగు భాగాన, లేత కొమ్మల పైన, పూమొగ్గల పైన, లేత కాయల పైన, రక్షక పత్రాల పైన గుడ్లను గుంపులుగా లేదా విడివిడిగా పెడతాయి. ఈ గుడ్ల నుంచి బయటకు వచ్చిన కంటికి కనిపించని చిన్న లార్వాలు పూమొగ్గ లోనికి తొలుచుకుపోయి లోపల పదార్థం తిని వాటిని గుడ్డిపూలుగా మార్చుతాయి. పురుగు కాయ లోనే ఉండి గింజలను తినటం ద్వారా దూది రంగు, నాణ్యత పూర్తిగా దెబ్బ తింటాయి. పురుగు లార్వా దశ మొత్తం కాయ లోనే గడపటం వల్ల కాయ పగిలిన తర్వాత మాత్రమే నష్టాన్ని గుర్తించగలం. ఈ పురుగు నష్టాన్ని గుర్తించటానికి పొలం లోని గుడ్డి పూలను,



పత్తిని ఆశించిన గులాబీ రంగు పురుగులు

కాయలను తెరిచి లోపలి భాగాన్ని చూస్తే లోపల గులాబిరంగు గొంగళి పురుగును గమనించవచ్చు.

చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు: పత్తి విత్తిన 45 రోజుల నుంచి గులాబి రంగు పురుగు ఉనికిని గమనించటానికి ఎకరాకు 4-5 లింగాకర్షక బుట్టలను అమర్చి బుట్టల్లో వరుసగా మూడు రోజులు 7-8 తల్లి రెక్కల పురుగులు పడటం గమనించిన లేదా 10 శాతం గుడ్డిపూలు గమనిస్తే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఎకరాకు 8 లింగాకర్షణ బుట్టలు పెట్టుకుంటే పురుగుల ఉధృతిని నియంత్రించవచ్చు. పురుగు నష్టపరిమితి స్థాయి దాటిన వెంటనే 5 మి.లీ. వేపనూనె లీటరు నీటికి కలిపి పిచికారీ చెయ్యాలి. అవసరమయితే క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పైరుపై పిచికారీ చేయాలి. పంట కాలంలో ఒకటి రెండుసార్లు మాత్రమే సింథటిక్ పైరిత్రాయిడ్స్ మందులైన సైపర్‌మెత్రిన్ 25 శాతం 1 మి.లీ లేదా లామ్డాసైహాలోత్రిన్ 5 శాతం 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చెయ్యాలి. పంట మార్పిడి పద్ధతిని ప్రతి రెండు మూడేళ్లకోసారి విధిగా పాటించాలి. తక్కువ కాలపరిమితి గల రకాలను ఎంపిక చేసుకొని సకాలంలో విత్తుకోవటం ద్వారా గులాబిరంగు పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చు. పత్తి పంట దగ్గర్లో బెండ పంట లేకుండా చూసుకోవాలి. గట్ల మీద, చుట్టూ కలుపు మొక్కలు లేకుండా తీసెయ్యాలి. నీటి వసతి ఉన్నప్పటికీ పత్తిని ఏడు నెలలకు మించి సాగు పొడిగించ కూడదు. నీటి వసతి ఉన్న చోట రెండో పంటగా ఇతర ఆరుతడి పంటలను సాగు చేయటం ఉత్తమం. పత్తి మోళ్లను చేలో నిల్వ చేయకూడదు.

–న్యూస్‌టుడే, ఖమ్మం (వ్యవసాయం)

అపరాలలో పల్లాకు తెగులు

ఖరీఫ్‌లో ప్రస్తుతం అపరాల పంట పూతదశలో ఉంది. ఈ సమయంలో అధిక ఉష్ణోగ్రత, వర్షాభావ పరిస్థితుల వలన పెసర పంటను రసంపీల్చే తెల్లదోమ ఆశించిందని, ఈ పురుగుల వలన అక్కడక్కడ పల్లాకు తెగులు కనిపిస్తుంది.



పల్లాకు తెగులు సోకిన పైరు

తెల్లదోమ: తల్లి, పిల్ల పురుగులు ఆకులు అడుగు భాగాన చేరి రసం పీల్చడం వలన మొక్క ఎదుగుదల తగ్గిపోతుంది. ఇది మొక్క తొలిదశలో అధిక నష్టం కలుగచేస్తాయి. ఈ తెల్లదోమ పల్లాకు తెగులు వ్యాప్తిలో కీలకపాత్ర పోషిస్తాయి. దీని వలన మొక్కల ఆకులు పసుపురంగుకు మారి, ఎదుగుదల లేక పూత, కాత మందగిస్తుంది. పొలమంతా పసుపు రంగుకు మారుతుంది.

నివారణ: పల్లాకు తెగులు సోకిన మొక్కలను పీకి పొలం బయటికి చేర్చి తగులబెట్టడం ద్వారా ఈ తెగులు వ్యాప్తిని అరికట్టవచ్చు. పసుపు రంగు జిగురు డబ్బాలను పొలంలో ఉంచి పురుగు ఉధృతి గమనించి తగిన చర్యలు చేపట్టాలి. పురుగు తక్కువ స్థాయిలో ఉన్నప్పుడు వేప కషాయం 5 శాతం ద్రావణం పిచికారి చేయాలి. పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు 300 మి.లీ. క్వినాల్‌ఫాస్ లేదా 400 మి.లీ. ట్రైజోఫాస్ 200 లీటర్ల నీటికి కలిపి ఎకరా విస్తీర్ణంలో పిచికారి చేయాలి. పొలం లోనూ గట్ల పైన కలుపు లేకుండా చూడాలి. మెట్ట పెసరలో నేల తేమ తగ్గిన వెంటనే అంతరకృషి చేయాలి.

ఎంజీఎం ఆసుపత్రిలో రక్త పరీక్షలు బంద్

❒ ప్రయోగశాలలో మూలకుచేరిన సెల్ కౌంటర్

❒ పనిచేయని ఏసీలతో ముప్పు



ఆస్పత్రిలో మూలకు చేరిన పరికరం

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఆరోగ్య ప్రదాయినిగా గుర్తింపు పొందిన ఎంజీఎం ఆసుపత్రిలో రక్త పరీక్షలు ప్రస్తుతం నిలిచిపోయాయి. ఆస్పత్రిలోని అత్యవసర విభాగంలో ఉన్న ప్రయోగశాలలో సెల్ కౌంటర్ పరికరం కొద్ది రోజులుగా పనిచేయడం లేదు. ఈ కారణంగా రక్త పరీక్షలు బంద్ అయ్యాయి. ఈ పరికరం సాయంతో రక్తంలోని హీమోగ్లోబిన్ శాతం, కంప్లీట్ బ్లడ్ పిక్చర్ తదితర పరీక్షలు చేస్తారు. ఆయా పరీక్షలను ఏదైనా ఆపరేషన్ అవసరమైనవారికి, డెంగీ, జ్వర పీడితులు, ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారితో పాటు ఇతరత్రా పలు సందర్భాల్లో చేయించాలని రోగులు, వారి బంధువులకు వైద్యులు సూచిస్తారు. సెల్ కౌంటర్ పరికరంలో వివిధ రకాల రక్త నమూనా పరీక్షల్ని చేసే వీలుంటుంది. అయితే ఇది మరమ్మతులకు గురవడంతో ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లను బాధితులు, వారి బంధువులు ఆశ్రయిస్తున్నారు. రాత్రివేళల్లో అత్యవసర సమయాల్లో వైద్య పరీక్షల్ని చేయించుకోవడం గ్రామీణులకు ఎంతో కష్టంగా మారుతోంది. సాధారణ, ముఖ్యమైన రక్త పరీక్షలు చేయించాల్సిన అవసరం ఉండడంతో రోగులు, వారి బంధువులు అధిక ధర చెల్లించి రక్తపరీక్ష కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. వివిధ రకాల వైద్య పరికరాలున్న ప్రయోగశాలలో ఏసీలు పనిచేయడం లేదు. ఆయా పరికరాలను శీతలీకరణ యంత్రాల మధ్యలోనే ఉంచి నిర్వహించాల్సి ఉంటుంది. ల్యాబ్‌లో రెండు ఏసీలున్నప్పటికీ అవి పనిచేయకపోవడంతో గది వాతావరణంలో వైద్య పరికరాలు పనిచేయడంలేదు. తరచుగా మొరాయిస్తున్నాయి. ఏసీలు నడిస్తే వైద్య పరికరాలు సక్రమంగానే పనిచేస్తాయని టెక్నీషియన్లు చెబుతున్నారు.

జలపాతం.. జనారణ్యం

❒ వాగుకు వరద తాకిడి

❒ జలపాతం వద్ద పర్యాటకుల సందడి



పర్యాటకుల కేరింతలతో కోలాహలంగా మారిన జలపాతం

వాజేడు, న్యూస్‌టుడే: బొగత జలపాతం.. జనారణ్యాన్ని తలపిస్తోంది.. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో జలపాతం ఉద్ధృతితో ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఇది ఏర్పడిన చీకుపల్లివాగుకు వరద తాకిడి పెరిగిన విధంగానే జలపాతం సందర్శనకు పర్యాటకుల తాకిడి పెరిగింది. దట్టమైన అడవిలో సందర్శకులను విపరీతంగా ఆకర్షిస్తున్న బొగత జలపాతం తిలకించేందుకు వర్షంలోనూ తరలివస్తున్నారు. పర్యాటకులతో దట్టమైన అటవీ ప్రాంతం జనారణ్యాన్ని తలపిస్తోంది. ఆదివారం పరిసరాలు సందర్శకులతో నిండిపోయాయి. ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న జలపాతం నీటి తుంపర్లు పొగమంచులా పర్యాటకులను కప్పేస్తోంది. రాతికట్ట పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. రాళ్ల పైనుంచి తెల్లని వరదనీరు ప్రవాహంలో స్నానాలు చేసేందుకు పర్యాటకులు ఉల్లాసంగా గడిపేందుకు తహతహలాడుతున్నారు. వరద ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో ప్రవాహం లోపలికి వెళ్లకుండా పర్యాటకులను నిలువరించేందుకు అటవీ సిబ్బంది తంటాలు పడుతున్నారు. జలపాతం నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని తిలకించిన పర్యాటకులు ఉత్సాహంతో వరద నీటిలో కేరింతలు కొడుతున్నారు.

వాహనం.. పచ్చదనంతో మటుమాయం..!



ప్రభుత్వ వాహనాలంటే అధికారులు.. ఉద్యోగులకు శ్రద్ధలేదని చెప్పడానికి ఈ చిత్రమే సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. పాత, తుప్పు పట్టిన వాహనాలను నిర్లక్ష్యంగా వదిలేస్తుండడంతో అవి ఎండకు ఎండి.. వర్షానికి తడిసి చుట్టూ పిచ్చిమొక్కలు, పొదలు పెరిగి వృథాగా మిగులుతున్నాయి. నిబంధనల ప్రకారం వీటిని వేలం ద్వారా విక్రయించాలి. అయితే ఏళ్లు గడస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో పాత వాహనాలు మరింత పాడవుతున్నాయి. వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టరేట్ క్యాంటీన్ వెనుక ప్రాంతంలో వదిలేసిన వాహనాల్లో ఓ జీపును ఆసరాగా చేసుకుని లతలు అల్లుకుపోయాయి. వాహనాన్ని చుట్టుముట్టినట్లుగా పెన వేసుకున్నాయి. దగ్గరకు వెళ్లి చూస్తేనే అక్కడో వాహనం ఉన్నట్లు తెలుస్తుంది. కలెక్టరేట్‌లో అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రతిబింబిస్తున్న ఈ వాహనాన్ని రోజూ వివిధ పనులపై వచ్చే ప్రజలు చూసి ముక్కున వేలేసుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, ఆరేపల్లి



ప్రయాణికులకు శుద్ధ జలం అందించాలి

డివిజనల్ డిప్యూటీ చీఫ్ మెడికల్ డైరెక్టర్ స్వర్ణజ్యోతి

రైల్వేస్టేషన్ (శివనగర్), న్యూస్‌టుడే: ప్రయాణికులకు స్వచ్ఛమైన, పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ డిప్యూటీ చీఫ్ మెడికల్ డైరెక్టర్ స్వర్ణజ్యోతి సూచించారు. స్వచ్ఛ రైలు పక్షోత్సవాలలో భాగంగా ఆదివారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛనీరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని మూడు ప్లాట్‌ఫాంలలోని తాగునీటి కుళాయిలను, వాటి నుంచి ప్రయాణికులకు చేరుతున్న నీటిని పరీక్షించారు. నీటిలో క్లోరిన్ శాతం ఎంతుంది, నిబంధనల ప్రకారమే నీటిలో వేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. నీటిని శుద్ధి చేస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. కుళాయిలు, వాటి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని స్థానిక అధికారులకు సూచించారు. స్టేషన్ పైనున్న ట్యాంకులను పరిశీలించి నిర్ణీత సమయం ప్రకారం శుభ్రం చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా రెండేళ్లుగా పనిచేయని ఆర్వో నీటి శుద్ధి ప్లాంట్ గురించి రైల్వే ఉద్యోగులు ఆమె దృష్టికి తీసుకెళ్లగా వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. స్టేషన్‌లో స్వచ్ఛ నీటిపై ప్రయాణికులకు అవగాహన కల్పించే నాటికలు ప్రదర్శించారు. పలు రైళ్లలోని ప్యాంట్రీకార్‌లలో నీటిని తనిఖీ చేశారు. అదే సమయంలో వచ్చిన దురంతో రైల్లో బాత్రూంకు వెళ్లిన ప్రయాణికుని కాలి వేలుకు గాయంకాగా ప్రయాణికుడి ఫిర్యాదు మేరకు కాజీపేట ఏడీఎంవో డాక్టరు కమల అతనికి ప్రాథమిక వైద్య చికిత్స అందించారు. కార్యక్రమంలో సీనియర్ డీఈఈ శేఖర్‌బాబు, స్టేషన్ మేనేజర్ గన్నవరం వెంకటేశ్వర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్ మీనా, రామానాయక్, దేవరాజ్, ఆర్పీఎఫ్ సీఐ నర్సింహ తదితరులు ఉన్నారు.



నీటిని పరీక్షిస్తున్న డాక్టరు స్వర్ణజ్యోతి, ఏడీఎంవో డాక్టర్ కమల తదితరులు

కోటలో ఇంజినీరింగ్ విద్యార్థుల సందడి



కాకతీయుల చరిత్రను విద్యార్థులకు వివరిస్తున్న గైడ్ రవి

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ఖిలావరంగల్ కోట ప్రాంతాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 110 మంది విద్యార్థులు సందర్శించారు. మధ్య కోట కళాతోరణాల నడుమ కొలువుదీరిన శిల్పాలను తిలకించినవారంతా ఆనందాశ్చర్యాలను వ్యక్తంచేశారు. స్వయంభూ దేవాలయం, కుష్‌మహల్, ఏకశిలగుట్ట, రాతికోట, మట్టికోట ప్రాంతాలను సందర్శించారు. అనంతరం భద్రకాళి, వేయిస్తంభాల దేవాలయాలను సందర్శించారు. విద్యార్థులకు కాకతీయుల చరిత్రను పర్యటక శాఖ గైడ్ రవి యాదవ్ వివరించారు.